

ఏయూలో ఎయిడెడ్ రచ్చ!



- వీసీతో జరిగిన సమావేశంలో ఎయిడెడ్ ఫ్యాకల్టీని వెనక్కి పంపాలని స్పష్టం చేసిన ప్రిన్సిపాళ్లు, హెచ్‌వోడీలు
- తమకు వచ్చే ఏడాది జూన్ వరకు కాలపరిమితి ఉందంటున్న ఎయిడెడ్ అధ్యాపకులు
- మంత్రి నారా లోకేశ్‌ను కలిసేందుకు సన్నాహాలు

-6లో

సర్వర్‌తో సమస్యలు

ఉపాధ్యాయుల బదిలీల దరఖాస్తుల స్వీకరణలో గందరగోళం

- ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ దరఖాస్తుల మధ్య వ్యత్యాసం
- సర్వీస్ పాయింట్ల కేటాయింపులో తికమక



సీతమ్మధారలోని ఎస్ఎఫ్ఎస్ స్కూల్‌లో బదిలీల దరఖాస్తులను పరిశీలిస్తున్న విద్యాశాఖాధికారులు, సిబ్బంది

- స్కూల్ అసిస్టెంట్ల బదిలీల దరఖాస్తుకు గడువు పెంచాలి: టీచర్లు

విశాఖపట్నం, మే 25 (ఆంధ్రజ్యోతి): **ఉపాధ్యాయుల బదిలీలకు సంబంధించి దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ గందరగోళంగా మారింది. దరఖాస్తు చేసేటప్పుడు సాంకేతిక సమస్యలు ఉత్పన్నమవుతున్నాయని, కొన్నిసార్లు ఆన్‌లైన్ సర్వర్ మొరాయిస్తోందని ఉపాధ్యాయులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏదైనా సమస్యతో ఆన్‌లైన్‌లో దరఖాస్తును డీఈవో తిరస్కరిస్తే అది సంబంధిత మండల విద్యాశాఖాధికారికి వెళ్లాల్సి ఉండగా.. నేరుగా ఉపాధ్యాయుడికి వస్తోందని, కొన్ని సందర్భాల్లో హోల్డ్‌లో ఉండిపోతుందని టీచర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అలాగే సర్వీస్ పాయింట్ల కేటాయింపులో ఇబ్బందులు వస్తున్నాయని, స్పౌజ్ సదుపాయం వినియోగించడంలో సమస్యలు తలెత్తుతున్నాయని చెబుతున్నారు. కాగా ఉమ్మడి విశాఖ జిల్లాలో స్కూల్ అసిస్టెంట్ కేటగిరీలో బదిలీకి దరఖాస్తు చేయడానికి ఆదివారంతో గడువు ముగిసింది. అయితే చాలామంది స్కూల్ అసిస్టెంట్ల దరఖాస్తులు అప్‌లోడ్ కానందున గడువు పెంచాలని వారు కోరుతున్నారు.**

ఉమ్మడి విశాఖ జిల్లాలో అన్ని కేటగిరీలకు కలిపి 4,811 మందికి స్థానచలనం కలుగుతుందని విద్యాశాఖ ఐదారు రోజుల క్రితమే ప్రకటించింది. దీని ప్రకారం 88 హెచ్ఎం పోస్టులకు 123 మంది ప్రధానోపాధ్యాయులు దరఖాస్తు చేశారు. వీరి దరఖాస్తులను పరిశీలించి అప్‌లోడ్ చేశారు. స్కూల్ అసిస్టెంట్ కేటగిరీలో సుమారు 2,200 ఖాళీలను భర్తీ చేయడానికి దరఖాస్తు చేసుకున్నారు. అయితే బదిలీలకు దరఖాస్తు చేసే టీచర్లకు సర్వీస్ పాయింట్ల కేటాయింపులో గందరగోళం ఏర్పడిందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొత్తగా ఏర్పాటు చేస్తున్న మోడల్ ప్రాథమిక పాఠశాలల హెచ్ఎంలుగా ఎల్ఎఫ్ఎల్ హెచ్ఎంలు/స్కూల్ అసిస్టెంట్ల నియామకంపై ఇంకా తగిన ఆదేశాలు రానందున బదిలీ దరఖాస్తుపై కొంత గందరగోళం నెలకొంది. మోడల్ ప్రాథమిక పాఠశాలల హెచ్ఎంలుగా నియమించేటప్పుడు స్కూల్ అసిస్టెంట్లలో సబ్జెక్టు వారీగా నిష్పత్తి ఎంత అనేది ఇంతవరకు చెప్పలేదు. సర్దుబాటు ద్వారా మిగులుగా చూపించిన స్కూల్ అసిస్టెంట్లను మాత్రమే మోడల్ ప్రాథమిక పాఠశాలల హెచ్ఎంలుగా నియమిస్తారా? అన్నదానిపై స్పష్టత లేదు. ఒకేచోట ఎనిమిదేళ్ల సర్వీస్ పూర్తి కావాలన్న నిబంధన మేరకు 2017 ఆగస్టు 31 తేదీని ప్రామాణికంగా తీసుకున్నారు. దీంతో ఆ మరుసటి రోజు అంటే 2017 సెప్టెంబరు ఒకటిన పాఠశాలల్లో చేరిన టీచర్లకు ఎనిమిదేళ్ల సర్వీస్ పాయింట్లు వర్తించవని విద్యాశాఖ మార్గదర్శకాలు ఇవ్వడంతో అప్పట్లో పలు కారణాలతో ఒకరోజు ఆలస్యంగా విధుల్లో చేరిన ఉపాధ్యాయులకు పూర్తిగా సర్వీస్ పాయింట్లు రావడం లేదని గుర్తు చేస్తున్నారు. అదేవిధంగా 2017లో జరిగిన బదిలీల్లో ఒక పాఠశాలకు వచ్చిన టీచర్లు కొందరు 2023లో అమలులోకి వచ్చిన జీవో నంబర్-117 మేరకు మరోచోటకు బదిలీ కావాల్సి వచ్చింది. 2023 నుంచి ఇప్పటివరకు అదే స్కూల్‌లో పనిచేస్తున్న వారంతా జీవో నంబర్-117 రద్దుతో సర్దుబాటుకు గురయ్యారు. దీంతో సర్వీస్ పాయింట్ల కేటాయింపులో తమకు అన్యాయం జరుగుతుందని వారు వాపోతున్నారు. బదిలీకి తొలుత ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసి దాని ప్రతిని సంబంధిత ఎంఈవోకు అందజేయాలి. అయితే ఆఫ్‌లైన్‌లో ఉన్న దరఖాస్తును ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసే దరఖాస్తుతో పోల్చిన తరువాతే

... మిగతా 6వ పేజీలో

ప్రభుత్వ టీచర్లకు గడ్డు పరిస్థితి

- గతంలో ఏజెన్సీ నుంచి పలువురు ఉపాధ్యాయులు బదిలీపై మైదాన ప్రాంతానికి రాక
- జడ్పీ, మునిసిపల్ పాఠశాలల్లో విధులు నిర్వహణ
- తాజాగా ఉపాధ్యాయ బదిలీలు చేపట్టిన ప్రభుత్వం
- ఎనిమిదేళ్ల సర్వీసు పూర్తయితే బదిలీ తప్పనిసరి నిబంధన
- ప్రభుత్వ టీచర్లు సొంత యాజమాన్య స్కూళ్లకు వెళ్లిపోవాలని ఆదేశాలు
- దిక్కుతోచని స్థితిలో పలువురు ఉపాధ్యాయులు

విశాఖపట్నం, మే 25 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల బదిలీ కౌన్సెలింగ్‌కు సంబంధించి ప్రభుత్వం జారీ చేస్తున్న ఆదేశాలతో ఉమ్మడి విశాఖ జిల్లాలో జడ్పీ, మునిసిపల్ యాజమాన్యాల్లోని పాఠశాలల్లో పనిచేస్తున్న ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయుల పరిస్థితి అయోమయంగా మారింది. ఒకేచోట ఎనిమిది సంవత్సరాల సర్వీసు దాటిన ఉపాధ్యాయులు తమ సొంత మేనేజ్‌మెంట్ స్కూళ్లకే వెళ్లాలంటూ ఇచ్చిన ఆదేశాలతో మైదాన ప్రాంతంలో పనిచేస్తున్న ప్రభుత్వ ఉపాధ్యాయుల పరిస్థితి గందరగోళంగా తయారైంది. తెలుగుదేశం పార్టీ గతంలో (2014-19) అధికారంలో వున్నప్పుడు ఏ మేనేజ్‌మెంట్ ఉపాధ్యాయులైనా తమకు నచ్చిన యాజమాన్య పాఠశాలలకు బదిలీ అయ్యే వెసులుబాటు కల్పించింది. దీంతో ఏజెన్సీలోని ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న పలువురు ఉపాధ్యాయులు మైదాన ప్రాంతానికి బదిలీ చేయించుకున్నారు. వీరు జడ్పీ, మునిసిపల్ పాఠశాలల్లో పనిచేస్తున్నారు. అప్పటి నుంచి ఆయా పాఠశాలల్లోనే విధులు నిర్వహిస్తున్నారు. వీరిలో కొంతమంది ఉపాధ్యాయులు ఒకేచోట ఎనిమిదేళ్ల సర్వీసు పూర్తిచేసుకున్నారు. బదిలీల నిబంధనల ప్రకారం వీరికి కచ్చితంగా స్థాన చలనం వుంటుంది. ప్రస్తుతం విద్యా శాఖ అధికారులు ప్రస్తుతం

... మిగతా 6వ పేజీలో

మద్యం దుకాణాల్లో కల్తీ జోరు!

నగరంలోని పెద్ద సిండికేట్ల దుకాణాల్లో మాయాజాలం

- ఖరీదైన మద్యం సీసాలో తక్కువ ధర మద్యం మిక్సింగ్..
- అనుమానం రాకుండా సీల్‌తోపాటు తెరిచి, తిరిగి బిగింపు
- ఎక్సైజ్ శాఖ పర్యవేక్షణ లోపంపై విమర్శలు



(విశాఖపట్నం/ఆంధ్రజ్యోతి)

నగరంలో కొన్ని మద్యం దుకాణాల్లో వ్యాపారులు మాయాజాలాన్ని ప్రదర్శిస్తున్నారు. ఖరీదైన మద్యం బాటిళ్ల సీల్ మొత్తాన్ని తెరిచి.. కొంత సరకు తీసి తక్కువ ధర మద్యంతో నింపేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ప్రధానంగా నగరంలో పెద్ద సిండికేట్లుగా చలామణి అవుతున్న వ్యాపారులకు చెందిన దుకాణాల్లోనే ఈ తరహా మోసం జరుగుతోందని పలువురు మద్యం వ్యాపారులే ఆరోపిస్తుండడం చర్చనీయాంశంగా మారింది.

జీవీఎంసీ పరిధిలో 145 మద్యం దుకాణాలు ఉన్నాయి. వీటన్నింటికీ గత ఏడాది ఆగస్టులో అధికారులు లాటరీ నిర్వహించి వ్యాపారులకు అప్పగించారు. గతంలో ప్రభుత్వం ఆధ్వర్యంలోనే మద్యం దుకాణాల నిర్వహణ జరగ్గా.. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత తిరిగి ప్రైవేటు మద్యం షాపులకు అవకాశం కల్పించింది. దీంతో గతంలో మద్యం వ్యాపారంలో బాగా ఆర్జించిన వారంతా దుకాణాలను దక్కించుకునేందుకు పోటీపడి భారీ సంఖ్యలో దరఖాస్తులు వేశారు. మద్యం దుకాణాల కేటాయింపు ప్రక్రియ పూర్తయిన తరువాత బెల్ట్ షాపుల ద్వారా విక్రయాలను పెంచుకోవచ్చని భావించిన వ్యాపారులకు రాష్ట్ర ప్రభుత్వం ముకుతాడు వేసింది. కేవలం మద్యం దుకాణాల్లో మాత్రమే వీటి విక్రయాలు జరపాలని, లూజ్ సేల్స్ లేకుండా సీసాలతోనే విక్రయించాలనే నిబంధన విధించడంతో పాటు ఎవరైనా దీనిని ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించింది. దీంతో అధికారులు కూడా ప్రభుత్వ ఆదేశాల మేరకు మాత్రమే మద్యం విక్రయాలు జరిగేలా చర్యలు తీసుకుంటున్నారు. అయితే ఈ పరిణామం భారీగా లాభాలు ఆర్జించవచ్చని భావించిన మద్యం వ్యాపారుల ఆశలపై నీళ్లు చల్లినట్టయింది. దరఖాస్తుల కోసమే భారీగా డబ్బులు ఖర్చు పెట్టడం, లైసెన్స్ ఫీజుల కోసం అధికంగా పెట్టుబడి పెట్టడంతో ఎలాగైనా తాము వెచ్చించిన దానికి తగిన లాభాలను సంపాదించాలని మద్యం వ్యాపారంలో పెద్ద సిండికేట్లుగా చలామణి అవుతున్న వారు భావిస్తున్నారు. ఇందులో భాగంగానే తమకు చెందిన దుకాణాల్లో ఖరీదైన మద్యం సీసాలో తక్కువ ఖరీదైన మద్యాన్ని నింపి విక్రయాలు జరుపుతున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇలా చేస్తున్న కల్తీపై ఎవరికీ అనుమానం రాని విధంగా సీల్‌తో పాటే సీసా రింగు, మూతను కలిపి బయటకు తీస్తున్నారు. ఖరీదైన సీసాలో 25 శాతం మద్యం తీసి తిరిగి ఆ మోతాదులో తక్కువ ధర మద్యంతో నింపుతున్నారు. దీనిని ఎవరూ గుర్తించ డానికి వీల్లేకుండా తిరిగి సీల్‌తో పాటే విడదీయకుండా తీసేసిన రింగు, మూతను అమర్చుతున్నారు. దీనివల్ల మద్యం సీసాను పట్టుకుని తదేకంగా పరిశీలించినా ఎలాంటి అనుమానం రాదని మద్యం వ్యాపారంలో ఉన్నవారే చెబుతున్నారు. దీనిపై ఎక్సైజ్ శాఖ అధికారులకు సమాచారం అందినా.. తమకున్న పలుకుబడి కారణంగా వారేమీ చేయరన్నది పెద్ద సిండికేట్ల ధీమా అని పేర్కొంటున్నారు. ఎక్సైజ్‌శాఖ అధికారులు ఇలాంటి కల్తీ వ్యవహారాలపై పటిష్ఠ నిఘా పెట్టి, కల్తీ జరిగినట్టు నిర్ధారణ అయితే వెంటనే కఠిన చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది. కానీ ఆ స్థాయిలో నిఘా పెట్టకుండా ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారని పలువురు విమర్శిస్తున్నారు. అదే చిన్నపాటి వ్యాపారులు, రాజకీయ అండదండలు లేనివారు ఎమ్మార్పీ ఉల్లంఘన చేసినా నానా హడావుడి చేసి భయాందోళనకు గురిచేస్తుంటారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సివిల్స్ ప్రిలిమినరీకి 53.38% హాజరు

- మొత్తం అభ్యర్థులు 8,422 మంది
- పరీక్షకు హాజరైంది 4,496 మంది
- విశాఖలో 19 కేంద్రాల్లో నిర్వహణ
- పలు కేంద్రాలను పరిశీలించిన కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్



వాల్తేర్ కేంద్రీయ విద్యాలయ పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేసి వస్తున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్

విశాఖపట్నం, మే 25 (ఆంధ్రజ్యోతి): యూనియన్ పబ్లిక్ సర్వీసు కమిషన్ (యూపీఎస్సీ) ఆదివారం నిర్వహించిన సివిల్స్ ప్రిలిమినరీ పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. జిల్లాలోని 19 కేంద్రాల్లో నిర్వహించిన ఈ పరీక్షకు 8,422 మంది అభ్యర్థులకు గాను 4,496 (53.38 శాతం) మంది హాజరయ్యారు. జనరల్ స్టడీస్ పరీక్ష ఉదయం 9.30 గంటల నుంచి 11.30 గంటల వరకు, సివిల్ సర్వీసెస్ ఆప్టిట్యూడ్ పరీక్ష మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు నిర్వహించారు. జిల్లా కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్ దువ్వాడలోని విజ్ఞాన్ ఇంజనీరింగ్ కాలేజీ, అక్కయ్యపాలెంలోని కేంద్రీయ విద్యాలయం కేంద్రాలను సందర్శించారు. పరీక్షలు జరుగుతున్న తీరు, అభ్యర్థులకు ఏర్పాటు చేసిన సదుపాయాలపై ఆరా తీశారు. ఇదిలావుండగా దివ్యాంగుల కోసం ప్రత్యేకంగా కేటాయించిన మహిళా డిగ్రీ కళాశాల కేంద్రంలో వారి కోసం తగిన ఏర్పాట్లు చేయకపోవడంతో అభ్యర్థులు ఇక్కట్లకు గురయ్యారు. వీల్‌చైర్లు సైతం ఏర్పాటు చేయకపోవడంతో పరీక్షా కేంద్రంలోకి వెళ్లేందుకు దివ్యాంగ అభ్యర్థులు ఇబ్బంది పడ్డారు. సాయపడేందుకు సిబ్బందిని నియమించకపోవడంతో వారు అసహనాన్ని వ్యక్తం చేశారు.

ఇళ్లు సరే.. వసతులేవీ?

విశాఖపట్నం, మే 25 (ఆంధ్రజ్యోతి): **నగరంలో నివసిస్తున్న గూడులేని పేదలకు నగర శివార్లలో సెంటు స్థలంలో నిర్మిస్తున్న కాలనీల్లో వసతుల కల్పన గురించి అధికారులు పట్టించుకోవడం లేదు. వచ్చే నెలాఖరు కల్లా 65 కాలనీల్లో 30 వేల ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేయాలని గృహనిర్మాణ సంస్థ అధికారులు లక్ష్యంగా నిర్ణయించారు. అంతేకాక జూలై తరువాత ఆయా ఇళ్లల్లో లబ్ధిదారులు గృహప్రవేశాలు చేసుకునేలా అధికారులు సమయం ఖరారు చేయనున్నారు. ఒకవేళ ఆయా ఇళ్లల్లో లబ్ధిదారులు నివాసాలను ఏర్పాటు చేసుకుంటే తాగునీరు, విద్యుత్, మురుగు నీటిసరఫరా, రోడ్లు వంటి సదుపాయాలు తప్పనిసరిగా ఉండాలి. కానీ ఇప్పటివరకు అధికారులు అటువంటి ప్రయత్నమేమీ చేయడం లేదని పలువురు లబ్ధిదారులు ఆరోపిస్తున్నారు. మౌలికవసతులు కల్పించేంత వరకు నిర్మాణాలు పూర్తయిన ఇళ్లకు రక్షణ ఎవరు? అనేది ఎవరూ చెప్పడం లేదు. ఇళ్ల నిర్మాణాలు, మౌలికవసతుల కల్పన విషయంలో గృహనిర్మాణ సంస్థ, వీఎంఆర్డీఏల మధ్య సమన్వయం లేదనడానికి సెంటు స్థలాల కాలనీలే నిదర్శనమని తేటతెల్లమైంది.**

నిర్మాణ బాధ్యతలు హౌసింగ్ కార్పొరేషన్‌ది

- వీఎంఆర్డీఏకు మౌలిక వసతుల కల్పన బాధ్యత
- జూన్ నెలాఖరు నాటికి 30 వేల ఇళ్ల పూర్తి లక్ష్యం
- ఆయా కాలనీల్లో తాగునీరు, విద్యుత్, రోడ్లు వంటి సదుపాయాలు శూన్యం

రహదారి లేని గంగవరం కాలనీ



గత ప్రభుత్వంలో నగరంలో ఉంటున్న గూడులేని నిరుపేదలకు నగర శివార్లలో సెంటు స్థలం వంతున ప్లాట్లను కేటాయించారు. ఇందుకు వందల ఎకరాలను సేకరించిన ప్రభుత్వం.. శివారులోని పలు మండలాల్లో 73 లేఅవుట్లను అభివృద్ధి చేశారు. అయితే కొన్నిచోట్ల నిర్మాణాలు, ఇతరత్రా సమస్యలతో పెండింగ్‌లో పెట్టగా ప్రస్తుతం 65 లేఅవుట్లలో 98 వేల ఇళ్ల నిర్మాణాలను చేపట్టారు. పైడివాడ అగ్రహారంలో 11 వేలు, నడుపూరు, గిడిజాల, నర్సాపురం, ముదపాక, తంగుడుబిల్లి, గంగవరంలో మూడు నుంచి నాలుగు వేల ఇళ్లను నిర్మిస్తున్నారు. మూడేళ్ల క్రితం ఇళ్ల నిర్మాణాలు ప్రారంభమైనా పలు కారణాలతో జాప్యం జరిగింది. చివరకు గత ఏడాది నుంచి ఇళ్ల నిర్మాణంలో వేగం పెరగడంతో ఇప్పటివరకు 16 వేల ఇళ్ల వరకు పూర్తవ్వగా, మరో 14 వేల ఇళ్లను వచ్చే నెలాఖరుకు పూర్తి చేయాలని అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు. కేంద్ర ప్రభుత్వం పీఎంఏవై పథకం కింద ప్రతి ఇంటికి రూ.1.8 లక్షలు మంజూరు చేసినా నిర్మాణాలకు లబ్ధిదారులు ముందుకురాలేదు. దీంతో ప్రభుత్వం జోక్యం చేసుకుని కాంట్రాక్టర్ల ద్వారా ఇళ్ల నిర్మాణాలను చేపట్టింది. గృహనిర్మాణ సంస్థ ఇళ్ల నిర్మాణాలను పర్యవేక్షిస్తోంది. ఇళ్ల నిర్మాణాలను లబ్ధిదారులు అప్పుడప్పుడు పర్యవేక్షిస్తున్నప్పుడు వసతుల గురించి సైట్ ఇంజనీర్లకు ప్రశ్నిస్తున్నారు.

కాగా మొత్తం 62 లేఅవుట్లలో వసతుల కల్పన బాధ్యతను వీఎంఆర్డీఏకు అప్పగించారు. గత ప్రభుత్వ హయాంలో సెంటు స్థలాల చదును చేసే బాధ్యతను వీఎంఆర్డీఏకే అప్పగించారు. భూ సమీకరణ చేసే సమయంలో పేదల ఇళ్లు, భూములు ఇచ్చిన రైతులకు అభివృద్ధి చేసిన ప్లాట్లు కేటాయించగా, మిగిలిన ప్లాట్లను విక్రయించడం ద్వారా వచ్చే సొమ్ముతో కాలనీల్లో వసతులు కల్పించాలి. ఇందుకు సంబంధించి వీఎంఆర్డీఏ ప్రతిపాదనలు సిద్ధం చేసినా నిధుల సమస్య వెంటాడుతుంది. అయితే పీఎంఏవై పథకంలో నిబంధన మేరకు ఇళ్ల కాలనీల్లో మౌలిక

... మిగతా 6వ పేజీలో

ఆ పోస్టు భర్తీ ఎప్పుడో!

- 3 నెలలుగా విమానాశ్రయం డైరెక్టర్ పోస్టు ఖాళీ
- మంత్రి ఆదేశాలు ఇచ్చి ఆరు నెలలవుతున్నా ప్రారంభం కాని ఎయిర్ కార్గో
- మందసలో ఎయిర్ కార్గో సెంటర్ ఏర్పాటుకు ప్రయత్నాలు



(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

విశాఖపట్నం విమానాశ్రయంపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు శీతకన్ను వేశాయి. కొత్తగా భోగాపురంలో అంతర్జాతీయ విమానాశ్రయాన్ని నిర్మిస్తున్న నేపథ్యంలో విశాఖ ఎయిర్‌పోర్టును నిర్లక్ష్యం చేస్తున్నారు. ఇక్కడ విమానాశ్రయ డైరెక్టరుకు పదోన్నతి లభించడంతో మూడు నెలల క్రితం వేరే ప్రాంతానికి బదిలీ చేశారు. ఆ తరువాత వేరే అధికారికి ఇన్‌చార్జి బాధ్యతలను అప్పగించారే తప్పా కొత్తగా డైరెక్టరును నియమించలేదు. విశాఖ విమానాశ్రయం నుంచి అంతర్జాతీయ కార్గో సేవలను ప్రారంభించాలని ఇక్కడి పారిశ్రామిక వర్గాలు ఎప్పటినుంచో కోరుతున్నాయి. కరోనాకు ముందు ఓ సంస్థ సేవలందించేది. విమానాశ్రయం పనిచేయని కాలానికి (రెండేళ్లు)

... మిగతా 6వ పేజీలో

విరివిగా కొమ్ము కోనాం చేపలు

- తెరపడవలతో వేట సాగించిన మత్స్యకారులు
- ఇతర రాష్ట్రాలకు ఎగుమతి చేసే పనిలో నిమగ్నం



ఫిషింగ్ హార్బర్‌లో కొమ్ము కోనాం చేపలు

బీచ్ రోడ్డు, మే 25, (ఆంధ్రజ్యోతి): ఫిషింగ్ హార్బర్‌లో ఆదివారం కొమ్ము కోనాం చేపలు కళకళలాడాయి. ప్రస్తుతం సముద్రంలో చేపల వేట నిషేధం అమలులో ఉంది. ఇటువంటి పరిస్థితుల్లో మర బోట్లలో మత్స్యకారులు సంద్రంలోకి వేటకు వెళ్లకూడదు. కానీ తెరపడవల మీద వేటకు వెళ్లవచ్చు. ఇలా వెళ్లిన పలువురు మత్స్యకారుల వలలకు కొమ్ము కోనాం చేపలు చిక్కడంతో వారి ఆనందానికి అవధుల్లేకుండా పోయింది. ఒక్కో చేప సుమారు 40 నుంచి 50 కిలోల వరకు ఉంటుందని వారు తెలిపారు. విశాఖ తీరంలో లభించే కొమ్ము కోనాం చేపలకు ఇతర రాష్ట్రాల్లో మంచి డిమాండ్ ఉందని వారన్నారు. అయితే ఇక్కడ కొమ్ము కోనాం చేపకు కిలో రూ.150 నుంచి రూ.300కు మించి లభించదన్నారు. కేరళ, మహారాష్ట్ర వంటి రాష్ట్రాల్లో వీటికి డిమాండ్ అధికంగా ఉండడంతో పాటు ధర కూడా లాభదాయకంగా ఉంటుండడంతో అక్కడకు ప్యాకింగ్ చేసి పంపుతున్నట్టు పలువురు మత్స్యకారులు తెలిపారు. ప్రతిరోజు 40 నుంచి 60 కిలోల వరకు వీటిని ఎగుమతి చేయగలమని మత్స్యశాఖ సంయుక్త సంచాలకులు లక్ష్మణరావు వెల్లడించారు.

ప్రశాంతంగా సివిల్స్ ప్రిలిమ్స్

కొమ్మాది, మే 25 (ఆంధ్రజ్యోతి) : మధుర వాడ పరిసర ప్రాంతాల్లోని పలు కళాశాలల్లో యూపీఎస్సీ సివిల్స్ ప్రిలిమ్స్ పరీక్ష ఆదివారం ప్రశాంతంగా జరిగింది. చంద్రంపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 480 మంది అభ్యర్థులకు గాను 261 మంది హాజరు కాగా విజయం పాఠశాలలో 576 మందికి 315 మంది,చైతన్య విశ్వేశ్వరయ్య క్యాంపస్‌లో 384 మందికి 189 మంది, చైతన్య అబ్దుల్ కలామ్ క్యాంపస్‌లో 321 మందికి 173 మంది హాజర య్యారు.అలాగే పీఎంపాలెం సాంకేతిక ఇంజ నీరింగ్ కళాశాలలో 576 మందికి 311, గాయ త్రి మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో 480 మందికి 261 మంది హాజరయ్యారు. చంద్రం పాలెం ఉన్నత పాఠశాల కేంద్రానికి అయిదు గురు అభ్యర్థులు ఆలస్యంగా రావడంతో వారి ని పరీక్షకు అనుమతించలేదు.

అప్పన్నకు స్వర్ణ పుష్పార్చన



సింహాచలం, మే 25 (ఆంధ్రజ్యోతి) : వరా హలక్ష్మీనృసింహస్వామికి ఆర్జిత సేవల్లో భా గంగా స్వర్ణ పుష్పార్చన ఆదివారం వైభవంగా నిర్వహించారు. వేకువజామున సుప్రభాత సేవతో స్వామివారిని మేల్కొలిపి ప్రభాతారా ధనలు పూర్తిచేశారు. ఉత్సవమూర్తి గోవింద రాజస్వామిని ఉభయదేవేరులతో స్వర్ణాభర ణాలు, పుష్పమాలికలతో శోభాయమానంగా అలంకరించి రజితవేదికపై అధిష్ఠింపజేశారు. భక్తుల గోత్రనామాలతో సంకల్పించి విశ్వక్సేనా రాధన, పుణ్యాహవచనములు చేసి షోడశోప చరాలు సమర్పించారు.అనంతరం నారసింహ అష్టోత్తర శతనామాలు పఠిస్తూ ప్రతి నామా నికి స్వర్ణ పుష్పాలతో పూజలు చేశారు. తరు వాత అదే వేదికపై నిత్య కల్యాణం జరిపారు.

పశుపతినాథేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు



ఎండాడ, మే 25 (ఆంధ్రజ్యోతి) : ఎండాడ లోని పశుపతినాథేశ్వరస్వామి ఆలయంలో మాస శివరాత్రి సందర్భంగా ఆదివారం ఉద యం రుద్రాభిషేకం నిర్వహించారు. కార్యక్ర మంలో భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

పట్ట పగలు వెలుగులు



తగరపువలస, మే 25 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ రెండోవార్డు పరిధిలోని సంగివలస, ఎడదాసరిపేట కాలనీల్లో వీధి లైట్లు రాత్రి, పగలు వెలుగుతూనే ఉన్నాయి. మూడు రోజు లుగా ఈ పరిస్థితి ఉన్నా.. ఎవరూ పట్టించు కోవడం లేదు. విద్యుత్ దుబారాపై స్థానికులు విమర్శలు వ్యక్తం చేస్తున్నారు. అధికారులు తక్షణమే స్పందించి సమస్యను పరిష్కరించా లని పలువురు కోరుతున్నారు.

'మహానాడు'కు తరలివెళదాం

పద్మనాభం రూరల్, మే 25 (ఆంధ్రజ్యోతి) : కడప జిల్లాలో ఈనెల 27, 28, 29వ తేదీల్లో జరిగే టీడీపీ మహానాడు సభలకు మండలం లోని నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లాలని మాజీ ఎంపీపీ కాళ్ల నగేశ్ కుమార్ పిలుపుని చ్చారు. ఆదివారం ఆయన మద్ది, తునిపొలం, బాందేవుపురం, విజయరాంపురం గ్రామాల్లో కార్యకర్తలతో సమావేశమయ్యారు. ఈ సంద ర్భంగా మాట్లాడుతూ ప్రతి గ్రామం నుంచి నాయకులు, కార్యకర్తలు సభలకు హాజరు కావాలన్నారు. ఈ సమావేశాల్లో నాయకులు జీవీపై నాయుడు, ఎస్.వెంకటరావు, తాతాజీ, సూరప్పడు, తదితరులు పాల్గొన్నారు.

"కరోనా"పై ఆందోళన వద్దు

పద్మనాభం రూరల్, మే 25 (ఆంధ్రజ్యోతి) : కరోనా వైరస్ పట్ల ప్రజలు ఆందోళన చెం దాల్సిన అవసరం లేదని రేవిడి పీహెచ్‌సీ వైద్యాధికారిణి కె. స్వప్న అన్నారు. ఆదివారం ఆమె 'ఆంధ్రజ్యోతి'తో ఫోన్‌లో మాట్లాడారు. కొన్ని జాగ్రత్తలు పాటిస్తే వైరస్ సోకే ప్రమా దం ఉండదన్నారు. ప్రతిఒక్కరూ మాస్కులు ధరించాలని, చేతులు ఎప్పటికప్పుడు శుభ్రం చేసుకోవాలని తెలిపారు. జలుబు, జ్వరం వం టివి సోకితే వెంటనే వైద్యులను సంప్రతించా లని ఆమె సూచించారు.

అవంతిలో ఫుట్‌బాల్ టోర్నీ

తగరపువలస, మే 25 (ఆంధ్రజ్యోతి) : తగరపువలస అవంతి ఇంజనీరింగ్ కళాశాల క్రీడా మైదానంలో ఉత్తరాంధ్ర స్థాయి అండర్ 14 బాల బాలికల ఫుట్‌బాల్ టోర్నమెంట్ ఆదివారం జరిగింది. ఇందులో 16 జట్లు పాల్గొన్నాయి. విన్నర్, రన్నర్‌గా శ్రీకాకుళం జట్లు గెలుపొందాయి. విజేతలకు మహిళా కోచ్‌లు జాన్, సుస్మిత, రాకేశ్ సంస్థ చైర్మన్ నరసింహారెడ్డి బహుమతులు ఇచ్చారు.

ఫిల్మ్‌నగర్‌కు త్వరలో భూమి పూజ : ఎమ్మెల్యే గంటా

భీమునిపట్నం, మే 25 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని తిమ్మా పురంలో నిర్మించనున్న ఫిల్మ్‌నగర్ కల్చరల్ సెంటర్‌కు త్వరలో భూమి పూజ చేయనున్నట్టు ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు తెలి పారు. ఆదివారం ఆయన తన క్యాంపు కార్యాలయంలో ఫిల్మ్‌నగర్ కమిటీ సభ్యులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లా డుతూ గతంలో ఈ క్లబ్‌కు ప్రభుత్వం ఐదు ఎకరాలు కేటాయిం చిందన్నారు. లీజుకు తీసుకున్న ఈ స్థలంలో నిర్మాణాలు చేపడ తామని చెప్పారు. అనంతరం క్లబ్ నిర్మించనున్న కన్వెన్షన్ సెంటర్, ఓపెన్ ఎయిర్ థియేటర్, స్విమ్మింగ్ పూల్ వంటి నిర్మా ణాల ప్లాన్‌లను ఎమ్మెల్యే పరిశీలించారు. ఈ సమావేశంలో కమిటీ అధ్యక్షుడు ఆర్‌వీ చంద్రమౌళి, కోశాధికారి బాలాజీ శివ ప్ర సాద్, సభ్యులు రాజు, వెంకటేశ్వరరావు, శ్రీధర్, శ్రీకాంత్ తదిత రులు పాల్గొన్నారు.



కమిటీ సభ్యులతో సమావేశమైన ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు

చేపల చెరువులకు కోళ్ల వ్యర్థాలు

» నరవ వద్ద మూడు వాహనాలను పట్టుకున్న జీవీఎంసీ సిబ్బంది
» మామూళ్లు తీసుకుని వదిలేసినట్టు ఆరోపణలు



నరవ వద్ద పట్టుబడిన కోళ్ల వ్యర్థాల వ్యాన్

విశాఖపట్నం, మే 25 (ఆంధ్రజ్యోతి) : అనకా పల్లి జిల్లాలోని చేపల చెరువులకు కోళ్ల వ్యర్థా లను తరలిస్తున్న మూడు వాహనాలను జీవీ ఎంసీ ప్రజారోగ్య విభాగం సిబ్బంది నరవ వద్ద ఆదివారం పట్టుకున్నారు. నగరంలోని చికెన్ దుకాణాల నుంచి కోళ్ల వ్యర్థాలను వాహనాల ద్వారా సేకరించి, వాటిని కాపులుప్పాడలోని డంపింగ్ యార్డుకు తరలించేందుకు జీవీఎంసీ టెండర్లు పిలిచింది. జోన్ల వారీగా కాంట్రాక్టర్లను ఎంపిక చేసి వారికి ఆ పనులు అప్పగించింది. కాంట్రాక్టర్లు ఏ వాహనం ద్వారా కోళ్ల వ్యర్థాలను డంపింగ్ యార్డుకు తరలిస్తామన్న వివరాలను ప్రజారోగ్య విభాగం అధికారులకు ముందుగానే అందజేశారు. ఆయా వాహనాల ద్వారా మాత్రమే డంపింగ్ యార్డుకు వ్యర్థాలను తర లించాలి. కానీ కొంతమంది కాసులకు కక్కుర్తి పడి అనధికారికంగా చికెన్ దుకాణాల నుంచి కోళ్ల వ్యర్థాలను సేకరించి అనకాపల్లి జిల్లాలోని చేపల చెరువులకు విక్రయించి భారీగా సొమ్ము చేసుకుంటున్నారు. కోళ్ల వ్యర్థాలకు నగరంలో భారీ డిమాండ్ ఉండడంతో కొంతమంది రాజకీ య నాయకుల అండతో అధికారులను ఎదిరించి మరీ దుకాణాల నుంచి యథేచ్ఛగా వ్యర్థాలను చేపల చెరువులకు తరలిస్తున్నారు. అధికారులు వారిని పట్టుకుంటే ప్రజాప్రతినిధుల ద్వారా ఒత్తిడి చేసి వాహనాలను విడిపించుకుని వెళ్లి పోతున్నారు. కోళ్ల వ్యర్థాలను తిన్న చేపలు తినడం వల్ల కేన్సర్ వంటి వ్యాధులు వస్తాయని వైద్యులు చెబుతున్నారు. నరవ వద్ద కోళ్ల వ్యర్థా లను తరలిస్తున్న మూడు వాహనాలను అధికా రులు ఆదివారం పట్టుకున్నారు. వాటిని పోలీస్ స్టేషన్‌కు అప్పగించి కేసులు నమోదు చేసేం దుకు సిద్ధమవగా, కొంతమంది ప్రజాప్రతినిధు లు నుంచి ఫోన్లు రావడంతో వాటిని విడిచిపెట్టే శారు. కొందరు సిబ్బంది వ్యాపారుల నుంచి డబ్బులు తీసుకోవడం వల్లే పట్టుబడిన వాహ నాలపై ఎలాంటి చర్యలు తీసుకోలేదన్న ఆరోప ణలు వెల్లువెత్తుతున్నాయి.

ఖరీఫ్‌కు 1369 క్వింటాళ్ల విత్తనాలు

పద్మనాభం, మే 25 (ఆంధ్రజ్యోతి) : మండలానికి ఖరీఫ్‌లో అవసర మైన 1369.30 క్వింటాళ్ల వరి, వేరుశనగ విత్తనాలను కేటాయించారని ఏఓ ఎంవీఎస్ చలం ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంటీయూ 1121 రకం 845 క్వింటాళ్లు, సాంబా మసూరి 80 క్వింటాళ్లు, సోనా మసూరి 350 క్వింటాళ్లు, ఆర్‌జీఎల్ 2537 రకం 4 క్వింటాళ్లు, ఎంటీ యూ 75 క్వింటాళ్లు, వేరుశనగ లేపాక్షి రకం 15.30 క్వింటాళ్లు కేటా యించారని తెలిపారు. వారం రోజుల్లో ఆయా విత్తనాలు రైతు సేవా కేంద్రాలకు చేరుకుంటాయని చెప్పారు.

150 మందికి వైద్య పరీక్షలు



రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

కొమ్మాది, మే 25 (ఆంధ్రజ్యోతి) : ప్రతిఒక్కరూ ఆరోగ్య సంరక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలని వాకర్స్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ గవర్నర్ ద్వారకా నాథ్ అన్నారు. ఆదివారం పీఎంపాలెం తులసీనగర్‌లో ఫ్రెండ్స్ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గీతం ఆస్పత్రి సహకారంతో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. తొమ్మిది విభాగాలకు చెందిన వైద్యులు 150 మందికి పరీక్షలు చేసి, మందులు అందించారు. అనంతరం కేవీఆర్ గురునాథ్ అసోషియేషన్‌కు షామియానా, స్టీల్ బెంచీలు, కుర్చీలు విత రణగా అందజేశారు.ఈ కార్యక్రమంలో అసోషియేషన్ అధ్యక్షుడు సన్నీ, కార్యదర్శి లోవరాజు, కళావేదిక చైర్మన్ ప్రయోద చక్రవర్తి, సభ్యులు వెంకటరాజు, సుభాని, బ్రహ్మాజీ, తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం

సింహాచలం, మే 25 (ఆంధ్రజ్యోతి) : క్రీడల వల్ల విద్యార్థులకు మా నసిక ఉల్లాసం కలుగుతుందని సింహాచలం దేవస్థానం రిటైర్డ్ పర్యవేక్ష ణాధికారి వెలవలపల్లి కామేశ్వరరావు (చిట్టి) అన్నారు. అడివివరం శాఖా గ్రంథాలయంలో జరుగుతున్న వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా విద్యార్థులకు ఆదివారం క్విజ్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తల్లిదండ్రులు పిల్లలను చదువుతో పాటు క్రీడ ల్లోనూ ప్రోత్సహించాలన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి ఎన్‌వీ నరసింహం, రిటైర్డ్ హెచ్‌ఎం మూర్తి, బంగారు చిట్టి పాల్గొన్నారు.

ఎన్‌సీసీ క్యాడెట్లకు శిక్షణ

సాగర్‌నగర్, మే 25 (ఆంధ్రజ్యోతి) : ఎన్‌సీసీ క్యాడెట్లు దేశానికి, సమాజానికి సేవ చేయడానికి సిద్ధంగా ఉండాలని కమాండింగ్ ఆఫీ సర్ లెఫ్టినెంట్ కల్నల్ నీరజ్‌కుమార్ పిలుపునిచ్చారు. రుషికొండ గాయ త్రి విద్యా పరిషత్ ఆవరణలో 13వ బెటాలియన్ ఎన్‌సీసీ క్యాడెట్ల పది రోజుల శిక్షణ శిబిరాన్ని ఆదివారం ఆయన ప్రారంభించారు. ఈ సంద ర్భంగా మాట్లాడుతూ ఎన్‌సీసీ క్యాడెట్లు దేశాభివృద్ధిలో భాగం కావాల న్నారు. క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు, శారీరక పటుత్వం కలిగి ఉం డాలని చెప్పారు. డ్రిల్, ఆయుధ శిక్షణ, మ్యాప్ రీడింగ్, ప్రథమ చికిత్స తదితర అంశాల్లో శిక్షణ పొంది దేశానికి ఉన్నతమైన సేవలు అందించా లన్నారు. శిక్షణకు విశాఖపట్నం, విజయనగరం జిల్లాల నుంచి 608 మంది క్యాడెట్లు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ క్యాంప్ కమాండెంట్ లెఫ్టినెంట్ కల్నల్ స్వర్నింగ్, సుబేదార్ మేజర్ శ్రీనివాస్, సుబేదార్ సుహాన్‌సింగ్, సునీల్ సింగ్, రవీంద్రసింగ్, అసోసియేట్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

నారాయణరాజుపేట రైతుల తప్పుడు ఫిర్యాదు

- భీమిలి ఏఎంసీ మాజీ చైర్మన్ ప్రసాదరాజు

భీమునిపట్నం (రూరల్), మే 25 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నారాయణరాజుపేటలో ఇనాం భూములను తాను అమ్మకం చేసినట్టు రైతులు తప్పుడు ఫిర్యాదు చేస్తున్నారని భీమిలి మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ దాట్ల ప్రసాదరాజు అన్నారు. ఆదివారం ఆయన ఇక్కడి విలేకరు లతో మాట్లాడారు. రైతులు తనపై ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌కు తప్పుడు ఫిర్యాదు చేయడం సరికాదన్నారు. రైతులు చెబుతున్న భూము లను 1920లో తన తాత డీవీఏజీ రాజు అధికారికంగా కొనుగోలు చేశా రని, రిజిస్ట్రేషన్ కూడా జరిగిందన్నారు. అందుకు సంబంధించిన ఆధా రాలు, రికార్డులు తమ వద్ద ఉన్నాయని, ఆ ప్రకారం అమ్మకాలు జరిగా యని స్పష్టం చేశారు. ఆ భూములకు తాము వారసులుగా ఉన్నామని, కానీ రైతులు తాము సాగుదారులమని తమదే భూమి అని తప్పుడు ఫిర్యాదు చేస్తున్నారని చెప్పారు. ఈ విషయంలో రైతులు మాజీ ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావును లాగడం సరికాదని సూచించారు.

పద్మనాభంలో ఉజిడి ఉత్సవం

పద్మనాభం, మే 24 (ఆంధ్రజ్యోతి) : పద్మనాభంలో బంగారమ్మ అమ్మవారి పండగ ఉత్సవంలో భాగంగా ఆదివారం ఉజిడి ఉత్సవం ఘనంగా నిర్వహించారు. తొలుత అమ్మవారి ఘటాల మందిరంలో పూజారి బుగత గురునాయుడు పూజలు చేశారు. అక్కడి నుంచి ఉజిడి బండిని గ్రామంలోని ప్రధాన వీధుల్లో ఊరేగించారు. ప్రజలు ఉజిడి బండిలో అమర్చిన బుట్టలో ప్రత్యేకంగా తయారు చేసిన వంటకాలను సమర్పించారు. అనంతరం ఆలయానికి వెళ్లి ఉత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు టి. గురునాయుడు, బి. రాము, పద్దు, ఎర్నాయుడు తదితరులు పాల్గొన్నారు.

నిత్యాన్న ప్రసాద పథకానికి రూ. లక్ష విరాళం



దాతకు బాండ్ ఇస్తున్న అధికారి విక్రమ్

సింహాచలం, మే 25 (ఆంధ్ర జ్యోతి) : వరాహలక్ష్మీనృసింహ స్వామి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నిత్యాన్న ప్రసాద పథకానికి నగరంలోని మాధవ ధార ప్రాంతానికి చెందిన పం పాన ఉమా వెంకట సత్యనారా యణ దంపతులు రూ.లక్ష విరాళంగా సమర్పించారు. విరాళం మొత్తాన్ని నగదు రూపంలో అన్నప్ర సాద విభాగం ఏఈఓ నక్కాన ఆనందకుమార్, పర్యవేక్షణాధికారి సీవీవీ పద్మనాభరాజు(విక్రమ్)లకు ఆదివారం వారు అందజేశారు. ఆలయ సంప్రదాయం ప్రకారం దాత కుటుంబ సభ్యులకు అధికారులు స్వామివారి అంతరాలయ దర్శనం కల్పించి, శేషవస్త్రంతో సత్కరించారు.

గంభీరం కాలువలో పడి యువకుడి మృతి

ఆనందపురం, మే 25 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గంభీరం రిజ ర్వాయర్ కాలువలో పడి యువకుడు మృతి చెందినట్టు సీఐ వాసు నాయుడు తెలిపారు.మధురవాడ సమీపంలోని మారికవలసకు చెందిన సమీర్ (26) తన స్నేహితులు నలుగురితో కలిసి గంభీరం రిజర్వాయర్ కాలువలో చేపలు పట్టడానికి ఆదివారం సాయంత్రం వెళ్లారు. అందరూ చేపలు పట్టడానికి కాలువలోకి దిగారు. సమీర్‌కు ఈత రాకపోవడంతో నీట మునిగి మృతి చెందాడు. సీఐ వాసునాయుడు సిబ్బందితో సంఘ టనా స్థలానికి చేరుకుని ఈతగాళ్లతో గాలింపు చర్యలు చేపట్టి మృతదే హాన్ని వెలికితీశారు. పోస్టుమార్టం నిమిత్తం భీమిలి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు పోలీసులు తెలిపారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉందన్నారు.

మావోయిస్టులతో శాంతి చర్చలు జరపాలి

రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తలు

మహారాణిపేట, మే 25 (ఆంధ్రజ్యోతి) : 'ఆపరేషన్ కగారు' పేరుతో పోలీసులు సాగించిన హత్యాకాండపై సుప్రీంకోర్టు సింగిల్ జడ్జితో విచారణ జరిపించి, కేంద్ర ప్రభుత్వం మావోయిస్ట్ పార్టీతో శాంతిచర్చలు జరపాలని వామపక్షాలు, వివిధ ప్రజా సంఘాలు డిమాండ్ చేశాయి. జగదాంబ కూడ లి వద్ద సీఐటీయూ కార్యాలయంలో ఆదివారం సాయంత్రం నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో పలువురు మాట్లాడుతూ తక్షణమే కాల్పులు నిలిపివేసి మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ కార్యదర్శి నంబాళ్ల కేశవరావు మృతదేహాన్ని బంధువులకు అప్పగించాలని విజ్ఞప్తి చేశారు. ఏకపక్ష ఎన్ కౌంటర్లు సరికాదని, ఆదివాసీలకు రక్షణ కల్పించాల్సిన బాధ్యత ప్రభు త్వంపై ఉందన్నారు. పర్యావరణానికి హాని కలిగిస్తూ, దేశ ప్రజల ఆస్తులను కార్పొరేట్లకు అప్పగించాలని కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఇదంతా చేస్తోం దని ఆరోపించారు. పహల్గాంలో దాడి జరిపిన ఉగ్రవాదులను ఇప్పటివరకు పట్టుకోలేకపోయిందని ఎద్దేవా చేశారు. ఈ సమావేశంలో సీపీఐ ఎంఎల్ నాయకుడు పి.ప్రసాద్, పీడబ్ల్యూవో రాష్ట్ర అధ్యక్షురాలు ఎం.లక్ష్మి, మణి, టి. శ్రీరామ్మూర్తి, వీఎస్ కృష్ణ, డి.లలిత, చంద్రశేఖర్, చలం, అన్నపూర్ణ, రామ చంద్రరావు, ఎం. వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఇళ్లు సరే.. వసతులేవీ?

... 5వ పేజీ తరువాయి

వసతుల కల్పనకు సంబంధించి ప్రతి ఇంటికి రూ.80 వేల వరకు ఖర్చు చేయాలి. ఈ లెక్కన సుమారు రూ.1,200 కోట్ల నిధులు అవసరమని అధి కారులు అంచనా వేస్తున్నారు. అంత సొమ్ము ప్రస్తుతం వీఎంఆర్‌డీఏ వద్ద లేదనేది స్పష్టం. దీంతో టెండర్లు పిలిచేందుకు వెనుకంజ వేస్తున్నారు. ప్రతి కాలనీలో రోడ్లు, డ్రెయిన్లు, తాగునీరు, యూజీడీ, పాఠశాల, ప్రాథమిక ఆరో గ్య కేంద్రం, అంగన్‌వాడీ కేంద్రం వంటి వాటిని ఏర్పాటు చేయాలి. ఇళ్ల ని ర్మాణాలు ప్రారంభమైన వెంటనే తొలుత తాగునీటికి ఓవర్‌హెడ్ ట్యాంకు, పాఠశాల, ఆరోగ్య కేంద్రం, అంగన్‌వాడీ భవన నిర్మాణాలు చేపట్టాలి. ఉదా హరణకు 11 వేల ఇళ్లు నిర్మిస్తున్న పైడివాడ అగ్రహారంలో సుమారు పాతి క నుంచి 30 వేల మంది నివసిస్తారు. వారందరికీ తాగునీరు కావాలి, ఆయా కాలనీల్లో బోర్లు వేస్తే అంత నీటి లభ్యత ఉండదు. కొన్నిచోట్ల స్థాని కంగా భూగర్భ జలాల ద్వారా నీటి సరఫరా చేసినా వేల ఇళ్ల నిర్మాణాలు చేపట్టే కాలనీల్లో సాధ్యం కాదని ఇంజనీర్లు చెబుతున్నారు. దీంతో సమీపం లోని నదులు, వాగులు, పెద్ద చెరువుల నుంచి నీటిని మళ్లించడానికి పైపు లైన్లు, ఫిల్టర్ పాయింట్లు నిర్మించాలి. ప్రస్తుతం 62 లేఅవుట్లలో పద్మనాభం మండలంలోని నర్సాపురం తదితర లేఅవుట్లు మాత్రమే గోస్తనీ నదికి దగ్గ రలో ఉన్నాయి.

మిగిలిన లేఅవుట్లలో ప్రజలకు తాగునీరు ఇవ్వాలంటే ఏలేరు, రైవాడ, మేహాద్రిగెడ్డ, తాటిపూడిపై ఆధారపడాలి. అయితే ఇంతవరకు ఇందుకు సంబంధించి ఎటువంటి ప్రతిపాదనలు లేవనే వాదన ఉంది. రోడ్లు, విద్యు త్, డ్రెయిన్లు వంటి వసతుల కల్పన చేయాలంటే కనీసం రెండు నుంచి మూడేళ్ల సమయం పడుతుందంటున్నారు. అంతవరకు పూర్తయిన ఇళ్లల్లో లబ్ధిదారులు ఎలా నివాసం ఉంటారు? ఒకవేళ వసతుల కోసం ఎదురు చూస్తే అప్పటివరకు ఇళ్లను కాపాడేది ఎవరనేది అధికారులే చెప్పాలి. కా లనీల్లో వసతుల కల్పన గురించి హౌసింగ్ పీడీ సత్తిబాబు వద్ద ప్రస్తావిం చగా.. ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేసే పనులను వేగవంతం చేశామన్నారు. అయితే వసతుల కల్పన బాధ్యత వీఎంఆర్‌డీఏదేనని, దీనిపై సంబంధిత అ ధికారులను కలిసి కోరామన్నారు.



సందర్శకులతో కిటకిటలాడుతున్న రుషికొండ బీచ్

రుషికొండ బీచ్‌లో సండే సందడి

సాగర్‌నగర్, మే 25 (ఆంధ్రజ్యోతి) : రుషికొండ బీచ్ సందర్శకులతో ఆదివారం సందడిగా మారింది. వేసవి సెలవులు కావడం, వాతావరణం చల్లగా ఉండడంతో శ్రీకాకుళం, విజయనగరం జిల్లాలతో పాటు నగరం నలుమూలలు నుంచి సందర్శకులు అధిక సంఖ్యలో తీరానికి తరలివచ్చారు. కొందరు సముద్రంలో స్నానాలు చేస్తూ కేరింతలు కొట్టగా, మరికొంతమంది ఇసుక తెన్నెలపై ఆటలు ఆడుతూ గడిపారు. రుషి కొండ బీచ్‌తో పాటు సాగర్‌నగర్ బీచ్, రామానాయుడు స్టూడియో తదితర పర్యాటక ప్రాంతాలకు కూడా సందర్శకులతో కిటకిటలాడాయి.

జిల్లాలో నేటి నుంచి మీజిల్స్, రుబెల్లా వ్యాక్సినేషన్

విశాఖపట్నం, మే 25 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో సోమవారం నుంచి మీజిల్స్, రుబెల్లా వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని ప్రారంభించనున్నట్టు డీఎంహెచ్‌ఓ డాక్టర్ పి. జగదీశ్వరరావు తెలిపారు. ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. మీజిల్స్, రుబెల్లా అన్నవి వైరస్ వ్యాధులని, వీటివల్ల పిల్లల్లో న్యుమోనియా, విరేచనాలు, మెదడువాపు వంటి తీవ్రమైన సమస్యలు వస్తాయన్నారు. ఈ వ్యాధులు నుంచి పిల్లలను రక్షించేందుకు యూనివర్సల్ ఇమ్యునైజేషన్ ప్రోగ్రామ్‌లో భాగంగా రెండు డోసుల టీకాలను అందిస్తున్నట్టు వెల్లడించారు. మొదటి డోసును 9 నుంచి 12 నెలలు వయసులో, రెండో డోసును 12 నుంచి 24 నెలలు వయసులో ఇవ్వాల్సి ఉంటుందన్నారు. 2026 నాటికి మీజిల్స్, రుబెల్లా రహిత దేశంగా కేంద్రం లక్ష్యం పెట్టుకుందని, అందులో భాగంగా మూడు నెలలు పాటు జిల్లాలో ప్రత్యేక టీకాల డ్రైవ్ చేపడుతున్నట్టు తెలిపారు. మొదటి విడత ఈనెల 26 నుంచి 31 వరకు, రెండో విడత జూన్ 23 నుంచి 28 వరకు, మూడో విడత జూలై 21 నుంచి 26 వరకు జరుగుతుందన్నారు. నగర పరిధిలో కూలీలు అధికంగా ఉండే ప్రాంతాలు, భవన నిర్మాణ స్థలాలు, వలస కూలీలు ఉండే ప్రాంతాలు, చేపల వేట సాగించే గ్రామాలపై ప్రత్యేకంగా దృష్టిసారించినట్టు చెప్పారు.

ప్రభుత్వ టీచర్లకు గడ్డు పరిస్థితి

... 5వ పేజీ తరువాయి

చేపట్టిన బదిలీల్లో భాగంగా వీరు తప్ప నిసరిగా బదిలీ కోసం దరఖాస్తు చేయాలి. తమ కు అనుకూలమైన ప్రాంతాల్లోని పాఠశాలలను ఆప్షన్స్‌గా ఇవ్వొచ్చు. కానీ విద్యా శాఖ అధికా రులు కొత్త నిబంధనను అమల్లోకి తెచ్చారు. ప్రభుత్వ పాఠశాలలకు నియమితులై, అనంత రం కాలంలో జడ్పీ, మునిసిపల్ పాఠశాలలకు బదిలీ అయి, ఒకేచోట ఎనిమిదేళ్ల సర్వీసు పూర్త యిన ఉపాధ్యాయులంతా తమ సొంత యాజ మాన్యమైన ప్రభుత్వ పాఠశాలలకు బదిలీ కావాల్సిందేనని ఉత్తర్వులు జారీ చేశారు. గతంలో ఏజెన్సీలోని ప్రభుత్వ పాఠశాలల్లో పని చేస్తూ మైదాన ప్రాంతంలోని జడ్పీ, మునిసిపల్ పాఠశాలలకు బదిలీ అయిన వారు దిక్కుతోచని స్థితిలో పడ్డారు. అనకాపల్లి, విశాఖ జిల్లాల్లో ప్రభుత్వ యాజమాన్య ప్రాథమిక పాఠశాలలు చాలా తక్కువ వున్నాయి. దీంతో ఈ రెండు జిల్లాల్లో పనిచేస్తున్న పలువురు ప్రభుత్వ ఉపా ధ్యాయులు అల్లూరి సీతారామరాజు జిల్లాకు తప్పనిసరిగా బదిలీ కావాల్సిన పరిస్థితి నెల కొంది. దీనిపై ఆయా ఉపాధ్యాయులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో ఏజెన్సీ ప్రాంతంలో సంవత్సరాల తరబడి పనిచేసి, మైదాన ప్రాంతానికి వచ్చిన ఉపాధ్యాయులు మళ్లీ ఏజెన్సీకే వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడిందని, దీనిపై ప్రభుత్వం పునరాలోచన చేయాలని, ఉపాధ్యాయ సంఘాలు కూడా స్పందించాలని కోరుతున్నారు.

గందరగోళంగా బదిలీల ప్రక్రియ

- ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులనాయుడు

నర్సీపట్నం: ఉపాధ్యాయ బదీలల ప్రక్రియ గందరగోళంగా తయారైందని ఉత్తరాంధ్ర ఉపా ధ్యాయ ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులనాయుడు విమర్శించారు. ఆదివారం ఆయన ఇక్కడ మీడి యాతో మాట్లాడుతూ, రేషనలైజేషన్‌తో ముడి పెట్టడం వల్ల టీచర్ల బదిలీల ప్రక్రియ సక్రమం గా జరగడం లేదన్నారు. ఒకసారి రేషనలైజేషన్ అయిన తర్వాత కనీసం ఐదు సంవత్సరాల వ రకు ఉపాధ్యాయులను కదపకూడదని, ఇలా అయితేనే విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు ఉపాధ్యాయులకు అవకాశం ఉంటుందని అన్నారు. మైదాన ప్రాంతం నుంచి ఏజెన్సీకి బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులకు రెండేళ్లకు రెండు పాయింట్లు అదనంగా ఇవ్వాలని డిమాండ్ చేశారు. 2021లో బదిలీపై వచ్చి 2025లో రేషనలైజేషన్ అయిన ఉపాధ్యాయుల కు పాత స్టేషన్ పాయింట్లు ఇవ్వాలన్నారు. బదిలీల ప్రక్రియ ఆన్‌లైన్‌లో తలెత్తిన సమస్య లన తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు డీజీనాథ్, నేతలు కురచా వెంక టరమణ, జీపీఎస్ నాయుడు పాల్గొన్నారు.

సర్వర్‌తో సమస్యలు

... 5వ పేజీ తరువాయి

అప్‌లోడ్ చేయాలి. అయితే ఆఫ్‌లైన్, ఆన్ లైన్ దరఖాస్తుల మధ్య కొన్ని పాయింట్లు తేడా వస్తోందని, దీనిపై సంబంధిత టీచర్‌ను పిలిచి మళ్లీ సవరిస్తున్నారు. స్పౌజ్ పాయింట్లు కొంద రికి ఆన్‌లైన్‌లో కనిపించడం లేదంటున్నారు.

ఎస్‌ఎఫ్‌ఎస్ స్కూల్‌లో హెల్ప్ డెస్క్

బదిలీల దరఖాస్తుల స్వీకరణ నేపథ్యంలో నగరంలోని సీతమ్మధార ఎస్‌ఎఫ్‌ఎస్ స్కూల్ లో హెల్ప్ డెస్క్‌ను ఏర్పాటు చేశారు. ఉమ్మడి జిల్లాలో పలు మండలాల విద్యాశాఖాధికారు లు, ఇతర సిబ్బంది ఇక్కడ సేవలందిస్తున్నారు. టీచర్లు పెట్టుకునే ఆన్‌లైన్ దరఖాస్తులతో ఎంఈవోల ద్వారా తెచ్చుకున్న ఆఫ్‌లైన్ దరఖా స్తులను పరిశీలిస్తున్నారు. డీఈవో ఎన్.ప్రేమ్ కుమార్ నేతృత్వంలో దరఖాస్తుల పరిశీలన కొ నసాగింది. దరఖాస్తు చేసేటప్పుడు తలెత్తే ఇబ్బందుల గురించి పలువురు ఉపాధ్యాయులు ఇక్కడకు వచ్చి డీఈవోకు వివరించారు.

ఆ పోస్టు భర్తీ ఎప్పుడో !

... 5వ పేజీ తరువాయి

కూడా అద్దె చెల్లించాలని అధికారులు నోటీ సులు ఇవ్వడంతో ఆ సంస్థ వెళ్లిపోయింది. అప్పటినుంచి విదేశాలకు విమానాల ద్వారా సరకులు పంపించే అవకాశం లేకుండా పో యింది. విదేశీ విమానాలు కూడా తగ్గిపోయా యి.గతంలో దుబాయ్, సింగపూర్,మలేషియా, బ్యాంకాక్, శ్రీలంకకు అంతర్జాతీయ విమానాలు ఉండేవి. ఇప్పుడు ఒక్కటే సింగపూర్‌కు నడు స్తోంది. వచ్చే నెలలో అబుదాబీకి కొత్త సర్వీసు రానున్నది. రద్దయిన బ్యాంకాక్, మలేషియా విమానాలను పునరుద్ధరిస్తామని కేంద్ర పౌర విమానయాన శాఖా మంత్రి ప్రకటించినా అది ఆచరణలోకి రాలేదు. అంతర్జాతీయ సరకు రవాణా సమస్యను కేంద్ర మంత్రి దృష్టికి విశా ఖ ఎంపీ తీసుకువెళితే గత ఏడాది అక్టోబరు లోనే ఢిల్లీ అధికారులకు ఫోన్ చేసి తక్షణమే తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అయితే ఇప్పటివరకు ఆ ఆదేశాలు అమలుకు నోచుకోలేదు. విశాఖ పరిసరాల్లో వందకు పైగా ఫార్మా కంపెనీలు, కేవలం ఎగుమతులు చేసే బ్రాండిక్స్ దుస్తుల కంపెనీ, వజ్రాలు ఎగుమతి చేసే వీఎస్ఈజెడ్, ఏడాదికి రూ.20 వేల కోట్ల విలువైన రొయ్యలు ఎగుమతి చేసే సీఫుడ్ ఎగుమతిదారులు ఇక్కడ ఉన్నారు. వీరికి అం తర్జాతీయ కార్గో సర్వీసులు లేకపోవడం వల్ల రోడ్డు మార్గాన పంపుతున్నారు. కొన్ని విమాన సంస్థలు ఆక్యుపెన్సీ లేదని సర్వీసులను రద్దు చేసుకుంటున్నాయి. వాటికి సరకు రవాణాకు అనుమతి ఇస్తే.. ట్రిప్పునకు టన్ను నుంచి 1.5 టన్నుల సరకు తీసుకువెళ్లే అవకాశం ఉంది. సుమారు 15 నుంచి 20 మంది ప్రయాణికుల ను తీసుకెళ్లినట్టు అవుతుంది. కొత్త సర్వీసులకు రన్ వే చార్జీలు, పార్కింగ్, రూట్ నేవిగేషన్ చార్జీలలో కొంత రాయితీ ఇస్తే ఉత్సాహంగా ముందుకు వస్తాయి. ఆదాయం సమకూర్చే వా టికి రాయితీలు ఇస్తున్న ప్రభుత్వాలు వీటిని కూడా పరిశీలించాల్సి ఉంది.

మందసలో ఎయిర్ కార్గో సెంటర్ ఏర్పాటు

ముందు వచ్చిన చెవులు కంటే వెనక వచ్చిన కొమ్ములు వాడి అన్నట్టుగా ఉంది ప్రస్తుతం ఉత్తరాంధ్రాలో పరిస్థితి. విశాఖలో విశాఖపట్నం పోర్టు, గంగవరం పోర్టు ఉండగా నక్కపల్లిలో ఆర్సెలర్ మిట్టల్ స్టీల్ కంపెనీ కోసం మరో పోర్టును నిర్మించబోతున్నారు. ఇప్పుడు ఏడాదికి సుమారు వంద మిలియన్ టన్నుల సరకు ఈ పోర్టు ద్వారా రవాణా జరు గుతోంది. ఇక్కడ ఎయిర్ కార్గోకి విస్తృత అవకా శాలు ఉన్నాయి. ఇవన్నీ విస్మరించి శ్రీకాకుళం జిల్లాలో కొత్తగా మూలపేటలో నిర్మిస్తున్న పోర్టుకు అనుబంధంగా పలాస సమీపాన బిమిడిలో ఎయిర్ కార్గో సెంటర్ ఏర్పాటు చేయాలని ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది. ఆ పోర్టుకు బిమిడికి 40 కి.మీ. దూరం ఉంటుంది. దానికి 1,400 ఎకరాల భూమిని సేకరిస్తున్నా రు. అన్ని రకాల వసతులున్న విశాఖను వదిలి అసలు విమానాశ్రయమే లేని పలాసలో ఎయి ర్ కార్గో సెంటర్ పెడితే ప్రయోజనం ఏమిటో పెద్దలకే తెలియాలి. కొత్తగా వచ్చేవారిని ప్రోత్స హించడానికి దశాబ్దాలుగా నడుస్తున్న విశాఖ విమానాశ్రయాన్ని విస్మరించడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ఏయూలో ఎయిడెడ్ రచ్చ!

విశాఖపట్నం, మే 25 (ఆంధ్రజ్యోతి) : ఏయూలో ఎయిడెడ్ ఫ్యాకల్టీ వ్యవహారంపై రచ్చ జరుగు తోంది. ఎయిడెడ్ కాలేజీల నుంచి అధ్యాపకులను వెనక్కి పంపించాలంటూ కొన్నాళ్లుగా వర్సిటీలోని సీనియర్ ప్రొఫెసర్లు, ఇతర ఫ్యాకల్టీలు డిమాండ్ చేస్తున్నారు. మంత్రులను కలిసి వినతులు కూడా సమర్పించారు. తాజాగా ఏయూ వీసీ జీపీ రాజశేఖర్ ఎయిడెడ్ నుంచి వచ్చిన ఫ్యాకల్టీపై వర్సిటీలోని కాలేజీ ప్రిన్సిపాళ్లు, హెచ్‌వోడీలతో సమావేశం ఏర్పాటు చేసి వారి అభిప్రాయాలు సేకరించారు. ఈ సమావేశానికి ఎయిడెడ్ ఫ్యాకల్టీని దూరంగా ఉంచారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాళ్లు, హెచ్‌వోడీలంతా వారిని వెనక్కి పంపించాలంటూ స్పష్టం చేశారు. దీంతో వీసీ కూడా దీనిపై నిర్ణయం తీసుకున్నట్టు తెలిసింది. ఈనెలాఖరు నాటికి వర్సిటీ నుంచి వారిని వెనక్కి పంపేందుకు నిర్ణయం తీసుకున్నట్టు సమాచారం. ఈక్రమంలో వర్సిటీలో పనిచేస్తున్న ఎయిడెడ్ ఫాకల్టీ నగర పరిధిలోని పలువురు ఎమ్మె ల్యేలను కలిసి తమ సమస్యను విన్నవించారు. తమను 2023 జూన్‌లో డిప్యూటేషన్‌పై మూడేళ్ల కాలపరిమితికి తీసుకున్నారని, అందువల్ల 2026 జూన్ వరకు కొనసాగించాలని కోరుతున్నారు.

భారీ వాహనాలపై నియంత్రణ కరువు

- పగటి పూట నగరంలోకి యథేచ్ఛగా ప్రవేశం
- సూచన బోర్డులు లేకపోవడంతో మద్దిలపాలెం వైపు నుంచి ఆర్టీసీ కాంప్లెక్స్ వైపు రాక
- ట్రాఫిక్‌కు తప్పని ఇబ్బందులు


మద్దిలపాలెం నుంచి ఆర్టీసీ కాంప్లెక్స్ వైపు ప్రయాణిస్తున్న లారీలు

మద్దిలపాలెం, మే 25 (ఆంధ్రజ్యోతి) : నగరంలోకి పట్టపగలే భారీ లారీలు ప్రవేశిస్తున్నాయి. మద్దిలపాలెంజాతీయ రహదారి నుంచి ఆర్టీసీ కాంప్లెక్స్ వైపు ప్రయాణిస్తున్నాయి.మద్దిలపాలెం కూడలి వద్ద కొన్నిసార్లు ట్రాఫిక్ పోలీసు సిబ్బంది ఉంటే లారీలను నిలిపివేస్తున్నారు. లేదంటే ఆ భారీ వాహనాలు దర్జాగా నగరంలోకి వెళ్లిపోతున్నాయి. నగరంలో లోడులు, అన్‌లోడింగ్ చేసే వాహనాలు మధ్యాహ్నం పోలీసులు భోజనాలు చేసే సమయంలో మద్దిలపాలెం మీదుగా వస్తున్నాయి. భారీ వాహనాల రాకతో నగరంలో తిరిగే ఇతర వాహనదారులకు ఇబ్బందులు తప్పడం లేదు. కొన్నిసార్లు ప్రమాదాలకు గురవుతున్నారు.

ఆనందపురం నుంచి అనకాపల్లి వరకు జాతీయ రహదారి నగరం మధ్య నుంచి వెళ్తోంది. నగరం బయట నుంచి ఆరు లైన్ల నూతన జాతీయ రహదారి నిర్మాణం పూర్తయి అందుబాటులోకి వచ్చింది. కానీని ఆ మార్గంలో మూడు టోల్‌గేట్లు, అలాగే కిలోమీటర్ల వ్యత్యాసం ఉండడంతో పగటిపూట కూడా భారీ లారీలు నగరం నుంచి మద్దిలపాలెం, ఎన్‌ఏడీ జంక్షన్, గాజువాక మీదుగా ప్రయాణాలు చేస్తున్నాయి. అందుకే నగరంలో లారీల కింద పడి చాలా మంది మృత్యువాత పడుతున్నారు.

మద్దిలపాలెం, ఆనందపురం నుంచి అనకాపల్లి వైపు వెళ్లే లారీ డ్రైవర్లు మద్దిలపాలెం వద్దకు రాగానే రూటు విషయంలో గందరగోళానికి గురవుతున్నారు. మద్దిలపాలెం వద్ద ఎలాంటి సూచన బోర్డులు లేకపోవడంతో పలు భారీ వాహనాల డ్రైవర్లు ఆర్టీసీ కాంప్లెక్స్ వైపు వెళ్లిపోతున్నారు. శుక్రవారం ఉదయం కూడా లారీలు నేరుగా ఆర్టీసీ కాంప్లెక్స్ వైపు వెళ్లాయి. అవుట్ పోస్ట్ సిబ్బంది లారీలను వెనక్కు వెళ్లాలని సూచించగా, ట్రాఫిక్‌లో లారీలు వెనక్కు మళ్లించేందుకు చాలా ఇబ్బంది లు ఎదురయ్యాయి. అంతలో సాధారణ ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. అధికారులు మద్దిలపాలెం హైవే మలుపు వద్ద సూచిక బోర్డులు ఏర్పాటు చేస్తే కొంత వరకు సమస్య పరిష్కారం అవుతుందని వాహనదారులు అభిప్రాయ పడుతున్నారు.

స్కూటరుపై మహానాడుకు దివ్యాంగుడు


స్కూటర్ యాత్రను ప్రారంభిస్తున్న ఎంపీ శ్రీభరత్

విశాఖపట్నం, మే 25 (ఆంధ్రజ్యోతి) : కడపలో మంగళవారం నుంచి మూడు రోజుల పాటు జరగనున్న టీడీపీ మహానాడుకు విశాఖ పార్లమెంట్ విభిన్న ప్రతిభావంతులు సెల్ అధ్యక్షుడు ఇసరపు వాసు స్కూటరుపై బయలుదేరారు. ఈమేరకు ఎయిర్‌పోర్టు వద్ద స్కూ టరు యాత్రను ఎంపీ ఎం. శ్రీభరత్ ఆదివారం జెండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ విశాఖ పార్లమెంట్ అధ్యక్షుడు గండి బాబ్జి, ఉత్తర నియోజకవర్గ నాయకుడు వెల్లంకి భరత్, విజయనగరం డీసీఎంఎస్ చైర్మన్ గొంప కృష్ణతదితరులు పాల్గొన్నారు.

ఎల్వీ ప్రసాద్ నేత్ర వైద్యశాల ఆధ్వర్యంలో వైటథాన్ రన్

- కంటి కేన్సర్‌పై అవగాహన కల్పిస్తూ నిర్వహణ


బీచ్ రోడ్డులో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

రామ్‌నగర్, మే 25 (ఆంధ్రజ్యోతి) : అంతర్జాతీయ రెటీనో బ్లాస్టోమా అవగాహనా వారోత్సవాల సందర్భ ఆదివారం ఎల్వీ ప్రసాద్ నేత్ర వైద్య విజ్ఞాన సంస్థ ఆధ్వర్యంలో కోస్టల్ బ్యాటరీ నుంచి గోకుల్ పార్కు మీదుగా బీచ్‌రోడ్డులో అవగాహనా వైటథాన్ రన్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రముఖ నేత్ర వైద్య నిపుణురాలు డాక్టర్ సునీతా మాట్లాడుతూ రెటీనో బ్లాస్టోమాపై తల్లిదండ్రులు అవగాహన కలిగి ఉండాలన్నారు. ముఖ్యంగా పిల్లల కంటిలో తెల్లని ప్రతిబింబం కనిపించిన వెంటనే కంటి వైద్య నిపుణుడిని సంప్రదించాలని సూచించారు. ముందస్తుగా గుర్తించడం ద్వారా పిల్లల్లో అంధత్వాన్ని నివారించవచ్చన్నారు. ఇది మూడేళ్ల కంటే తక్కువ వయస్సు ఉన్న పిల్లలపై అధిక ప్రభావం చూపిస్తుందని తెలిపారు. ఈ రన్‌ద్వారా సేకరించిన నిధులను ఆర్థికంగా వెనుకబడిన పిల్లలకు రెటీనో బ్లాస్టోమా చికిత్స కోసం అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ ఎస్. వీరేంద్ర తదితరులతో పాటు పలువురు నేత్ర వైద్య నిపుణులు ఔత్సాహికులు పాల్గొన్నారు.

రహదారి పక్కనే చెత్తాచెదారం


రహదారి పక్కన పడి ఉన్న చెత్త

ఎంవీపీ కాలనీ, మే 25 (ఆంధ్రజ్యోతి) : డంపర్‌బిన్లు లేని నగరంగా తీర్చిదిద్దడానికి జీవీఎంసీ ఓ పక్క ప్రయత్నం చేస్తుంటే, కొందరు స్థానికులు మాత్రం చెత్తచెదారాన్ని రోడ్డు పక్కనే పడేసి, తమ చైతన్యరాహిత్యాన్ని బయటపెట్టకుంటున్నారు. ఉన్నత వర్గాలు ఉండే ప్రాంతంగా పేరొందిన ఎంవీపీ కాలనీలోనే ఈ దుస్థితి నెలకొనడం గమనార్హం. జీవీఎంసీ 18వ వార్డు పరిధిలోని ఎంవీపీ కాలనీ మెడికవర్, డీఆర్‌డీఏ మార్గంలో ఓ చోట, రోడ్డు పక్కన కొందరు వ్యక్తులు చెత్తను విచక్షణారహితంగా పడేస్తున్నారు. మరి కొందరు ఇంకాస్త ముందడుగు వేసి, ఎదురుగా ఉన్న ఓ ప్రైవేటు స్థలంలో చెత్త విసిరేస్తున్నారు. ప్రతిరోజూ పారిశుధ్య సిబ్బంది ఇంటింటికీ వచ్చి చెత్తను తీసుకునేటప్పుడు తడి, పొడి చెత్తను విభజించి వారికి ఇవ్వాల్సి ఉంది. కానీ సిబ్బంది వచ్చే సమయంలో ఈ పని చేయలేని కొందరు చెత్తను తీసుకువచ్చి, ఇక్కడ పడేస్తున్నారు. ఇలాంటి చేష్టల వల్ల పరిసరాలు అధ్వానంగా, దుర్గంధంగా మారుతున్నాయి. ఇలాంటి వారిని గుర్తించి, జరిమానాలు విధించాలని ఈ ప్రాంతీయులు కోరుతున్నారు.

మృతుడి కుటుంబానికి ఆర్థిక సహాయం


రూ.లక్ష చెక్ అందజేస్తున్న ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు

పెదవాల్తేరు, మే 25 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన జీవీఎంసీ 19వ వార్డు పెదజాలారిపేటకు చెందిన ఒలిశెట్టి జ్యోగి (20) కుటుంబానికి ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన రూ.లక్షను ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు, టీడీపీ యువనేత ప్రతాపరుద్ర, 19వ వార్డు కార్పొరేటర్ నొల్లి నూకరత్నం తదితరులు ఆదివారం అందజేశారు. ఇందుకు సంబంధించిన చెక్‌ను వారు అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ వార్డు నాయకులు తెడ్డు రాజు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

నేడు యథాతథంగా ప్రజా సమస్యల పరిష్కార వేదిక

వెంకోజీపాలెం, మే 25(ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ ప్రధాన కార్యాలయంతో పాటు అన్ని జోనల్ కార్యాలయాల్లోనూ సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో నిర్వహించనున్నట్టు నగర మేయర్ పీలా శ్రీనివాసరావు, జీవీఎంసీ ఇన్‌చార్జి కమిషనర్ ఎంఎస్ హరేంధిర ప్రసాద్‌లు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటవరకు ఈ కార్యక్రమం కొనసాగుతుందని, నగరంలో పారిశుధ్యం, పట్టణ ప్రణాళిక విభాగం, మొక్కల విభాగం, రెవెన్యూ, యూసీడీ, ఇంజనీరింగ్ తదితర జీవీఎంసీ విభాగాలకు సంబంధించిన సమస్యలపై ప్రజలు తమకున్న ఫిర్యాదులు, వినతులను నేరుగా తమకు తెలియజేయవచ్చని ప్రకటనలో పేర్కొన్నారు.

చెత్త తరలింపులో నిర్లక్ష్యం

- దుర్గంధంతో అవస్థలు
- పట్టించుకోని అధికారులు


పెదజాలారిపేటలోని ఓ వీధిలో పేరుకుపోయిన చెత్త

బీచ్ రోడ్డు, మే 25, (ఆంధ్రజ్యోతి) : నగరంలోని పెదజాలారిపేట పరిసరాలు వివిధ వ్యర్థాలతో నిండిపోయి ఉన్నాయి. రహదారిపై నడిచి వెళుతుంటే దుర్గంధం భరించలేక ముక్కు మూసుకొని వెళ్లాల్సి వస్తోందని స్థానికులు వాపోతున్నారు. ఈ ప్రాంతంలో పారిశుధ్య నిర్వహణ లేకపోవడంతో ఎక్కడ పడితే అక్కడ చెత్తాచెదారంతో నిండిపోయింది. డ్రైనేజీల్లో పూడికలు తీయకపోవడంతో మురుగు నీరు రోడ్డు మీదకు వస్తోంది. దీంతో రహదారులు అపరిశుభ్రంగా మారుతున్నాయి. దీంతో రోడ్లపై రాకపోకలు సాగించే వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. జీవీఎంసీ పారిశుధ్య సిబ్బంది చెత్త తరలింపు సక్రమంగా చేపట్టకపోవడంతో వ్యర్థాలు పేరుకుపోతున్నాయి. దీనిపై అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని స్థానికులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. నిత్యం రద్దీగా ఉండే ప్రాంతంలో పారిశుధ్య నిర్వహణపై దృష్టి సారించకపోవడం తగదని అంటున్నారు. ఇప్పటికైనా జీవీఎంసీ పారిశుధ్య విభాగం అధికారులు ఈ ప్రాంతంలో ఎప్పటికప్పుడు చెత్త తరలింపునకు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

డిప్యూటీ మేయర్‌ను కలిసిన గీత సహ కులాల సంఘం సభ్యులు


జీవీఎంసీ డిప్యూటీ మేయర్‌ను కలిసిన గీత సహకులాల సంక్షేమ సంఘం ప్రతినిధులు

పెదగంట్యాడ, మే 25 (ఆంధ్రజ్యోతి) : పారిశ్రామిక ప్రాంత గీత సహకులాల సంక్షేమ సంఘం సభ్యులు ఆదివారం జీవీఎంసీ డిప్యూటీ మేయర్ దల్లి గోవిందరెడ్డిని పెదగంట్యాడలోని ఆయన కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాన్ని అందజేశారు. జీవీఎంసీ పరంగా గీత సహకులాలకు తగిన సహకారం అందించాలని కోరారు. డిప్యూటీ మేయర్‌ను కలిసిన వారిలో సంఘం గౌరవాధ్యక్షుడు నెల్లి సాధూరావు, వైస్ చైర్మన్ అండిబోయిన అప్పారావు, ప్రధాన కార్యదర్శి ఒనిమి నాగేశ్వరరావు, ఉపాధ్యక్షుడు అండిబోయిన పెదనూకరాజు తదితరులు ఉన్నారు.

కళాభారతి ఆధ్వర్యంలో 67మంది కళాకారులకు సత్కారం


కళాభారతి నిర్వాహకులు సత్కారం చేసిన 67 మంది కళాకారులు

మద్దిలపాలెం, మే25 (ఆంధ్రజ్యోతి) : పిఠాపురం కాలనీ కళాభారతి ఆడిటోరియంలో ఆదివారం 67 మంది కళాకారులకు ఘనంగా సత్కరించారు. కళలను ప్రోత్సహించడంలో భాగంగా కళాభారతి నిర్వాహకులు వివిధ కళల్లో రాణిస్తున్న వర్ధమాన కళాకారులను సన్మానం చేశారు. ఈ సందర్భంగా కళాభారతి అధ్యక్షుడు ఎం.సత్యనారాయణరాజు మాట్లాడుతూ సంగీతం, సాహిత్యం, నృత్యం, నాటకం, హరికథ, బుర్రకథ, తోలుబొమ్మలాట, జానపద సాహిత్యాలను ప్రోత్సహిస్తూ ఈ కార్యక్రమం చేపట్టినట్టు తెలిపారు. ప్రస్తుతం కళలకు ఆదరణ కరువవుతోందని, ఈ తరుణంలో విస్తృతంగా కళా ప్రదర్శనలు నిర్వహించడం, కళాకారులను సన్మానించి ఆదరించం ద్వారా కళలకు పూర్వ వైభవం తీసుకురావడానికి ప్రయత్నిస్తున్నామన్నారు. అనంతరం ఏర్పాటు చేసిన డాక్టర్ ద్వారం త్యాగరాజ్ గాత్ర కచేరి అలరించింది. కార్యక్రమంలో కళాభారతి కార్యదర్శి రాంబాబు, కోశాధికారి పైడా కృష్ణప్రసాద్, పంతులు గోపాలరావు, శారద సుబ్రహ్మణ్యం జ్యోతి పాల్గొన్నారు.

అధ్వానంగా బస్సు షెల్టర్ల పరిసరాలు



బస్సు షెల్టర్ వద్ద నిర్మాణ వ్యర్థాలు

ఎంవీపీ కాలనీ, మే 24 (ఆంధ్రజ్యోతి) : ఈ ప్రాంతంలో బస్ షెల్టర్ల పరిస్థితి అధ్వానంగా ఉంది. ఎంవీపీ ప్రధాన సర్కిల్ నుంచి టాస్క్ ఫోర్స్ సర్కిల్ వరకూ ఉన్న రహదారిలో బస్ షెల్టరు ఏళ్ల తరబడి దీనావస్థలో ఉన్నా అధికారులు పట్టించుకోవడం లేదు. ఇక్కడ సాధారణ ప్రయాణికులతో పాటు విద్యార్థినులు ఎక్కువగా బస్సుల కోసం వేచి ఉంటారు. బస్ షెల్టరుకు ఇటూ అటూ ఫాస్ట్ ఫుడ్ సెంటర్లు, మెకానిక్ దుకాణాలు వంటివి చాలా ఉన్నాయి. చినుకు పడినా బస్ షెల్టరులోకి వెళ్లడానికి వీలు లేకుండా బురదతో నిండి ఉంటుంది. ఈ బురద నివారణకు గృహ నిర్మాణ వ్యర్థాలను గుట్టగా పోశారు. దీనిపై నడచి వెళ్లడం కూడా కష్టమవుతోంది. చక్కని బస్ షెల్టరు ఉన్నా, ప్రయాణికులు ముక్కు మూసుకునో, ఇబ్బంది పడుతూనో కూర్చోవాల్సి వస్తోంది. ఇప్పటికైనా అధికారులు దీని సంగతేంటో చూడాలని ప్రయాణికులు కోరుతున్నారు.

ఎండీయు వాహనాల ద్వారా రేషన్ పంపిణీ చేయాలి


ర్యాలీ నిర్వహిస్తున్న విశాఖ జిల్లా ఎండీయూ ఆపరేటర్లు, పాల్గొన్న వైసీపీ నేతలు కేకే రాజు, వాసుపల్లి

సిరిపురం, మే 25 (ఆంధ్రజ్యోతి) : ఎండీయూ ఆపరేటర్లకు ఉపాధి కల్పించాలని 2027 కాల పరిమితి వరకూ ఎండీయూ వాహనాల ద్వారా రేషన్ పంపిణీ ప్రక్రియ జరిగేలా చర్యలు తీసుకోవాలని పలువురు నాయకులు కోరారు. ఆదివారం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద విశాఖ జిల్లా ఎండీయూ ఆపరేటర్స్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఎండీయూ వాహనాల ద్వారా రేషన్ పంపిణీ చేయాలంటూ ర్యాలీలోని ఎండీయూ వాహనాలు ఎక్కి ప్లకార్డుల ప్రదర్శించి తమ నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి పడాల రమణ మాట్లాడుతూ ఎండీయూ విధానాన్ని రద్దు చేయడం ద్వారా 20 వేల కుటుంబాలు రోడ్డున పడతాయన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ప్రజా పంపిణీ వ్యవస్థ బలోపేతం చేయాలనే ఉద్దేశం ఉంటే కేరళలో వలే పేద ప్రజలకు 16 రకాల నిత్యావసర సరకులను పంపిణీ చేయవచ్చన్నారు. అంతేకానీ గత ప్రభుత్వంలో నియమించారనే ఉద్దేశంతో వారిని తొలగించాలని కక్షసాధింపు చర్యలు సబబు కాదన్నారు. వైసీపీ నగర అధ్యక్షుడు కే.కే.రాజు, మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ ఎండీయూ ఆపరేటర్స్ నిర్వహిస్తున్న ర్యాలీకి మద్దతు తెలియజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా ఇంటి వద్దకే రేషన్ సరకులను అందించే కార్యక్రమాన్ని వైసీపీ ప్రభుత్వ హయాంలో తీసుకొచ్చామన్నారు. తద్వారా ప్రజల వద్దకే సరకులు పంపిణీ చేయడం ద్వారా వారందరికీ సౌకర్యంగా ఉండేదన్నారు. కార్యక్రమంలో ఆపరేటర్స్ నాయకులు ఎన్.బి.సతీష్, ఫరూక్, స్వామి,ప్రసన్న,గోపి, జగన్నాథం తదితరులు పాల్గొన్నారు.

సమాజంలో చదువు ద్వారా మంచి గుర్తింపు : ఎమ్మెల్సీ గాదె

సిరిపురం, మే 25 (ఆంధ్రజ్యోతి) : సమాజంలో ఉన్నత చదువు ద్వారా మంచి గుర్తింపు లభిస్తుందని ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ శాసన మండలి సభ్యులు గాదె శ్రీనివాసునాయుడు అన్నారు. ఆదివారం సిరిపురం వీఎంఆర్డీఏ చిల్డ్రన్స్ థియేటర్‌లో స్కూల్ ఆఫ్ థియేటర్ ఆర్ట్స్, వైజాగ్ మీడియా ఆధ్వర్యంలో జర్నలిస్టుల పిల్లలకు ప్రతిభా పురస్కారాలను అందజేశారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ఏయూ రిజిస్ట్రార్ ఎన్.ధనుంజయరావు, కమల్ బెయిడ్, బెహరా భాస్కరరావు, వైజీవీ సత్యనారాయణ, గంట్ల శ్రీనుబాబుతో కలిసి జ్యోతి ప్రజ్వలన గావించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటువంటి కార్యక్రమాలు విద్యార్థుల్లో నూతన ఉత్తేజాన్ని కలిగిస్తాయన్నారు. కార్యక్రమానికి స్కూల్ ఆఫ్ థియేటర్ చీఫ్ ఆర్గనైజర్ ఆర్.నాగరాజు పట్నాయక్ ప్రతిభాపురస్కారాలను పంపిణీ చేయడం సంతోషంగా ఉందన్నారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలను అలరించాయి.

సాగర తీరంలో ఆటపాటలతో సరదాగా..


సముద్రం వద్ద స్నానాలు చేస్తున్న పిల్లల కేరింతలు


నీటిలో ఆడుతూ సేద తీరుతున్న చిన్నారులు

వేసవి తాపం నుంచి ఉపశమనం కోసం ఆదివారం ఉదయం తీరానికి చిన్నారులు, యువత, మహిళలు చేరుకొని సముద్ర స్నానాలు చేస్తూ సేద తీరారు. వాహనాల్లో ఉదయానే కుటుంబాలతో తీరానికి చేరుకొన్నారు. రోజుకు భిన్నంగా ఆదివారం ఆకాశం మబ్బులు పట్టడంతో ఏడు గంటల వరకు సూర్యుడు కనిపించలేదు. వాతావరణం ఆహ్లాదంగా ఉండడంతో సముద్ర స్నానాలు చేస్తూ.. ఆటపాటలతో కాలం గడిపారు. ఇన్నాళ్లూ మండుటెండల దెబ్బకు ఉక్కపోతతో అల్లాడిపోయిన నగర జనానికి సముద్ర తీరంలో చక్కని ఉపశమనం కలిగింది.

\- ఆంధ్రజ్యోతి, బీచ్‌రోడ్డు

సినిమా గైడ్

- **ఏస్** : లీలామహల్, శ్రీరామా, ఊర్వశి (కంచరపాలెం),సుకన్య (గోపాలపట్నం), నటరాజ్-1 (పెందుర్తి), మోహిని (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), లిఖిత (శ్రీహరిపురం)
- **మిషన్ ఇంపాజిబుల్** : జగదాంబ
- **ఫైనల్ డెస్టినేషన్** : శారద
- **నిశ్శబ్దప్రేమ** : రమాదేవి, నరసింహ (గోపాలపట్నం),
- **సింగిల్** : మెలోడి, శరత్, కామేశ్వరి, గోకుల్, లక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), మోహిని (గాజువాక), సప్తగిరి (తగరపువలస)
- **శుభం**: శ్రీకన్య, కిన్నెర, లక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), గణేష్ (తగరపువలస)
- **హిట్3**: రమాదేవి, సంగం, శ్రీరామ, గోకుల్, మౌర్య (గోపాలపట్నం), సీతారామయ్య (పరవాడ), తాతా (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 18, టమాటా 16, వంకాయలు (తెలుపు) 20, వంకాయలు (నలుపు) 20, బెండకాయలు 18, పచ్చిమిర్చి 28, కాకరకాయలు 32, బీరకాయలు 36, ఆనపకాయ 14, కాలీఫ్లవర్ 30, క్యాబేజి 16, క్యారెట్ 40 దొండకాయలు 18, బంగాళ దుంపలు 18, అరటికాయ (పె)9, మునక్కాడలు (కిలో) 54, అల్లం (పాతది)54, బరబాటి 24, ముల్లంగి 30, నిమ్మకాయలు (కిలో) 80, బద్దచిక్కుడు 40, దోసకాయలు 16, వెల్లుల్లి (పెద్దవి) 100, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 98, కీరదోస 28, కాప్సికమ్ 54, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 36 చిలగడదుంపలు 38, కంద 64, దేముడు చిక్కుడు 64, గోరు చిక్కుడు 32, కూర పెండలం 26, బ్రకోలి 45 , నూల్‌కోల్ 34, పనస పొట్టు 160, కొండఉసిరి 100, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 3, చుక్కకూర (కట్ట) 3, పాలకూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 20, బూడిద గుమ్మడికాయ 20, కర్రపెండలం 18, మామిడి అల్లం 56, బొప్పాయి 28, జామకాయలు (కిలో) 80.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	525
విజయనగరం	529
శ్రీకాకుళం	529

చికెన్ ధరలు

బ్యాగ్	
రైతు ధర	105
లైవ్ ధర	125
విత్ స్కిన్	220
స్కిన్‌లెస్	230

మురళీనగర్‌లో వైన్ షాపుల జాతర

- మందుబాబుల వీరంగం
- అడ్డుకోవాలని పీజీఆర్ఎస్‌లో వినతులు
- చర్యల కోసం ఎదురుచూపు



మాధవధార నాలుగు రోడ్ల జంక్షన్‌లో బస్సుల రాకపోకలకు అడ్డంగా వైన్ షాప్ ఎదుట రోజూ ఇదే హడావుడి



వైన్ దుకాణం పక్కన ఓ ఇంటి వాకిట్లో మందుబాబు



వైన్ షాపులు కట్టడి చేయాలని కలెక్టర్ హరేంధిర ప్రసాద్‌కు వినతిపత్రం ఇస్తున్న 49వవార్డు నివాసితులు (ఫైల్)

మురళీనగర్, మే 25 (ఆంధ్రజ్యోతి): విశాఖ నగరంలో ప్రశాంత నివాసిత ప్రాంతంగా పేరొందిన ఉత్తర నియోజకవర్గ పరిసరాలు రూపురేఖలు మారిపోతున్నాయి. గత అయిదేళ్లలో వైన్ షాపుల జాతర మొదలైంది. వీటికి పోటీగా బార్ అండ్ రెస్టారెంట్ల సంఖ్య కూడా క్రమేపీ పెరుగుతోంది. మురళీనగర్, నియోజకవర్గ సరిహద్దు ప్రాంతంగా ఉన్న మాధవధారలో వైన్ షాపులు, కొత్తగా కుల ప్రాతిపదికన షాపులు కేటాయించడం, పాత లైసెన్సుల పునరుద్ధరణ వెరసి రెండు కిలోమీటర్ల పరిధిలోనే డజనుకు పైగా దుకాణాలు ఏర్పాటయ్యాయి. వైసీపీ ప్రభుత్వ జమానా తరువాత మద్యం దుకాణాలు ఇప్పుడు ప్రైవేటు పరం కావడంతో పోటీ పెరిగింది. జగన్ ప్రభుత్వంలో ఎక్కడికక్కడ పెట్టిన మద్యం దుకాణాలు ఇపుడు శాశ్వతమవుతున్నాయి. నగర ప్రాంతాల్లో డిమాండ్‌కు తగ్గట్టే, కొత్త సరుకు, కొత్త లుక్‌తో వైన్ షాపులు రెండేళ్ల కాల పరిమితికే రూ.కోట్లలో పెట్టుబడులు పెట్టి తెరిచారు. మాధవధార హైవే రోడ్డు బిర్లాజంక్షన్‌లో ఒక వైన్ షాప్, పెట్రోల్ బంక్ పక్కనే బార్, మురళీనగర్ ప్రవేశ మార్గంలో మాధవ యువజన సమాజం షాపుల్ని ఆనుకొని ఒక బార్‌కి అనుమతులు వచ్చాయి. కొత్తగా మాధవధార పుణ్యక్షేత్రం కొండకు చేరే దారిలోని నాలుగురోడ్ల జంక్షన్‌లో బస్టాపు ఎదుటే ఓ వైన్ దుకాణం తెరిచారు. ఇక్కడ నిత్యం అమ్మకాల జాతర కనిపిస్తుంది. వైన్ షాప్ ఎదుటే తాగి, మద్యం మత్తులో పక్కనే ఉన్న నివాసాల ఎదుటే తూలి పడుతున్నారు. అరుగులపై సేదదీరుతూ వచ్చి పోయే వారిని భయభ్రాంతులకు గురిచేస్తున్నారు. 48ఎ ఆర్టీసీ బస్సులు తిరిగే ప్రధాన రహదారిలో వాహనాల రాకపోకలకు ఇబ్బంది తలెత్తుతున్నా, ప్రొహిబిషన్ అండ్ ఎక్సయిజ్ శాఖలో కదలిక లేదు. వైన్ షాపుల దగ్గరే తాగి రోడ్డుపై చెలరేగుతున్న యువత, బైకు రేసులు పెట్టుకుని మద్యం మత్తులో జోగుతున్నారు. కూత వేటు దూరంలోనే ప్రొహిబిషన్ అండ్ ఎక్సయిజ్ డిప్యూటీ కమిషనరు కార్యాలయం కూడా ఉంది.

49వవార్డులో మరీ జోరు: కొత్తగా 49వవార్డులో రెండు వైన్ షాపులకు అనుమతి ఇచ్చారు. ఇదివరకే ఈ వార్డు పరిసరాల్లో మూడు బార్ అండ్ రెస్టారెంట్లు నడుస్తున్నాయి. దీంతో కామాక్షినగర్ రోడ్డు నుంచి బర్మాక్యాంప్ రైల్వే సొసైటీ నివాసితులు షాపుల ఎదుట ఇటీవల ఆందోళన చేపట్టారు. తాత్కాలికంగా మూసిన వైన్ షాపులు తిరిగి పోలీస్ రక్షణతో తెరుచుకుని వ్యాపారాలు చేస్తున్నారు. దీనిపై ఉత్తర ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్ రాజు, కలెక్టర్ ఎన్.హరేంధిర ప్రసాద్, జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్‌లకు పీజీఆర్ఎస్‌లో "కామాక్షినగర్ సాయి సంహిత వెల్ఫేర్ సొసేటీ' పేరిట నివాసితులు వినతులు అందించారు. మద్యం ఏరులై పారుతోందని, పార్కులు ఎక్కువగా ఉన్న ఈ ప్రాంతాల్లో చేతిలో సీసాలతో చేరుతున్న మందుబాబులు అతివలను, పిల్లలను ఇబ్బంది పెడుతున్నారని ఫిర్యాదు ఇచ్చారు. ఈ వినతులపై ప్రభుత్వ చర్యలు, ఎక్సయిజ్ అండ్ ప్రొహిబిషన్, ఎన్‌ఫోర్స్‌మెంట్ శాఖల స్పందన కోసం మురళీనగర్, మాధవధార ప్రాంతాల నివాసితులు ఎదురుచూస్తున్నారు.

వెలిగిన వీధి దీపాలు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

విశాఖపట్నం, మే 25 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ జోన్-5 పరిధి అక్కయ్యపాలెం ముస్లింతాటిచెట్లపాలెంలో వీధి దీపాలకు జీవీఎంసీ అధికారులు మరమ్మతు చేయడంతో వెలుగుతున్నాయి. ముస్లింతాటిచెట్లపాలెం జంక్షన్ నుంచి ఆంధ్రజ్యోతి కార్యాలయం వరకు జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న సర్వీస్‌రోడ్డులోని వీధి దీపాలతోపాటు ఆంధ్రజ్యోతి కార్యాలయం నుంచి కేంద్రీయవిద్యాలయం, రామచంద్రనగర్ రోడ్డులో వీధిదీపాలు కొద్దిరోజులుగా వెలగకపోవడంతో చీకటిపడితే అంధకారం అలముకుంది. దీనివల్ల రాత్రివేళ ఆ మార్గాల్లో ఆకతాయిలు, గంజాయి ముఠాలు రెచ్చిపోతున్నారు. దీనిపై ఆంధ్రజ్యోతిలో ఈ నెల 22న కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. దీనికి స్పందించిన జీవీఎంసీ జోన్-5 ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ విభాగం అధికారులు సమస్యను గుర్తించి మరమ్మతు చేశారు. ప్రస్తుతం వీధిదీపాలు వెలుగుతుండడంతో ఆ ప్రాంతవాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

అక్కయ్యపాలెం, మే 25 (ఆంధ్రజ్యోతి): నిర్వహణ పనులు చేపడుతున్నందున సోమవారం ఉదయం 8-30 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఈఈ బి.సింహాచలం నాయుడు తెలిపారు. నరసింహనగర్, రైతుబజారు ఏరియా, విద్యుత్‌నగర్ ఏరియా, పోర్టు ఈస్ట్ గేట్ ఏరియా, బాలయ్య శాస్త్రి లే అవుట్ ఏరియాల్లో కరెంట్ సరఫరా ఉండదన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

శక్తియాప్‌తో సేవలు



యాప్ వినియోగంపై అవగాహన కల్పిస్తున్న పోలీసులు

మురళీనగర్, మే 25 (ఆంధ్రజ్యోతి): పోలీసు శాఖ పర్యవేక్షణలో పనిచేసే శక్తి మొబైల్ యాప్ అందరికీ రక్షణ అందిస్తుందని కంచరపాలెం, ఎయిర్‌పోర్ట్ పోలీస్ స్టేషన్ల సిబ్బంది నర్సింగరావు, జగన్నాథంలు పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ తమ ఫోన్‌లో ఈ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుంటే ఆపద సమయాల్లో పోలీసు రక్షణ లభిస్తుందన్నారు. మురళీనగర్ సెక్టార్-8 పరిధిలోని ప్రజలకు ఆదివారం అవగాహన కల్పించారు. రోడ్డు కూడలిలో బాటసారులతో మాట్లాడి మొబైల్స్‌లో శక్తి యాప్ పనితీరును వివరించారు. రాత్రి వేళ తెలియని ప్రదేశాల్లో గమ్యస్థానాల్ని చేరడంలో కష్టంగా ఉన్నప్పుడు ఈ యాప్‌తో పోలీసుల సహాయం పొందవచ్చన్నారు.

ఆటోను ఢీకొట్టిన కారు నలుగురికి గాయాలు

అక్కయ్యపాలెం, మే 25 (ఆంధ్రజ్యోతి): అక్కయ్యపాలెం సమీప రహదారిపై శనివారం అర్ధరాత్రి సమయంలో ఆటోను కారు ఢీకొట్టిన ఘటనలో నలుగురు గాయపడ్డారు. పెదగంట్యాడ ప్రాంతానికి చెందిన కాశీరావు కుటుంబ సభ్యులతో ఆర్టీసీ కాంప్లెక్స్‌కు వెళ్తుండగా వ్యతిరేక మార్గంలో వచ్చిన కారు వీరిని ఢీకొంది. వీరంతా శ్రీకాకుళంలో అమ్మవారి దర్శనానికి వెళ్తున్నారు. కాశీరావు, భాస్కరరావు, వరలక్ష్మిలకు తీవ్ర గాయాలయ్యాయి. మిగతా వారికి స్వల్ప గాయాలయ్యాయి. కారు నడిపే వ్యక్తిని అదుపులోకి తీసుకున్నట్లు ట్రాఫిక్ ఎస్సై ఉమామహేశ్వరరావు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామన్నారు. వారు కేర్ ఆస్పత్రిలో చికిత్స పొంది వేరే ఆసుపత్రికి వెళ్లారు.



గాయపడిన మహిళ

'పవన్‌పై ఇష్టమొచ్చినట్లు మాట్లాడితే సహించం'



మాట్లాడుతున్న ఎమ్మెల్యే విజయ్‌కుమార్

అక్కయ్యపాలెం, మే 25 (ఆంధ్రజ్యోతి): జనసేన పార్టీ అధినేత, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌పై ఇష్టమొచ్చినట్లు మాట్లాడితే సహించేది లేదని యలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ హెచ్చరించారు. సీతంపేటలోని జనసేన కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సినీ పరిశ్రమ అసోసియేషన్ ద్వారా వస్తే సమస్యలు పరిష్కరిస్తామని పవన్ అన్నారని, కానీ దీన్ని వక్రీకరించి మాట్లాడడం సరైన పద్ధతి కాదన్నారు. సినిమాటోగ్రఫీ మంత్రిగా ఉన్నప్పుడు చేసిన అభివృద్ధి ఏమిటని పేర్ని నానిని ప్రశ్నించారు. మంత్రిగా ఉన్న సమయంలో సినీ పెద్దలందరినీ బ్లాక్‌మెయిల్ చేసి పరిశ్రమను నిస్తేజం చేశారని మండిపడ్డారు. వైసీపీ పాలనలో అన్ని వ్యవస్థలు భ్రష్టుపట్టాయని ఆరోపించారు. సినీ పరిశ్రమ అంటే తమకు చాలా అభిమానమన్నారు. తమ నాయకుడు పవన్ కల్యాణ్ సినీ పరిశ్రమ నుంచి వస్తే... మీ నాయకుడు ఫ్యాక్షన్ ఇండస్ట్రీ నుంచి వచ్చారని విమర్శించారు. వ్యవస్థలను పెంచుకుంటూ పోయే పార్టీ మాదని, వ్యవస్థలను తుంచుకుంటూ పోయే పార్టీ మీదని, అందుకోసమే చిత్తుగా ఓడి ఇంటికే పరిమితమయ్యారన్నారు. పవన్ కల్యాణ్ తన వేతనాన్ని పిఠాపురం ప్రజల కోసం ఇచ్చేశారని గుర్తు చేశారు. మరోసారి వక్రీకరించి మాట్లాడితే తగిన బుద్ధి చెబుతామని హెచ్చరించారు. ఈ సమావేశంలో నాయకులు శివ ప్రసాద్‌రెడ్డి, పెతకంశెట్టి శ్యాం పాల్గొన్నారు.

వీరజవాన్ల సేవలు కొనియాడుతూ టార్చిలైట్ ర్యాలీ



ర్యాలీలో పాల్గొన్న ఈవెంట్ మేనేజర్లు, ప్రతినిధులు

మహారాణిపేట, మే 25 (ఆంధ్రజ్యోతి): పాకిస్థాన్ తీవ్రవాదులపై వీరోచిత దాడులు జరిపి దేశ రక్షణలో ప్రతిభ చాటిన వీరజవాన్ల సేవలను కొనియాడుతూ ఈవెంట్ మేనేజర్ల సంఘం టార్చిలైట్ ర్యాలీని నిర్వహించింది. ఆదివారం మహారాణిపేట గోకుల్ బీచ్ పార్కు నుంచి వైఎంసీఏ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వీరజవాన్ల త్యాగాలను ప్రతిబింబించే నృత్యరూపకాల ప్రదర్శన వీక్షకుల హృదయాలను స్పందింపచేశాయి. సంఘం అధ్యక్ష, కార్యదర్శులు సందీప్ కుమార్, షరీఫ్ ఖాన్‌ల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ర్యాలీలో మీనాక్షి అనంతరామన్, అజేయ్ అగర్వాల్, దాడి రవికుమార్, ఎన్ఆర్‌కే బాబూరావు, జయచంద్ర, వర్తం ట్రావెల్ అసోసియేషన్ అధ్యక్షుడు కె. విజయ మోహన్, వైజాగ్ హోటళ్ల యాజమాన్యాల సంఘం కార్యదర్శి పవన్ కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

ఏయూలో ఎయిడెడ్ రచ్చ!

విశాఖపట్నం, మే 25 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర విశ్వవిద్యాలయంలో ఎయిడెడ్ ఫ్యాకల్టీ వ్యవహారంపై రచ్చ జరుగుతోంది. ఎయిడెడ్ కాలేజీల నుంచి అధ్యాపకులను వెనక్కి పంపించాలంటూ గత కొన్నాళ్లుగా వర్సిటీలోని సీనియర్ ప్రొఫెసర్లు, ఇతర ఫ్యాకల్టీలు డిమాండ్ చేస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా ఎయిడెడ్ నుంచి వర్సిటీలోకి వచ్చిన ఫ్యాకల్టీని తొలగించాలంటూ పలువురు మంత్రులను కూడా కలిసి వినతులు సమర్పించారు. తాజాగా ఏయూ వీసీ జీపీ రాజశేఖర్ ఎయిడెడ్ నుంచి వచ్చిన ఫ్యాకల్టీపై కీలక సమావేశాన్ని నిర్వహించారు. వర్సిటీలోని కాలేజీ ప్రిన్సిపాళ్లు, హెచ్‌వోడీలతో సమావేశాన్ని ఏర్పాటు చేసి ఎయిడెడ్ నుంచి వచ్చిన ఫ్యాకల్టీపై ఏం చేద్దామంటూ వారి అభిప్రాయాలను సేకరించారు. ఈ సమావేశానికి ఎయిడెడ్ ఫ్యాకల్టీని దూరంగా ఉంచారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాళ్లు, హెచ్‌వోడీలంతా వారిని వెనక్కి పంపించాలంటూ స్పష్టం చేశారు. దీంతో వీసీ కూడా దీనిపై కీలక నిర్ణయాన్ని తీసుకున్నట్టు తెలిసింది. ఈ నెలాఖరు నాటికి వర్సిటీ నుంచి వారిని వెనక్కి పంపేందుకు నిర్ణయం తీసుకున్నట్టు సమాచారం. ఈ క్రమంలో వర్సిటీలో పనిచేస్తున్న ఎయిడెడ్ ఫాకల్టీ నగర పరిధిలోని పలువురు ఎమ్మెల్యేలను కలిసి తమ సమస్యను విన్నవించారు. తమను 2023 జూన్‌లో డిప్యూటేషన్‌పై మూడేళ్ల కాలపరిమితికి తీసుకున్నారని, అందువల్ల 2026 జూన్ వరకు కొనసాగించాలని కోరుతున్నారు. ఈ మేరకు ఎమ్మెల్యేల ద్వారా మంత్రి నారా లోకేశ్ వద్దకు వెళ్లేందుకు సిద్ధపడుతున్నారు.

ఎన్టీఆర్ వ్యక్తి కాదు.. మహాశక్తి



ఎన్టీఆర్ వేషధారణతో గీతాన్ని ఆలపిస్తున్న దృశ్యం

డాబాగార్డెన్స్, మే 25 (ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ వ్యక్తి కాదు.. మహాశక్తి అని పలువురు కళా రంగ ప్రముఖులు కీర్తించారు. స్వరమాధుర్యం వ్యవస్థాపకులు ఎంవీఆర్ నాగేశ్వరరావు ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం విశాఖ పౌరగ్రంథాలయంలో సినీ సంగీత విభావరి నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అతిథులుగా డి.భూపతిరావు, ఆధ్యాత్మికవేత్త ఎం.వి.రాజశేఖర్, సన్‌మూర్తి, భయ్యా శ్రీనివాస్, రుద్రప్రసాద్ జ్యోతి వెలిగించి ప్రారంభించారు. ఎన్టీఆర్ వేషధారణలో ఆలపించిన గీతం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సినీ, రాజకీయ రంగాలకు ఎన్టీఆర్ అందించిన సేవలు వెలకట్టలేనివన్నారు. ఆయన స్ఫూర్తితో యువత ముందుకు వెళ్లాలన్నారు. క్రమశిక్షణ, సంప్రదాయాలకు ఎన్టీఆర్ పెద్దపీట వేసేవారన్నారు. ముఖ్యంగా తెలుగు భాష ఔన్నత్యానికి ఎన్టీఆర్ ఎంతగానో కృషి చేశారన్నారు. ఎంవీఆర్ నాగేశ్వరరావు, భూపతి, రామ నరసింహం, కృష్ణంరాజు, రామారావు, శ్రీనివాసరావు, పెమ్మరాజు, గాయనీమణులు భాగ్యలక్ష్మి, ఉష, కల్యాణి, అంబిక కలసి ఎన్టీఆర్ నటించిన వివిధ చిత్రాల్లోని గీతాలను మధురంగా ఆలపించారు. రూపవాణి వ్యాఖ్యాతగా వ్యవహరించగా, సోమేష్ బృందం సంగీత వాద్యసహకారం అందించింది.

నేటి నుంచి మీజిల్స్, రుబెల్లా వ్యాక్సినేషన్

విశాఖపట్నం, మే 25 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో సోమవారం నుంచి మీజిల్స్ రుబెల్లా వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని ప్రారంభించనున్నట్టు డీఎంహెచ్‌ఓ డాక్టర్ పి.జగదీశ్వరరావు తెలిపారు. ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. మీజిల్స్-రుబెల్లా అన్నవి వైరస్‌లని, వీటివల్ల పిల్లల్లో న్యుమోనియా, విరేచనాలు, మెదడువాపు వంటి తీవ్రమైన సమస్యలు వస్తాయన్నారు. ఈ వ్యాధుల నుంచి పిల్లలను రక్షించేందుకు యూనివర్సల్ ఇమ్యునైజేషన్ ప్రోగ్రామ్‌లో భాగంగా రెండు డోసుల టీకాలను అందిస్తున్నట్టు వెల్లడించారు. మొదటిడోసు 9 నుంచి 12 నెలల వయసులో, రెండో డోసు 12 నుంచి 24 నెలల వయసులో ఇవ్వాల్సి ఉంటుందన్నారు. 2026 నాటికి మీజిల్స్ రుబెల్లా రహిత దేశంగా మార్చాలన్నది కేంద్రం లక్ష్యమని, అందులో భాగంగా మూడు నెలల పాటు జిల్లాలో ప్రత్యేక టీకాల డ్రైవ్ చేపడుతున్నట్టు తెలిపారు. మొదటి విడత ఈ నెల 26 నుంచి 31 వరకు, రెండో విడత జూన్ 23 నుంచి 28, మూడో విడత జులై 21 నుంచి 26 వరకు జరుగుతుందన్నారు. నగర పరిధిలో శ్రామికులు అధికంగా ఉండే ప్రాంతాలు, భవన నిర్మాణ స్థలాలు, వలస కూలీల ప్రాంతాలు, చేపల వేట సాగించే గ్రామాలపై ప్రత్యేకంగా దృష్టిసారించినట్టు చెప్పారు.

దొండపర్తిలో మన్ కీ బాత్

దొండపర్తి, మే 25 (ఆంధ్రజ్యోతి): దక్షిణ నియోజకవర్గం బీజేపీ కో-కన్వీనర్ కారాల మహేష్ ఆధ్వర్యంలో గ్రేటర్ 27వ వార్డు దొండపర్తిలోని కార్యాలయంలో మన్ కీ బాత్ కార్యక్రమం ఆదివారం జరిగింది. ముఖ్యఅతిథిగా మాజీ కార్పొరేటర్ బులుసు జగదీష్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ మన్ కీ బాత్ కార్యక్రమాన్ని టీవీలో వీక్షించారు. మండల అధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శి బీవీవీ సత్యనారాయణ, బూత్ ప్రెసిడెంట్ పండు, ఈశ్వరరావు, రాజేశ్వరరావు, రమేష్, వెంకటేష్, చంద్రశేఖర్‌రెడ్డి, యాదగిరి రెడ్డి, సాయి తదితరులు పాల్గొన్నారు.

మావోయిస్టులతో ప్రభుత్వం శాంతి చర్చలు జరపాలి

రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తల డిమాండ్



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ ఎంఎల్ నాయకుడు ప్రసాద్

మహారాణిపేట, మే 25 (ఆంధ్రజ్యోతి): 'ఆపరేషన్ కగారు' పేరుతో పోలీసులు సాగించిన హత్యాకాండపై సుప్రీంకోర్టు సింగిల్ జడ్జితో విచారణ జరిపించి, కేంద్ర ప్రభుత్వం మావోయిస్ట్ పార్టీతో శాంతిచర్చలు జరపాలని వామపక్షాలు, వివిధ ప్రజా సంఘాలు డిమాండ్ చేశాయి. జగదాంబ కూడలి వద్ద సీఐటీయూ కార్యాలయంలో ఆదివారం సాయంత్రం నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో పలువురు మాట్లాడుతూ తక్షణమే కాల్పులు నిలిపివేసి మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ కార్యదర్శి నంబాళ్ల కేశవరావు మృతదేహాన్ని బంధువులకు అప్పగించాలని విజ్ఞప్తి చేశారు. ఏకపక్ష ఎన్‌కౌంటర్లు సరికాదని, ఆదివాసీలకు రక్షణ కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. పర్యావరణానికి హాని కలిగిస్తూ, దేశ ప్రజల ఆస్తులను కార్పొరేట్లకు అప్పగించాలని కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఇదంతా చేస్తోందని ఆరోపించారు. పహల్గాంలో దాడి జరిపిన ఉగ్రవాదులను ఇప్పటివరకు పట్టుకోలేకపోయిందని ఎద్దేవా చేశారు. ఆపరేషన్ కగారు పేరుతో మావోయిస్టు నేతలను, ఆదివాసీలను చంపడం దుర్మార్గమని, వారిపై హత్య కేసు నమోదుకు సుప్రీంకోర్టు ఆదేశించాలని కోరారు. మృతదేహాలకు అంతిమ సంస్కారం చేసుకొనే హక్కు మానవ సమాజానికి ఉందని, దేశంలోని రాజకీయ, ప్రజా, మానవ, దళిత విద్యార్థి సంఘాలు ఈ దమనకాండను ఆపాలని కోరుతున్నాయని తెలిపారు. సీపీఐ ఎంఎల్ నాయకుడు పి.ప్రసాద్, పీడబ్ల్యూవో రాష్ట్ర అధ్యక్షురాలు ఎం.లక్ష్మి, మణి, టీ.శ్రీరామ్మూర్తి, వీఎస్ కృష్ణ, డి.లలితా, చంద్రశేఖర్, చలం, అన్నపూర్ణ, రామచంద్రరావు, ఎం.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

రహమాన్ దంపతులకు ఆత్మీయ సన్మానం



రహమాన్ దంపతులకు జ్ఞాపిక అందిస్తున్న దృశ్యం

మహారాణిపేట, మే 25 (ఆంధ్రజ్యోతి): అభివృద్ధిని రాజకీయాలతో ముడిపెట్టరాదని, అలా చేయగలిగినప్పుడే ఆ నాయకుని జీవితం సార్థకమవుతుందని, ఆ కోవకు చెందిన మాజీ ఎమ్మెల్యే డాక్టర్ ఎస్ఏ రహమాన్ ధన్యులని దక్షిణ నియోజకవర్గం ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ అన్నారు. ఆదివారం పూర్ణామార్కెట్ సమీపంలోని ఓ సమావేశమందిరంలో డాక్టర్ రహమాన్, షరీన్ దంపతుల 75 వసంతాల ఆత్మీయ వేడుకలను నిర్వహించి, వారిని ఘనంగా సత్కరించారు. ఎమ్మెల్యే వంశీకృష్ణ మాట్లాడుతూ ప్రజా సేవ చేయటంలో రహమాన్ తనకు తానే సాటి అని కొనియాడారు. చైతన్య స్రవంతి స్వచ్ఛంద సంస్థ ద్వారా డా షరీన్ సామాజిక సేవలు అందిస్తున్నారని కొనియాడారు. ఈ దంపతులు ప్రజల హృదయాలలో చిరస్థాయిగా నిలిచిపోతారని అన్నారు. రహమాన్‌ను ఈ స్థాయికి తీసుకువచ్చిన ఘనత దివంగత ఎన్టీఆర్‌దని రాజ్యసభ మాజీ సభ్యుడు యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ పేర్కొన్నారు. ప్రజల హృదయాలలో రహమాన్ నిలిచిపోయారని, అందుకు ఈ ఆత్మీయ సత్కారమే నిదర్శనమని అన్నారు. లీడర్ పత్రిక సంపాదకుడు రమణమూర్తి, భాస్కరరావు, శంకరరావు, రవీశ్వరరావు, కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

ఆ పోస్టు భర్తీ ఎప్పుడో!

(5వ పేజీ తరువాయి)

కూడా అద్దె చెల్లించాలని అధికారులు నోటీసులు ఇవ్వడంతో ఆ సంస్థ వెళ్లిపోయింది. అప్పటినుంచి విదేశాలకు విమానాల ద్వారా సరకులు పంపించే అవకాశం లేకుండా పోయింది. విదేశీ విమానాలు కూడా తగ్గిపోయాయి. గతంలో దుబాయ్, సింగపూర్, మలేషియా, బ్యాంకాక్, శ్రీలంకకు అంతర్జాతీయ విమానాలు ఉండేవి. ఇప్పుడు ఒక్కటే సింగపూర్‌కు నడుస్తోంది. వచ్చే నెలలో అబు ధాబీకి కొత్త సర్వీసు రానున్నది. రద్దయిన బ్యాంకాక్, మలేషియా విమానాలను పునరుద్ధరిస్తామని కేంద్ర పౌర విమానయాన శాఖా మంత్రి ప్రకటించినా అది ఆచరణలోకి రాలేదు. అంతర్జాతీయ సరకు రవాణా సమస్యను కేంద్ర మంత్రి దృష్టికి విశాఖ ఎంపీ తీసుకువెళితే గత ఏడాది అక్టోబరులోనే ఢిల్లీ అధికారులకు ఫోన్ చేసి తక్షణమే తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అయితే ఇప్పటివరకు ఆ ఆదేశాలు అమలుకు నోచుకోలేదు. విశాఖ పరిసరాల్లో వందకు పైగా ఫార్మా కంపెనీలు, కేవలం ఎగుమతులు చేసే బ్రాండిక్స్ దుస్తుల కంపెనీ, వజ్రాలు ఎగుమతి చేసే వీఎస్ఈజెడ్, ఏడాదికి రూ.20 వేల కోట్ల విలువైన రొయ్యలు ఎగుమతి చేసే సీఫుడ్ ఎగుమతిదారులు ఇక్కడ ఉన్నారు. వీరికి అంతర్జాతీయ కార్గో సర్వీసులు లేకపోవడం వల్ల రోడ్డు మార్గాన పంపుతున్నారు. కొన్ని విమాన సంస్థలు ఆక్యుపెన్సీ లేదని సర్వీసులను రద్దు చేసుకుంటున్నాయి. వాటికి సరకు రవాణాకు అనుమతి ఇస్తే.. ట్రిప్పునకు టన్ను నుంచి 1.5 టన్నుల సరకు తీసుకువెళ్లే అవకాశం ఉంది. సుమారు 15 నుంచి 20 మంది ప్రయాణికులను తీసుకెళ్లినట్టు అవుతుంది. కొత్త సర్వీసులకు రన్ వే చార్జీలు, పార్కింగ్, రూట్ నేవిగేషన్ చార్జీలలో కొంత రాయితీ ఇస్తే ఉత్సాహంగా ముందుకు వస్తాయి. ఆదాయం సమకూర్చే వాటికి రాయితీలు ఇస్తున్న ప్రభుత్వాలు వీటిని కూడా పరిశీలించాల్సి ఉంది.

మందసలో ఎయిర్ కార్గో సెంటర్ ఏర్పాటు

ముందు వచ్చిన చెవులు కంటే వెనక వచ్చిన కొమ్ములు వాడి అన్నట్టుగా ఉంది ప్రస్తుతం ఉత్తరాంధ్రాలో పరిస్థితి. విశాఖలో విశాఖపట్నం పోర్టు, గంగవరం పోర్టు ఉండగా నక్కపల్లిలో ఆర్సెలర్ మిట్టల్ స్టీల్ కంపెనీ కోసం మరో పోర్టును నిర్మించబోతున్నారు. ఇప్పుడు ఏడాదికి సుమారు వంద మిలియన్ టన్నుల సరకు ఈ పోర్టు ద్వారా రవాణా జరుగుతోంది. ఇక్కడ ఎయిర్ కార్గోకి విస్తృత అవకాశాలు ఉన్నాయి. ఇవన్నీ విస్మరించి శ్రీకాకుళం జిల్లాలో కొత్తగా మూలపేటలో నిర్మిస్తున్న పోర్టుకు అనుబంధంగా పలాస సమీపాన బిమిడిలో ఎయిర్ కార్గో సెంటర్ ఏర్పాటు చేయాలని ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది. ఆ పోర్టుకు బిమిడికి 40 కి.మీ. దూరం ఉంటుంది. దానికి 1,400 ఎకరాల భూమిని సేకరిస్తున్నారు. అన్ని రకాల వసతులున్న విశాఖను వదిలి అసలు విమానాశ్రయమే లేని పలాసలో ఎయిర్ కార్గో సెంటర్ పెడితే ప్రయోజనం ఏమిటో పెద్దలకే తెలియాలి. కొత్తగా వచ్చేవారిని ప్రోత్సహించడానికి దశాబ్దాలుగా నడుస్తున్న విశాఖ విమానాశ్రయాన్ని విస్మరించడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ఇళ్లు సరే.. వసతులేవీ?

(5వ పేజీ తరువాయి)

వసతుల కల్పనకు సంబంధించి ప్రతి ఇంటికి రూ.80 వేల వరకు ఖర్చు చేయాలి. ఈ లెక్కన సుమారు రూ.1,200 కోట్ల నిధులు అవసరమని అధికారులు అంచనా వేస్తున్నారు. అంత సొమ్ము ప్రస్తుతం వీఎంఆర్డీఏ వద్ద లేదనేది స్పష్టం. దీంతో టెండర్లు పిలిచేందుకు వెనుకంజ వేస్తున్నారు. ప్రతి కాలనీలో రోడ్లు, డ్రెయిన్లు, తాగునీరు, యూజీడీ, పాఠశాల, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, అంగన్‌వాడీ కేంద్రం వంటి వాటిని ఏర్పాటు చేయాలి. ఇళ్ల నిర్మాణాలు ప్రారంభమైన వెంటనే తొలుత తాగునీటికి ఓవర్ హెడ్ ట్యాంకు, పాఠశాల, ఆరోగ్య కేంద్రం, అంగన్‌వాడీ భవన నిర్మాణాలు చేపట్టాలి. ఉదాహరణకు 11 వేల ఇళ్లు నిర్మిస్తున్న పైడివాడ అగ్రహారంలో సుమారు పాతిక నుంచి 30 వేల మంది నివసిస్తారు. వారందరికీ తాగునీరు కావాలి, ఆయా కాలనీల్లో బోర్లు వేస్తే అంత నీటి లభ్యత ఉండదు. కొన్నిచోట్ల స్థానికంగా భూగర్భ జలాల ద్వారా నీటి సరఫరా చేసినా వేల ఇళ్ల నిర్మాణాలు చేపట్టే కాలనీల్లో సాధ్యం కాదని ఇంజనీర్లు చెబుతున్నారు. దీంతో సమీపంలోని నదులు, వాగులు, పెద్ద చెరువుల నుంచి నీటిని మళ్లించడానికి పైపు లైన్లు, ఫిల్టర్ పాయింట్లు నిర్మించాలి. ప్రస్తుతం 62 లేఅవుట్లలో పద్మనాభం మండలంలోని నర్సాపురం తదితర లేఅవుట్లు మాత్రమే గోస్తనీ నదికి దగ్గరలో ఉన్నాయి. మిగిలిన లేఅవుట్లలో ప్రజలకు తాగునీరు ఇవ్వాలంటే ఏలేరు, రైవాడ, మేహాద్రిగెడ్డ, తాటిపూడిపై ఆధారపడాలి. అయితే ఇంతవరకు ఇందుకు సంబంధించి ఎటువంటి ప్రతిపాదనలు లేవనే వాదన ఉంది. రోడ్లు, విద్యుత్, డ్రెయిన్లు వంటి వసతుల కల్పన చేయాలంటే కనీసం రెండు నుంచి మూడేళ్ల సమయం పడుతుందంటున్నారు. అంతవరకు పూర్తయిన ఇళ్లల్లో లబ్ధిదారులు ఎలా నివాసం ఉంటారు? ఒకవేళ వసతుల కోసం ఎదురుచూస్తే అప్పటి వరకు ఇళ్లను కాపాడేది ఎవరనేది అధికారులే చెప్పాలి. కాలనీల్లో వసతుల కల్పన గురించి హౌసింగ్ పీడీ సత్తిబాబు వద్ద ప్రస్తావించగా.. ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేసే పనులను వేగవంతం చేశామన్నారు. అయితే వసతుల కల్పన బాధ్యత వీఎంఆర్డీఏదేనని, దీనిపై సంబంధిత అధికారులను కలిసి కోరామన్నారు.

సర్వర్‌తో సమస్యలు

(5వ పేజీ తరువాయి)

అప్‌లోడ్ చేయాలి. అయితే ఆఫ్‌లైన్, ఆన్‌లైన్ దరఖాస్తుల మధ్య కొన్ని పాయింట్లు తేడా వస్తోందని, దీనిపై సంబంధిత టీచర్‌ను పిలిచి మళ్లీ సవరిస్తున్నారు. స్పౌజ్ పాయింట్లు కొందరికి ఆన్‌లైన్‌లో కనిపించడం లేదంటున్నారు.

ఎస్ఎఫ్ఎస్ స్కూల్‌లో హెల్ప్ డెస్క్

బదిలీల దరఖాస్తుల స్వీకరణ నేపథ్యంలో నగరంలోని సీతమ్మధార ఎస్ఎఫ్ఎస్ స్కూల్‌లో హెల్ప్ డెస్క్‌ను ఏర్పాటు చేశారు. ఉమ్మడి జిల్లాలో పలు మండలాల విద్యాశాఖాధికారులు, ఇతర సిబ్బంది ఇక్కడ సేవలందిస్తున్నారు. టీచర్లు పెట్టుకునే ఆన్‌లైన్ దరఖాస్తులతో ఎంఈవోల ద్వారా తెచ్చుకున్న ఆఫ్‌లైన్ దరఖాస్తులను పరిశీలిస్తున్నారు. డీఈవో ఎన్.ప్రేమ్‌కుమార్ నేతృత్వంలో దరఖాస్తుల పరిశీలన కొనసాగింది. దరఖాస్తు చేసేటప్పుడు తలెత్తే ఇబ్బందులను ఉపాధ్యాయులు ఇక్కడకు వచ్చి డీఈవోకు వివరించారు.

ప్రభుత్వ టీచర్లకు గడ్డు పరిస్థితి

(5వ పేజీ తరువాయి)

చేపట్టిన బదిలీల్లో భాగంగా వీరు తప్పనిసరిగా బదిలీ కోసం దరఖాస్తు చేయాలి. తమకు అనుకూలమైన ప్రాంతాల్లోని పాఠశాలలను ఆప్షన్స్‌గా ఇవ్వొచ్చు. కానీ విద్యాశాఖ అధికారులు కొత్త నిబంధనను అమల్లోకి తెచ్చారు. ప్రభుత్వ పాఠశాలలకు నియమితులై, అనంతరం కాలంలో జడ్పీ, మునిసిపల్ పాఠశాలలకు బదిలీ అయి, ఒకేచోట ఎనిమిదేళ్ల సర్వీసు పూర్తయిన ఉపాధ్యాయులంతా తమ సొంత యాజమాన్యమైన ప్రభుత్వ పాఠశాలలకు బదిలీ కావాల్సిందేనని ఉత్తర్వులు జారీ చేశారు. గతంలో ఏజెన్సీలోని ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తూ మైదాన ప్రాంతంలోని జడ్పీ, మునిసిపల్ పాఠశాలలకు బదిలీ అయిన వారు దిక్కుతోచని స్థితిలో పడ్డారు. అనకాపల్లి, విశాఖ జిల్లాల్లో ప్రభుత్వ యాజమాన్య ప్రాథమిక పాఠశాలలు చాలా తక్కువ వున్నాయి. దీంతో ఈ రెండు జిల్లాల్లో పనిచేస్తున్న పలువురు ప్రభుత్వ ఉపాధ్యాయులు అల్లూరి సీతారామరాజు జిల్లాకు తప్పనిసరిగా బదిలీ కావాల్సిన పరిస్థితి నెలకొంది. దీనిపై ఆయా ఉపాధ్యాయులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో ఏజెన్సీ ప్రాంతంలో సంవత్సరాల తరబడి పనిచేసి, మైదాన ప్రాంతానికి వచ్చిన ఉపాధ్యాయులు మళ్లీ ఏజెన్సీకే వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడిందని, దీనిపై ప్రభుత్వం పునరాలోచన చేయాలని, ఉపాధ్యాయ సంఘాలు కూడా స్పందించాలని కోరుతున్నారు.

గందరగోళంగా టీచర్ల బదిలీల ప్రక్రియ - ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులనాయుడు

నర్సీపట్నం: ఉపాధ్యాయ బదీలల ప్రక్రియ గందరగోళంగా తయారైందని ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులనాయుడు విమర్శించారు. ఆదివారం ఆయన ఇక్కడ మీడియాతో మాట్లాడుతూ, రేషనలైజేషన్‌తో ముడి పెట్టడం వల్ల టీచర్ల బదిలీల ప్రక్రియ సక్రమంగా జరగడం లేదని అన్నారు. ఒకసారి రేషనలైజేషన్ అయిన తర్వాత కనీసం ఐదు సంవత్సరాల వరకు ఉపాధ్యాయులను కదపకూడదని అన్నారు. ఇలా అయితేనే విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు ఉపాధ్యాయులకు అవకాశం ఉంటుందని అన్నారు. మైదాన ప్రాంతం నుంచి ఏజెన్సీకి బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులకు రెండేళ్లకు రెండు పాయింట్లు అదనంగా ఇవ్వాలని డిమాండ్ చేశారు. 2021లో బదిలీపై వచ్చి 2025లో రేషనలైజేషన్ అయిన ఉపాధ్యాయులకు పాత స్టేషన్ పాయింట్లు ఇవ్వాలన్నారు. బదిలీల ప్రక్రియ ఆన్‌లైన్‌లో తలెత్తిన సమస్యలన తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు డీజీనాథ్, నేతలు కురచా వెంకటరమణ, జీపీఎస్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

భారీ వాహనాలపై నియంత్రణ కరువు

- పగటి పూట నగరంలోకి యథేచ్ఛగా ప్రవేశం
- సూచన బోర్డులు లేకపోవడంతో మద్దిలపాలెం వైపు నుంచి ఆర్టీసీ కాంప్లెక్స్ వైపు రాక
- ట్రాఫిక్‌కు తప్పని ఇబ్బందులు



మద్దిలపాలెం నుంచి ఆర్టీసీ కాంప్లెక్స్ వైపు ప్రయాణిస్తున్న లారీలు

మద్దిలపాలెం, మే 25 (ఆంధ్రజ్యోతి) : నగరంలోకి పట్టపగలే భారీ లారీలు ప్రవేశిస్తున్నాయి. మద్దిలపాలెంజాతీయ రహదారి నుంచి ఆర్టీసీ కాంప్లెక్స్ వైపు ప్రయాణిస్తున్నాయి.మద్దిలపాలెం కూడలి వద్ద కొన్నిసార్లు ట్రాఫిక్ పోలీసు సిబ్బంది ఉంటే లారీలను నిలిపివేస్తున్నారు. లేదంటే ఆ భారీ వాహనాలు దర్జాగా నగరంలోకి వెళ్లిపోతున్నాయి. నగరంలో లోడులు, అన్‌లోడింగ్ చేసే వాహనాలు మధ్యాహ్నం పోలీసులు భోజనాలు చేసే సమయంలో మద్దిలపాలెం మీదుగా వస్తున్నాయి. భారీ వాహనాల రాకతో నగరంలో తిరిగే ఇతర వాహనదారులకు ఇబ్బందులు తప్పడం లేదు. కొన్నిసార్లు ప్రమాదాలకు గురవుతున్నారు.

ఆనందపురం నుంచి అనకాపల్లి వరకు జాతీయ రహదారి నగరం మధ్య నుంచి వెళ్తోంది. నగరం బయట నుంచి ఆరు లైన్ల నూతన జాతీయ రహదారి నిర్మాణం పూర్తయి అందుబాటులోకి వచ్చింది. కానీని ఆ మార్గంలో మూడు టోల్‌గేట్లు, అలాగే కిలోమీటర్ల వ్యత్యాసం ఉండడంతో పగటిపూట కూడా భారీ లారీలు నగరం నుంచి మద్దిలపాలెం, ఎన్ఏడీ జంక్షన్, గాజువాక మీదుగా ప్రయాణాలు చేస్తున్నాయి. అందుకే నగరంలో లారీల కింద పడి చాలా మంది మృత్యువాత పడుతున్నారు.

మద్దిలపాలెం, ఆనందపురం నుంచి అనకాపల్లి వైపు వెళ్లే లారీ డ్రైవర్లు మద్దిలపాలెం వద్దకు రాగానే రూటు విషయంలో గందరగోళానికి గురవుతున్నారు. మద్దిలపాలెం వద్ద ఎలాంటి సూచన బోర్డులు లేకపోవడంతో పలు భారీ వాహనాల డ్రైవర్లు ఆర్టీసీ కాంప్లెక్స్ వైపు వెళ్లిపోతున్నారు. శుక్రవారం ఉదయం కూడా లారీలు నేరుగా ఆర్టీసీ కాంప్లెక్స్ వైపు వెళ్లాయి. అవుట్ పోస్ట్ సిబ్బంది లారీలను వెనక్కు వెళ్లాలని సూచించగా, ట్రాఫిక్‌లో లారీలు వెనక్కు మళ్లించేందుకు చాలా ఇబ్బందులు ఎదురయ్యాయి. అంతలో సాధారణ ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. అధికారులు మద్దిలపాలెం హైవే మలుపు వద్ద సూచిక బోర్డులు ఏర్పాటు చేస్తే కొంత వరకు సమస్య పరిష్కారం అవుతుందని వాహనదారులు అభిప్రాయ పడుతున్నారు.

స్కూటరుపై మహానాడుకు దివ్యాంగుడు



స్కూటర్ యాత్రను ప్రారంభిస్తున్న ఎంపీ శ్రీభరత్

విశాఖపట్నం, మే 25 (ఆంధ్రజ్యోతి) : కడపలో మంగళవారం నుంచి మూడు రోజుల పాటు జరగనున్న టీడీపీ మహానాడుకు విశాఖ పార్లమెంట్ విభిన్న ప్రతిభావంతులు సెల్ అధ్యక్షుడు ఇసరపు వాసు స్కూటరుపై బయలుదేరారు. ఈమేరకు ఎయిర్‌పోర్టు వద్ద స్కూ టరు యాత్రను ఎంపీ ఎం. శ్రీభరత్ ఆదివారం జెండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ విశాఖ పార్లమెంట్ అధ్యక్షుడు గండి బాబ్జి, ఉత్తర నియోజకవర్గ నాయకుడు వెల్లంకి భరత్, విజయనగరం డీసీఎంఎస్ చైర్మన్ గొంప కృష్ణతదితరులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి ఆర్థిక సహాయం



రూ.లక్ష చెక్ అందజేస్తున్న ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు

పెదవాల్తేరు, మే 25 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన జీవీఎంసీ 19వ వార్డు పెదజాలారిపేటకు చెందిన ఒలిశెట్టి జ్యోగి (20) కుటుంబానికి ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన రూ.లక్షను ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు, టీడీపీ యువనేత ప్రతాపరుద్ర, 19వ వార్డు కార్పొరేటర్ నొల్లి నూకరత్నం తదితరులు ఆదివారం అందజేశారు. ఇందుకు సంబంధించిన చెక్‌ను వారు అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ వార్డు నాయకులు తెడ్డు రాజు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

నేడు యథాతథంగా ప్రజా సమస్యల పరిష్కార వేదిక

వెంకోజీపాలెం, మే 25(ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ ప్రధాన కార్యాలయంతో పాటు అన్ని జోనల్ కార్యాలయాల్లోనూ సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో నిర్వహించనున్నట్టు నగర మేయర్ పీలా శ్రీనివాసరావు, జీవీఎంసీ ఇన్‌చార్జి కమిషనర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్‌లు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటవరకు ఈ కార్యక్రమం కొనసాగుతుందని, నగరంలో పారిశుధ్యం, పట్టణ ప్రణాళిక విభాగం, మొక్కల విభాగం, రెవెన్యూ, యూసీడీ, ఇంజనీరింగ్ తదితర జీవీఎంసీ విభాగాలకు సంబంధించిన సమస్యలపై ప్రజలు తమకున్న ఫిర్యాదులు, వినతులను నేరుగా తమకు తెలియజేయవచ్చని ప్రకటనలో పేర్కొన్నారు.

సినిమా గైడ్

- **ఏస్** : లీలామహల్, శ్రీరామా, ఊర్వశి (కంచరపాలెం),సుకన్య (గోపాలపట్నం), నటరాజ్-1 (పెందుర్తి), మోహిని (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), లిఖిత (శ్రీహరిపురం)
- **మిషన్ ఇంపాజిబుల్** : జగదాంబ
- **ఫైనల్ డెస్టినేషన్** : శారద
- **నిశ్శబ్దప్రేమ** : రమాదేవి, నరసింహ (గోపాలపట్నం),
- **సింగిల్** : మెలోడి, శరత్, కామేశ్వరి, గోకుల్, లక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), మోహిని (గాజువాక), సప్తగిరి (తగరపువలస)
- **శుభం**: శ్రీకన్య, కిన్నెర, లక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), గణేష్ (తగరపువలస)
- **హిట్3**: రమాదేవి, సంగం, శ్రీరామ, గోకుల్, మౌర్య (గోపాలపట్నం), సీతారామయ్య (పరవాడ), తాతా (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 18, టమాటా 16, వంకాయలు (తెలుపు) 20, వంకాయలు (నలుపు) 20, బెండకాయలు 18, పచ్చిమిర్చి 28, కాకరకాయలు 32, బీరకాయలు 36, ఆనపకాయ 14, కాలీఫ్లవర్ 30, క్యాబేజి 16, క్యారెట్ 40 దొండకాయలు 18, బంగాళదుంపలు 18, అరటికాయ (పె)9, మునక్కాడలు (కిలో) 54, అల్లం (పాతది)54, బరబాటి 24, ముల్లంగి 30, నిమ్మకాయలు (కిలో) 80, బద్దచిక్కుడు 40, దోసకాయలు 16, వెల్లుల్లి (పెద్దవి) 100, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 98, కీరదోస 28, కాప్సికమ్ 54, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 36 చిలగడదుంపలు 38, కంద 64, దేముడు చిక్కుడు 64, గోరు చిక్కుడు 32, కూర పెండలం 26, బ్రకోలి 45 , నూల్‌కోల్ 34, పనసపొట్టు 160, కొండఉసిరి 100, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 3, చుక్కకూర (కట్ట) 3, పాలకూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 20, బూడిద గుమ్మడికాయ 20, కర్రపెండలం 18, మామిడి అల్లం 56, బొప్పాయి 28, జామకాయలు (కిలో) 80.

కోడిగుడ్లు (నెక్) (వంద - రూ.లలో)	
విశాఖపట్నం	525
విజయనగరం	529
శ్రీకాకుళం	529

చికెన్ ధరలు బ్యాగ్	
రైతు ధర	105
లైవ్ ధర	125
విత్ స్కిన్	220
స్కిన్‌లెస్	230

చెత్త తరలింపులో నిర్లక్ష్యం

- దుర్గంధంతో అవస్థలు
- పట్టించుకోని అధికారులు



పెదజాలారిపేటలోని ఓ వీధిలో పేరుకుపోయిన చెత్త

బీచ్ రోడ్డు, మే 25, (ఆంధ్రజ్యోతి) : నగరంలోని పెదజాలారిపేట పరిసరాలు వివిధ వ్యర్థాలతో నిండిపోయి ఉన్నాయి. రహదారిపై నడిచి వెళుతుంటే దుర్గంధం భరించలేక ముక్కు మూసుకొని వెళ్లాల్సి వస్తోందని స్థానికులు వాపోతున్నారు. ఈ ప్రాంతంలో పారిశుధ్య నిర్వహణ లేకపోవడంతో ఎక్కడ పడితే అక్కడ చెత్తాచెదారంతో నిండిపోయింది. డ్రైనేజీల్లో పూడికలు తీయకపోవడంతో మురుగు నీరు రోడ్డు మీదకు వస్తోంది. దీంతో రహదారులు అపరిశుభ్రంగా మారుతున్నాయి. దీంతో రోడ్లపై రాకపోకలు సాగించే వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. జీవీఎంసీ పారిశుధ్య సిబ్బంది చెత్త తరలింపు సక్రమంగా చేపట్టకపోవడంతో వ్యర్థాలు పేరుకుపోతున్నాయి. దీనిపై అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని స్థానికులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. నిత్యం రద్దీగా ఉండే ప్రాంతంలో పారిశుధ్య నిర్వహణపై దృష్టి సారించకపోవడం తగదని అంటున్నారు. ఇప్పటికైనా జీవీఎంసీ పారిశుధ్య విభాగం అధికారులు ఈ ప్రాంతంలో ఎప్పటికప్పుడు చెత్త తరలింపునకు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

డిప్యూటీ మేయర్‌ను కలిసిన గీత సహ కులాల సంఘం సభ్యులు



జీవీఎంసీ డిప్యూటీ మేయర్‌ను కలిసిన గీత సహకులాల సంక్షేమ సంఘం ప్రతినిధులు

పెదగంట్యాడ, మే 25 (ఆంధ్రజ్యోతి) : పారిశ్రామిక ప్రాంత గీత సహకులాల సంక్షేమ సంఘం సభ్యులు ఆదివారం జీవీఎంసీ డిప్యూటీ మేయర్ దల్లి గోవిందరెడ్డిని పెదగంట్యాడలోని ఆయన కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాన్ని అందజేశారు. జీవీఎంసీ పరంగా గీత సహకులాలకు తగిన సహకారం అందించాలని కోరారు. డిప్యూటీ మేయర్‌ను కలిసిన వారిలో సంఘం గౌరవాధ్యక్షుడు నెల్లి సాధూరావు, వైస్ చైర్మన్ అండిబోయిన అప్పారావు, ప్రధాన కార్యదర్శి ఒనిమి నాగేశ్వరరావు, ఉపాధ్యక్షుడు అండిబోయిన పెదనూకరాజు తదితరులు ఉన్నారు.

ఎల్వీ ప్రసాద్ నేత్ర వైద్యశాల ఆధ్వర్యంలో వైటథాన్ రన్

- కంటి కేన్సర్‌పై అవగాహన కల్పిస్తూ నిర్వహణ



బీచ్ రోడ్డులో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

రామ్‌నగర్, మే 25 (ఆంధ్రజ్యోతి) : అంతర్జాతీయ రెటీనో బ్లాస్టోమా అవగాహనా వారోత్సవాల సందర్భ ఆదివారం ఎల్వీ ప్రసాద్ నేత్ర వైద్య విజ్ఞాన సంస్థ ఆధ్వర్యంలో కోస్టల్ బ్యాటరీ నుంచి గోకుల్ పార్కు మీదుగా బీచ్‌రోడ్డులో అవగాహనా వైటథాన్ రన్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రముఖ నేత్ర వైద్య నిపుణురాలు డాక్టర్ సునీతా మాట్లాడుతూ రెటీనో బ్లాస్టోమాపై తల్లిదండ్రులు అవగాహన కలిగి ఉండాలన్నారు. ముఖ్యంగా పిల్లల కంటిలో తెల్లని ప్రతిబింబం కనిపించిన వెంటనే కంటి వైద్య నిపుణుడిని సంప్రదించాలని సూచించారు. ముందస్తుగా గుర్తించడం ద్వారా పిల్లల్లో అంధత్వాన్ని నివారించవచ్చన్నారు. ఇది మూడేళ్ల కంటే తక్కువ వయస్సు ఉన్న పిల్లలపై అధిక ప్రభావం చూపిస్తుందని తెలిపారు. ఈ రన్‌ద్వారా సేకరించిన నిధులను ఆర్థికంగా వెనుకబడిన పిల్లలకు రెటీనో బ్లాస్టోమా చికిత్స కోసం అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ ఎస్. వీరేంద్ర తదితరులతో పాటు పలువురు నేత్ర వైద్య నిపుణులు ఔత్సాహికులు పాల్గొన్నారు.

రహదారి పక్కనే చెత్తాచెదారం



రహదారి పక్కన పడి ఉన్న చెత్త

ఎంవీపీ కాలనీ, మే 25 (ఆంధ్రజ్యోతి) : డంపర్‌బిన్లు లేని నగరంగా తీర్చిదిద్దడానికి జీవీఎంసీ ఓ పక్క ప్రయత్నం చేస్తుంటే, కొందరు స్థానికులు మాత్రం చెత్తచెదారాన్ని రోడ్డు పక్కనే పడేసి, తమ చైతన్యరాహిత్యాన్ని బయటపెట్టకుంటున్నారు. ఉన్నత వర్గాలు ఉండే ప్రాంతంగా పేరొందిన ఎంవీపీ కాలనీలోనే ఈ దుస్థితి నెలకొనడం గమనార్హం. జీవీఎంసీ 18వ వార్డు పరిధిలోని ఎంవీపీ కాలనీ మెడికవర్, డీఆర్‌డీఏ మార్గంలో ఓ చోట, రోడ్డు పక్కన కొందరు వ్యక్తులు చెత్తను విచక్షణారహితంగా పడేస్తున్నారు. మరి కొందరు ఇంకాస్త ముందడుగు వేసి, ఎదురుగా ఉన్న ఓ ప్రైవేటు స్థలంలో చెత్త విసిరేస్తున్నారు. ప్రతిరోజూ పారిశుధ్య సిబ్బంది ఇంటింటికీ వచ్చి చెత్తను తీసుకునేటప్పుడు తడి, పొడి చెత్తను విభజించి వారికి ఇవ్వాల్సి ఉంది. కానీ సిబ్బంది వచ్చే సమయంలో ఈ పని చేయలేని కొందరు చెత్తను తీసుకువచ్చి, ఇక్కడ పడేస్తున్నారు. ఇలాంటి చేష్టల వల్ల పరిసరాలు అధ్వానంగా, దుర్గంధంగా మారుతున్నాయి. ఇలాంటి వారిని గుర్తించి, జరిమానాలు విధించాలని ఈ ప్రాంతీయులు కోరుతున్నారు.

కళాభారతి ఆధ్వర్యంలో 67మంది కళాకారులకు సత్కారం



కళాభారతి నిర్వాహకులు సత్కారం చేసిన 67 మంది కళాకారులు

మద్దిలపాలెం, మే25 (ఆంధ్రజ్యోతి) : పీతాపురం కాలనీ కళాభారతి ఆడిటోరియంలో ఆదివారం 67 మంది కళాకారులకు ఘనంగా సత్కరించారు. కళలను ప్రోత్సహించడంలో భాగంగా కళాభారతి నిర్వాహకులు వివిధ కళల్లో రాణిస్తున్న వర్ధమాన కళాకారులను సన్మానం చేశారు. ఈ సందర్భంగా కళాభారతి అధ్యక్షుడు ఎం.సత్యనారాయణరాజు మాట్లాడుతూ సంగీతం, సాహిత్యం, నృత్యం, నాటకం, హరికథ, బుర్రకథ, తోలుబొమ్మలాట, జానపద సాహిత్యాలను ప్రోత్సహిస్తూ ఈ కార్యక్రమం చేపట్టినట్టు తెలిపారు. ప్రస్తుతం కళలకు ఆదరణ కరువవుతోందని, ఈ తరుణంలో విస్తృతంగా కళా ప్రదర్శనలు నిర్వహించడం, కళాకారులను సన్మానించి ఆదరించం ద్వారా కళలకు పూర్వ వైభవం తీసుకురావడానికి ప్రయత్నిస్తున్నామన్నారు. అనంతరం ఏర్పాటు చేసిన డాక్టర్ ద్వారం త్యాగరాజ్ గాత్ర కచేరి అలరించింది. కార్యక్రమంలో కళాభారతి కార్యదర్శి రాంబాబు, కోశాధికారి పైడా కృష్ణప్రసాద్, పంతులు గోపాలరావు, శారద సుబ్రహ్మణ్యం జ్యోతి పాల్గొన్నారు.

అధ్వానంగా బస్సు షెల్టర్ల పరిసరాలు



బస్సు షెల్టర్ వద్ద నిర్మాణ వ్యర్థాలు

ఎంవీపీ కాలనీ, మే 24 (ఆంధ్రజ్యోతి) : ఈ ప్రాంతంలో బస్ షెల్టర్ల పరిస్థితి అధ్వానంగా ఉంది. ఎంవీపీ ప్రధాన సర్కిల్ నుంచి టాస్క్ ఫోర్స్ సర్కిల్ వరకూ ఉన్న రహదారిలో బస్ షెల్టరు ఏళ్ల తరబడి దీనావస్థలో ఉన్నా అధికారులు పట్టించుకోవడం లేదు. ఇక్కడ సాధారణ ప్రయాణికులతో పాటు విద్యార్థినులు ఎక్కువగా బస్సుల కోసం వేచి ఉంటారు. బస్ షెల్టరుకు ఇటూ అటూ ఫాస్ట్ ఫుడ్ సెంటర్లు, మెకానిక్ దుకాణాలు వంటివి చాలా ఉన్నాయి. చినప పడినా బస్ షెల్టరులోకి వెళ్లడానికి వీలు లేకుండా బురదతో నిండి ఉంటుంది. ఈ బురద నివారణకు గృహ నిర్మాణ వ్యర్థాలను గుట్టగా పోశారు. దీనిపై నడచి వెళ్లడం కూడా కష్టమవుతోంది. చక్కని బస్ షెల్టరు ఉన్నా, ప్రయాణీకులు ముక్కు మూసుకునో, ఇబ్బంది పడుతూనో కూర్చోవాల్సి వస్తోంది. ఇప్పటికైనా అధికారులు దీని సంగతేంటో చూడాలని ప్రయాణీకులు కోరుతున్నారు.

ఎండీయు వాహనాల ద్వారా రేషన్ పంపిణీ చేయాలి



ర్యాలీ నిర్వహిస్తున్న విశాఖ జిల్లా ఎండీయూ ఆపరేటర్లు, పాల్గొన్న వైసీపీ నేతలు కేకే రాజు, వాసుపల్లి

సిరిపురం, మే 25 (ఆంధ్రజ్యోతి) : ఎండీయూ ఆపరేటర్లకు ఉపాధి కల్పించాలని 2027 కాల పరిమితి వరకూ ఎండీయూ వాహనాల ద్వారా రేషన్ పంపిణీ ప్రక్రియ జరిగేలా చర్యలు తీసుకోవాలని పలువురు నాయకులు కోరారు. ఆదివారం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద విశాఖ జిల్లా ఎండీయూ ఆపరేటర్స్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఎండీయూ వాహనాల ద్వారా రేషన్ పంపిణీ చేయాలంటూ ర్యాలీలోని ఎండీయూ వాహనాలు ఎక్కి ప్లకార్డుల ప్రదర్శించి తమ నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి పడాల రమణ మాట్లాడుతూ ఎండీయూ విధానాన్ని రద్దు చేయడం ద్వారా 20 వేల కుటుంబాలు రోడ్డున పడతాయన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ప్రజా పంపిణీ వ్యవస్థ బలోపేతం చేయాలనే ఉద్దేశం ఉంటే కేరళలో వలే పేద ప్రజలకు 16 రకాల నిత్యావసర సరకులను పంపిణీ చేయవచ్చన్నారు. అంతేకానీ గత ప్రభుత్వంలో నియమించారనే ఉద్దేశంతో వారిని తొలగించాలని కక్షసాధింపు చర్యలు సబబు కాదన్నారు. వైసీపీ నగర అధ్యక్షుడు కే.కే.రాజు, మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ ఎండీయూ ఆపరేటర్స్ నిర్వహిస్తున్న ర్యాలీకి మద్దతు తెలియజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా ఇంటి వద్దకే రేషన్ సరకులను అందించే కార్యక్రమాన్ని వైసీపీ ప్రభుత్వ హయాంలో తీసుకొచ్చామన్నారు. తద్వారా ప్రజల వద్దకే సరకులు పంపిణీ చేయడం ద్వారా వారందరికీ సౌకర్యంగా ఉండేదన్నారు. కార్యక్రమంలో ఆపరేటర్స్ నాయకులు ఎస్.బి.సతీష్, ఫరూక్, స్వామి,ప్రసన్న,గోపి, జగన్నాథం తదితరులు పాల్గొన్నారు.

సమాజంలో చదువు ద్వారా మంచి గుర్తింపు : ఎమ్మెల్సీ గాదె

సిరిపురం, మే 25 (ఆంధ్రజ్యోతి) : సమాజంలో ఉన్నత చదువు ద్వారా మంచి గుర్తింపు లభిస్తుందని ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ శాసన మండలి సభ్యులు గాదె శ్రీనివాసునాయుడు అన్నారు. ఆదివారం సిరిపురం వీఎంఆర్డీఏ చిల్డ్రన్స్ థియేటర్‌లో స్కూల్ ఆఫ్ థియేటర్ ఆర్ట్స్, వైజాగ్ మీడియా ఆధ్వర్యంలో జర్నలిస్టుల పిల్లలకు ప్రతిభా పురస్కారాలను అందజేశారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ఏయూ రిజిస్ట్రార్ ఎస్.ధనుజంయరావు, కమల్ బెయిడ్, బెహరా భాస్కరరావు, వైవీవీ సత్యనారాయణ, గంట్ల శ్రీనుబాబుతో కలిసి జ్యోతి ప్రజ్వలన గావించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటువంటి కార్యక్రమాలు విద్యార్థుల్లో నూతన ఉత్తేజాన్ని కలిగిస్తాయన్నారు. కార్యక్రమానికి స్కూల్ ఆఫ్ థియేటర్ చీఫ్ ఆర్గనైజర్ ఆర్.నాగరాజు పట్నాయక్ ప్రతిభాపురస్కారాలను పంపిణీ చేయడం సంతోషంగా ఉందన్నారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలను అలరించాయి.

సాగర తీరంలో ఆటపాటలతో సరదాగా..



సముద్రం వద్ద స్నానాలు చేస్తున్న పిల్లల కేరింతలు



నీటిలో ఆడుతూ సేద తీరుతున్న చిన్నారులు

వేసవి తాపం నుంచి ఉపశమనం కోసం ఆదివారం ఉదయం తీరానికి చిన్నారులు, యువత, మహిళలు చేరుకొని సముద్ర స్నానాలు చేస్తూ సేద తీరారు. వాహనాల్లో ఉదయానే కుటుంబాలతో తీరానికి చేరుకొన్నారు. రోజుకు భిన్నంగా ఆదివారం ఆకాశం మబ్బులు పట్టడంతో ఏడు గంటల వరకు సూర్యుడు కనిపించలేదు. వాతావరణం ఆహ్లాదంగా ఉండడంతో సముద్ర స్నానాలు చేస్తూ.. ఆటపాటలతో కాలం గడిపారు. ఇన్నాళ్లూ మండుటెండల దెబ్బకు ఉక్కపోతతో అల్లాడిపోయిన నగర జనానికి సముద్ర తీరంలో చక్కని ఉపశమనం కలిగింది.

- ఆంధ్రజ్యోతి, బీచ్‌రోడ్డు

మురళీనగర్‌లో వైన్ షాపుల జాతర

- మందుబాబుల వీరంగం
- అడ్డుకోవాలని పీజీఆర్ఎస్‌లో వినతులు
- చర్యల కోసం ఎదురుచూపు


మాధవధార నాలుగు రోడ్ల జంక్షన్‌లో బస్సుల రాకపోకలకు అడ్డంగా వైన్ షాప్ ఎదుట రోజూ ఇదే హడావుడి


వైన్ దుకాణం పక్కన ఓ ఇంటి వాకిట్లో మందుబాబు


వైన్ షాపులు కట్టడి చేయాలని కలెక్టర్ హరేంధిర ప్రసాద్‌కు వినతిపత్రం ఇస్తున్న 49వవార్డు నివాసితులు (ఫైల్)

మురళీనగర్, మే 25 (ఆంధ్రజ్యోతి): విశాఖ నగరంలో ప్రశాంత నివాసిత ప్రాంతంగా పేరొందిన ఉత్తర నియోజకవర్గ పరిసరాలు రూపురేఖలు మారిపోతున్నాయి. గత అయిదేళ్లలో వైన్ షాపుల జాతర మొదలైంది. వీటికి పోటీగా బార్ అండ్ రెస్టారెంట్ల సంఖ్య కూడా క్రమేపీ పెరుగుతోంది. మురళీనగర్, నియోజకవర్గ సరిహద్దు ప్రాంతంగా ఉన్న మాధవధారలో వైన్ షాపులు, కొత్తగా కుల ప్రాతిపదికన షాపులు కేటాయించడం, పాత లైసెన్సుల పునరుద్ధరణ వెరసి రెండు కిలోమీటర్ల పరిధిలోనే డజనుకు పైగా దుకాణాలు ఏర్పాటయ్యాయి. వైసీపీ ప్రభుత్వ జమానా తరువాత మద్యం దుకాణాలు ఇప్పుడు ప్రైవేటు పరం కావడంతో పోటీ పెరిగింది. జగన్ ప్రభుత్వంలో ఎక్కడికక్కడ పెట్టిన మద్యం దుకాణాలు ఇపుడు శాశ్వతమవుతున్నాయి. నగర ప్రాంతాల్లో డిమాండ్‌కు తగ్గట్టే, కొత్త సరుకు, కొత్త లుక్‌తో వైన్ షాపులు రెండేళ్ల కాల పరిమితికే రూ.కోట్లలో పెట్టుబడులు పెట్టి తెరిచారు. మాధవధార హైవే రోడ్డు బిర్లాజంక్షన్‌లో ఒక వైన్ షాప్, పెట్రోల్ బంక్ పక్కనే బార్, మురళీనగర్ ప్రవేశ మార్గంలో మాధవ యువజన సమాజం షాపుల్ని ఆనుకొని ఒక బార్‌కి అనుమతులు వచ్చాయి. కొత్తగా మాధవధార పుణ్యక్షేత్రం కొండకు చేరే దారిలోని నాలుగురోడ్ల జంక్షన్‌లో బస్టాపు ఎదుటే ఓ వైన్ దుకాణం తెరిచారు. ఇక్కడ నిత్యం అమ్మకాల జాతర కనిపిస్తుంది. వైన్ షాప్ ఎదుటే తాగి, మద్యం మత్తులో పక్కనే ఉన్న నివాసాల ఎదుటే తూలి పడుతున్నారు. అరుగులపై సేదదీరుతూ వచ్చి పోయే వారిని భయభ్రాంతులకు గురిచేస్తున్నారు. 48ఎ ఆర్టీసీ బస్సులు తిరిగే ప్రధాన రహదారిలో వాహనాల రాకపోకలకు ఇబ్బంది తలెత్తుతున్నా, ప్రొహిబిషన్ అండ్ ఎక్సయిజ్ శాఖలో కదలిక లేదు. వైన్ షాపుల దగ్గరే తాగి రోడ్డుపై చెలరేగుతున్న యువత, బైకు రేసులు పెట్టుకుని మద్యం మత్తులో జోగుతున్నారు. కూత వేటు దూరంలోనే ప్రొహిబిషన్ అండ్ ఎక్సయిజ్ డిప్యూటీ కమిషనరు కార్యాలయం కూడా ఉంది.

49వవార్డులో మరీ జోరు: కొత్తగా 49వవార్డులో రెండు వైన్ షాపులకు అనుమతి ఇచ్చారు. ఇదివరకే ఈ వార్డు పరిసరాల్లో మూడు బార్ అండ్ రెస్టారెంట్లు నడుస్తున్నాయి. దీంతో కామాక్షినగర్ రోడ్డు నుంచి బర్మాక్యాంప్ రైల్వే సొసైటీ నివాసితులు షాపుల ఎదుట ఇటీవల ఆందోళన చేపట్టారు. తాత్కాలికంగా మూసిన వైన్ షాపులు తిరిగి పోలీస్ రక్షణతో తెరుచుకుని వ్యాపారాలు చేస్తున్నారు. దీనిపై ఉత్తర ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్ రాజు, కలెక్టర్ ఎన్.హరేంధిర ప్రసాద్, జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్‌లకు పీజీఆర్ఎస్‌లో "కామాక్షినగర్ సాయి సంహిత వెల్ఫేర్ సొసేటీ' పేరిట నివాసితులు వినతులు అందించారు. మద్యం ఏరులై పారుతోందని, పార్కులు ఎక్కువగా ఉన్న ఈ ప్రాంతాల్లో చేతిలో సీసాలతో చేరుతున్న మందుబాబులు అతివలను, పిల్లలను ఇబ్బంది పెడుతున్నారని ఫిర్యాదు ఇచ్చారు. ఈ వినతులపై ప్రభుత్వ చర్యలు, ఎక్సయిజ్ అండ్ ప్రొహిబిషన్, ఎన్‌ఫోర్స్‌మెంట్ శాఖల స్పందన కోసం మురళీనగర్, మాధవధార ప్రాంతాల నివాసితులు ఎదురుచూస్తున్నారు.

రహమాన్ దంపతులకు ఆత్మీయ సన్మానం


రహమాన్ దంపతులకు జ్ఞాపిక అందిస్తున్న దృశ్యం

మహారాణిపేట, మే 25 (ఆంధ్రజ్యోతి): అభివృద్ధిని రాజకీయాలతో ముడిపెట్టరాదని, అలా చేయగలిగినప్పుడే ఆ నాయకుని జీవితం సార్థకమవుతుందని, ఆ కోవకు చెందిన మాజీ ఎమ్మెల్యే డాక్టర్ ఎస్ఏ రహమాన్ ధన్యులని దక్షిణ నియోజకవర్గం ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ అన్నారు. ఆదివారం పూర్ణామార్కెట్ సమీపంలోని ఓ సమావేశమందిరంలో డాక్టర్ రహమాన్, షరీన్ దంపతుల 75 వసంతాల ఆత్మీయ వేడుకలను నిర్వహించి, వారిని ఘనంగా సత్కరించారు. ఎమ్మెల్యే వంశీకృష్ణ మాట్లాడుతూ ప్రజా సేవ చేయటంలో రహమాన్ తనకు తానే సాటి అని కొనియాడారు. చైతన్య స్రవంతి స్వచ్ఛంద సంస్థ ద్వారా డా షరీన్ సామాజిక సేవలు అందిస్తున్నారని కొనియాడారు. ఈ దంపతులు ప్రజల హృదయాలలో చిరస్థాయిగా నిలిచిపోతారని అన్నారు. రహమాన్‌ను ఈ స్థాయికి తీసుకువచ్చిన ఘనత దివంగత ఎన్టీఆర్‌దని రాజ్యసభ మాజీ సభ్యుడు యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ పేర్కొన్నారు. ప్రజల హృదయాలలో రహమాన్ నిలిచిపోయారని, అందుకు ఈ ఆత్మీయ సత్కారమే నిదర్శనమని అన్నారు. లీడర్ పత్రిక సంపాదకుడు రమణమూర్తి, భాస్కరరావు, శంకరరావు, రవీశ్వరరావు, కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

ఆ పోస్టు భర్తీ ఎప్పుడో!

(5వ పేజీ తరువాయి)

కూడా అద్దె చెల్లించాలని అధికారులు నోటీసులు ఇవ్వడంతో ఆ సంస్థ వెళ్లిపోయింది. అప్పటినుంచి విదేశాలకు విమానాల ద్వారా సరకులు పంపించే అవకాశం లేకుండా పోయింది. విదేశీ విమానాలు కూడా తగ్గిపోయాయి. గతంలో దుబాయ్, సింగపూర్, మలేషియా, బ్యాంకాక్, శ్రీలంకకు అంతర్జాతీయ విమానాలు ఉండేవి. ఇప్పుడు ఒక్కటే సింగపూర్‌కు నడుస్తోంది. వచ్చే నెలలో అబు ధాబీకి కొత్త సర్వీసు రానున్నది. రద్దయిన బ్యాంకాక్, మలేషియా విమానాలను పునరుద్ధరిస్తామని కేంద్ర పౌర విమానయాన శాఖా మంత్రి ప్రకటించినా అది ఆచరణలోకి రాలేదు. అంతర్జాతీయ సరకు రవాణా సమస్యను కేంద్ర మంత్రి దృష్టికి విశాఖ ఎంపీ తీసుకువెళితే గత ఏడాది అక్టోబరులోనే ఢిల్లీ అధికారులకు ఫోన్ చేసి తక్షణమే తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అయితే ఇప్పటివరకు ఆ ఆదేశాలు అమలుకు నోచుకోలేదు. విశాఖ పరిసరాల్లో వందకు పైగా ఫార్మా కంపెనీలు, కేవలం ఎగుమతులు చేసే బ్రాండిక్స్ దుస్తుల కంపెనీ, వజ్రాలు ఎగుమతి చేసే వీఎస్ఈజెడ్, ఏడాదికి రూ.20 వేల కోట్ల విలువైన రొయ్యలు ఎగుమతి చేసే సీఫుడ్ ఎగుమతిదారులు ఇక్కడ ఉన్నారు. వీరికి అంతర్జాతీయ కార్గో సర్వీసులు లేకపోవడం వల్ల రోడ్డు మార్గాన పంపుతున్నారు. కొన్ని విమాన సంస్థలు ఆక్యుపెన్సీ లేదని సర్వీసులను రద్దు చేసుకుంటున్నాయి. వాటికి సరకు రవాణాకు అనుమతి ఇస్తే... ట్రిప్పునకు టన్ను నుంచి 1.5 టన్నుల సరకు తీసుకువెళ్లే అవకాశం ఉంది. సుమారు 15 నుంచి 20 మంది ప్రయాణికులను తీసుకెళ్లినట్టు అవుతుంది. కొత్త సర్వీసులకు రన్ వే చార్జీలు, పార్కింగ్, రూట్ నేవిగేషన్ చార్జీలలో కొంత రాయితీ ఇస్తే ఉత్సాహంగా ముందుకు వస్తాయి. ఆదాయం సమకూర్చే వాటికి రాయితీలు ఇస్తున్న ప్రభుత్వాలు వీటిని కూడా పరిశీలించాల్సి ఉంది.

మందసలో ఎయిర్ కార్గో సెంటర్ ఏర్పాటు

ముందు వచ్చిన చెవులు కంటే వెనక వచ్చిన కొమ్ములు వాడి అన్నట్టుగా ఉంది ప్రస్తుతం ఉత్తరాంధ్రాలో పరిస్థితి. విశాఖలో విశాఖపట్నం పోర్టు, గంగవరం పోర్టు ఉండగా నక్కపల్లిలో ఆర్సెలర్ మిట్టల్ స్టీల్ కంపెనీ కోసం మరో పోర్టును నిర్మించబోతున్నారు. ఇప్పుడు ఏడాదికి సుమారు వంద మిలియన్ టన్నుల సరకు ఈ పోర్టు ద్వారా రవాణా జరుగుతోంది. ఇక్కడ ఎయిర్ కార్గోకి విస్తృత అవకాశాలు ఉన్నాయి. ఇవన్నీ విస్మరించి శ్రీకాకుళం జిల్లాలో కొత్తగా మూలపేటలో నిర్మిస్తున్న పోర్టుకు అనుబంధంగా పలాస సమీపాన బిమిడిలో ఎయిర్ కార్గో సెంటర్ ఏర్పాటు చేయాలని ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది. ఆ పోర్టుకు బిమిడికి 40 కి.మీ. దూరం ఉంటుంది. దానికి 1,400 ఎకరాల భూమిని సేకరిస్తున్నారు. అన్ని రకాల వసతులున్న విశాఖను వదిలి అసలు విమానాశ్రయమే లేని పలాసలో ఎయిర్ కార్గో సెంటర్ పెడితే ప్రయోజనం ఏమిటో పెద్దలకే తెలియాలి. కొత్తగా వచ్చేవారిని ప్రోత్సహించడానికి దశాబ్దాలుగా నడుస్తున్న విశాఖ విమానాశ్రయాన్ని విస్మరించడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

వెలిగిన వీధి దీపాలు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

విశాఖపట్నం, మే 25 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ జోన్-5 పరిధి అక్కయ్యపాలెం ముస్లింతాటిచెట్లపాలెంలో వీధి దీపాలకు జీవీఎంసీ అధికారులు మరమ్మతు చేయడంతో వెలుగుతున్నాయి. ముస్లింతాటిచెట్లపాలెం జంక్షన్ నుంచి ఆంధ్రజ్యోతి కార్యాలయం వరకు జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న సర్వీస్‌రోడ్డులోని వీధి దీపాలతోపాటు ఆంధ్రజ్యోతి కార్యాలయం నుంచి కేంద్రీయవిద్యాలయం, రామచంద్రనగర్ రోడ్డులో వీధిదీపాలు కొద్దిరోజులుగా వెలగకపోవడంతో చీకటిపడితే అంధకారం అలముకుంది. దీనివల్ల రాత్రివేళ ఆ మార్గాల్లో ఆకతాయిలు, గంజాయి ముఠాలు రెచ్చిపోతున్నారు. దీనిపై ఆంధ్రజ్యోతిలో ఈ నెల 22న కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. దీనికి స్పందించిన జీవీఎంసీ జోన్-5 ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ విభాగం అధికారులు సమస్యను గుర్తించి మరమ్మతు చేశారు. ప్రస్తుతం వీధిదీపాలు వెలుగుతుండడంతో ఆ ప్రాంతవాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

అక్కయ్యపాలెం, మే 25 (ఆంధ్రజ్యోతి): నిర్వహణ పనులు చేపడుతున్నందున సోమవారం ఉదయం 8-30 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఈఈ బి.సింహాచలం నాయుడు తెలిపారు. నరసింహనగర్, రైతుబజారు ఏరియా, విద్యుత్‌నగర్ ఏరియా, పోర్టు ఈస్ట్ గేట్ ఏరియా, బాలయ్య శాస్త్రి లే అవుట్ ఏరియాల్లో కరెంట్ సరఫరా ఉండదన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

శక్తియాప్‌తో సేవలు


యాప్ వినియోగంపై అవగాహన కల్పిస్తున్న పోలీసులు

మురళీనగర్, మే 25 (ఆంధ్రజ్యోతి): పోలీసు శాఖ పర్యవేక్షణలో పనిచేసే శక్తి మొబైల్ యాప్ అందరికీ రక్షణ అందిస్తుందని కంచరపాలెం, ఎయిర్‌పోర్ట్ పోలీస్ స్టేషన్ల సిబ్బంది నర్సింగరావు, జగన్నాథంలు పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ తమ ఫోన్‌లో ఈ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుంటే ఆపద సమయాల్లో పోలీసు రక్షణ లభిస్తుందన్నారు. మురళీనగర్ సెక్టార్-8 పరిధిలోని ప్రజలకు ఆదివారం అవగాహన కల్పించారు. రోడ్డు కూడలిలో బాటసారులతో మాట్లాడి మొబైల్స్‌లో శక్తి యాప్ పనితీరును వివరించారు. రాత్రి వేళ తెలియని ప్రదేశాల్లో గమ్యస్థానాల్ని చేరడంలో కష్టంగా ఉన్నప్పుడు ఈ యాప్‌తో పోలీసుల సహాయం పొందవచ్చన్నారు.

ఆటోను ఢీకొట్టిన కారు నలుగురికి గాయాలు

అక్కయ్యపాలెం, మే 25 (ఆంధ్రజ్యోతి): అక్కయ్యపాలెం సమీప రహదారిపై శనివారం అర్ధరాత్రి సమయంలో ఆటోను కారు ఢీకొట్టిన ఘటనలో నలుగురు గాయపడ్డారు. పెదగంట్యాడ ప్రాంతానికి చెందిన కాశీరావు కుటుంబ సభ్యులతో ఆర్టీసీ కాంప్లెక్స్‌కు వెళ్తుండగా వ్యతిరేక మార్గంలో వచ్చిన కారు వీరిని ఢీకొంది. వీరంతా శ్రీకాకుళంలో అమ్మవారి దర్శనానికి వెళ్తున్నారు. కాశీరావు, భాస్కరరావు, వరలక్ష్మిలకు తీవ్ర గాయాలయ్యాయి. మిగతా వారికి స్వల్ప గాయాలయ్యాయి. కారు నడిపే వ్యక్తిని అదుపులోకి తీసుకున్నట్లు ట్రాఫిక్ ఎస్సై ఉమామహేశ్వరరావు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామన్నారు. వారు కేర్ ఆస్పత్రిలో చికిత్స పొంది వేరే ఆసుపత్రికి వెళ్లారు.


గాయపడిన మహిళ

'పవన్‌పై ఇష్టమొచ్చినట్లు మాట్లాడితే సహించం'



మాట్లాడుతున్న ఎమ్మెల్యే విజయ్‌కుమార్

అక్కయ్యపాలెం, మే 25 (ఆంధ్రజ్యోతి): జనసేన పార్టీ అధినేత, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌పై ఇష్టమొచ్చినట్లు మాట్లాడితే సహించేది లేదని యలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ హెచ్చరించారు. సీతంపేటలోని జనసేన కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సినీ పరిశ్రమ అసోసియేషన్ ద్వారా వస్తే సమస్యలు పరిష్కరిస్తామని పవన్ అన్నారని, కానీ దీన్ని వక్రీకరించి మాట్లాడడం సరైన పద్ధతి కాదన్నారు. సినిమాటోగ్రఫీ మంత్రిగా ఉన్నప్పుడు చేసిన అభివృద్ధి ఏమిటని పేర్ని నానిని ప్రశ్నించారు. మంత్రిగా ఉన్న సమయంలో సినీ పెద్దలందరినీ బ్లాక్‌మెయిల్ చేసి పరిశ్రమను నిస్తేజం చేశారని మండిపడ్డారు. వైసీపీ పాలనలో అన్ని వ్యవస్థలు భ్రష్టుపట్టాయని ఆరోపించారు. సినీ పరిశ్రమ అంటే తమకు చాలా అభిమానమన్నారు. తమ నాయకుడు పవన్ కల్యాణ్ సినీ పరిశ్రమ నుంచి వస్తే... మీ నాయకుడు ఫ్యాక్షన్ ఇండస్ట్రీ నుంచి వచ్చారని విమర్శించారు. వ్యవస్థలను పెంచుకుంటూ పోయే పార్టీ మాదని, వ్యవస్థలను తుంచుకుంటూ పోయే పార్టీ మీదని, అందుకోసమే చిత్తుగా ఓడి ఇంటికే పరిమితమయ్యారన్నారు. పవన్ కల్యాణ్ తన వేతనాన్ని పిఠాపురం ప్రజల కోసం ఇచ్చేశారని గుర్తు చేశారు. మరోసారి వక్రీకరించి మాట్లాడితే తగిన బుద్ధి చెబుతామని హెచ్చరించారు. ఈ సమావేశంలో నాయకులు శివ ప్రసాద్‌రెడ్డి, పెతకంశెట్టి శ్యాం పాల్గొన్నారు.

వీరజవాన్ల సేవలు కొనియాడుతూ టార్చిలైట్ ర్యాలీ


ర్యాలీలో పాల్గొన్న ఈవెంట్ మేనేజర్లు, ప్రతినిధులు

మహారాణిపేట, మే 25 (ఆంధ్రజ్యోతి): పాకిస్థాన్ తీవ్రవాదులపై వీరోచిత దాడులు జరిపి దేశ రక్షణలో ప్రతిభ చాటిన వీరజవాన్ల సేవలను కొనియాడుతూ ఈవెంట్ మేనేజర్ల సంఘం టార్చిలైట్ ర్యాలీని నిర్వహించింది. ఆదివారం మహారాణిపేట గోకుల్ బీచ్ పార్కు నుంచి వైఎంసీఏ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వీరజవాన్ల త్యాగాలను ప్రతిబింబించే నృత్యరూపకాల ప్రదర్శన వీక్షకుల హృదయాలను స్పందింపచేశాయి. సంఘం అధ్యక్ష, కార్యదర్శులు సందీప్ కుమార్, షరీఫ్ ఖాన్‌ల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ర్యాలీలో మీనాక్షి అనంతరామన్, అజేయ్ అగర్వాల్, దాడి రవికుమార్, ఎన్ఆర్‌కే బాబూరావు, జయచంద్ర, వర్తం ట్రావెల్ అసోసియేషన్ అధ్యక్షుడు కె. విజయ మోహన్, వైజాగ్ హోటళ్ల యాజమాన్యాల సంఘం కార్యదర్శి పవన్ కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

ఏయూలో ఎయిడెడ్ రచ్చ!

విశాఖపట్నం, మే 25 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర విశ్వవిద్యాలయంలో ఎయిడెడ్ ఫ్యాకల్టీ వ్యవహారంపై రచ్చ జరుగుతోంది. ఎయిడెడ్ కాలేజీల నుంచి అధ్యాపకులను వెనక్కి పంపించాలంటూ గత కొన్నాళ్లుగా వర్సిటీలోని సీనియర్ ప్రొఫెసర్లు, ఇతర ఫ్యాకల్టీలు డిమాండ్ చేస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా ఎయిడెడ్ నుంచి వర్సిటీలోకి వచ్చిన ఫ్యాకల్టీని తొలగించాలంటూ పలువురు మంత్రులను కూడా కలిసి వినతులు సమర్పించారు. తాజాగా ఏయూ వీసీ జీపీ రాజశేఖర్ ఎయిడెడ్ నుంచి వచ్చిన ఫ్యాకల్టీపై కీలక సమావేశాన్ని నిర్వహించారు. వర్సిటీలోని కాలేజీ ప్రిన్సిపాళ్లు, హెచ్‌వోడీలతో సమావేశాన్ని ఏర్పాటు చేసి ఎయిడెడ్ నుంచి వచ్చిన ఫ్యాకల్టీపై ఏం చేద్దామంటూ వారి అభిప్రాయాలను సేకరించారు. ఈ సమావేశానికి ఎయిడెడ్ ఫ్యాకల్టీని దూరంగా ఉంచారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాళ్లు, హెచ్‌వోడీలంతా వారిని వెనక్కి పంపించాలంటూ స్పష్టం చేశారు. దీంతో వీసీ కూడా దీనిపై కీలక నిర్ణయాన్ని తీసుకున్నట్టు తెలిసింది. ఈ నెలాఖరు నాటికి వర్సిటీ నుంచి వారిని వెనక్కి పంపేందుకు నిర్ణయం తీసుకున్నట్టు సమాచారం. ఈ క్రమంలో వర్సిటీలో పనిచేస్తున్న ఎయిడెడ్ ఫాకల్టీ నగర పరిధిలోని పలువురు ఎమ్మెల్యేలను కలిసి తమ సమస్యను విన్నవించారు. తమను 2023 జూన్‌లో డిప్యూటేషన్‌పై మూడేళ్ల కాలపరిమితికి తీసుకున్నారని, అందువల్ల 2026 జూన్ వరకు కొనసాగించాలని కోరుతున్నారు. ఈ మేరకు ఎమ్మెల్యేల ద్వారా మంత్రి నారా లోకేశ్ వద్దకు వెళ్లేందుకు సిద్ధపడుతున్నారు.

ఎన్టీఆర్ వ్యక్తి కాదు.. మహాశక్తి


ఎన్టీఆర్ వేషధారణతో గీతాన్ని ఆలపిస్తున్న దృశ్యం

డాబాగార్డెన్స్, మే 25 (ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ వ్యక్తి కాదు.. మహాశక్తి అని పలువురు కళా రంగ ప్రముఖులు కీర్తించారు. స్వరమాధుర్యం వ్యవస్థాపకులు ఎంవీఆర్ నాగేశ్వరరావు ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం విశాఖ పౌరగ్రంథాలయంలో సినీ సంగీత విభావరి నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అతిథులుగా డి.భూపతిరావు, ఆధ్యాత్మికవేత్త ఎం.వి.రాజశేఖర్, సన్‌మూర్తి, భయ్యా శ్రీనివాస్, రుద్రప్రసాద్ జ్యోతి వెలిగించి ప్రారంభించారు. ఎన్టీఆర్ వేషధారణలో ఆలపించిన గీతం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సినీ, రాజకీయ రంగాలకు ఎన్టీఆర్ అందించిన సేవలు వెలకట్టలేనివన్నారు. ఆయన స్ఫూర్తితో యువత ముందుకు వెళ్లాలన్నారు. క్రమశిక్షణ, సంప్రదాయాలకు ఎన్టీఆర్ పెద్దపీట వేసేవారన్నారు. ముఖ్యంగా తెలుగు భాష ఔన్నత్యానికి ఎన్టీఆర్ ఎంతగానో కృషి చేశారన్నారు. ఎంవీఆర్ నాగేశ్వరరావు, భూపతి, రామనరసింహం, కృష్ణంరాజు, రామారావు, శ్రీనివాసరావు, పెమ్మరాజు, గాయనీమణులు భాగ్యలక్ష్మి, ఉష, కల్యాణి, అంబిక కలసి ఎన్టీఆర్ నటించిన వివిధ చిత్రాల్లోని గీతాలను మధురంగా ఆలపించారు. రూపవాణి వ్యాఖ్యాతగా వ్యవహరించగా, సోమేష్ బృందం సంగీత వాద్యసహకారం అందించింది.

నేటి నుంచి మీజిల్స్, రుబెల్లా వ్యాక్సినేషన్

విశాఖపట్నం, మే 25 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో సోమవారం నుంచి మీజిల్స్ రుబెల్లా వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని ప్రారంభించనున్నట్టు డీఎంహెచ్ఓ డాక్టర్ పి.జగదీశ్వరరావు తెలిపారు. ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. మీజిల్స్-రుబెల్లా అన్నవి వైరస్‌లని, వీటివల్ల పిల్లల్లో న్యుమోనియా, విరేచనాలు, మెదడువాపు వంటి తీవ్రమైన సమస్యలు వస్తాయన్నారు. ఈ వ్యాధుల నుంచి పిల్లలను రక్షించేందుకు యూనివర్సల్ ఇమ్యునైజేషన్ ప్రోగ్రామ్‌లో భాగంగా రెండు డోసుల టీకాలను అందిస్తున్నట్టు వెల్లడించారు. మొదటిడోసు 9 నుంచి 12 నెలల వయసులో, రెండో డోసు 12 నుంచి 24 నెలల వయసులో ఇవ్వాల్సి ఉంటుందన్నారు. 2026 నాటికి మీజిల్స్ రుబెల్లా రహిత దేశంగా మార్చాలన్నది కేంద్రం లక్ష్యమని, అందులో భాగంగా మూడు నెలల పాటు జిల్లాలో ప్రత్యేక టీకాల డ్రైవ్ చేపడుతున్నట్టు తెలిపారు. మొదటి విడత ఈ నెల 26 నుంచి 31 వరకు, రెండో విడత జూన్ 23 నుంచి 28, మూడో విడత జులై 21 నుంచి 26 వరకు జరుగుతుందన్నారు. నగర పరిధిలో శ్రామికులు అధికంగా ఉండే ప్రాంతాలు, భవన నిర్మాణ స్థలాలు, వలస కూలీల ప్రాంతాలు, చేపల వేట సాగించే గ్రామాలపై ప్రత్యేకంగా దృష్టిసారించినట్టు చెప్పారు.

దొండపర్తిలో మన్ కీ బాత్

దొండపర్తి, మే 25 (ఆంధ్రజ్యోతి): దక్షిణ నియోజకవర్గం బీజేపీ కో-కన్వీనర్ కారాల మహేష్ ఆధ్వర్యంలో గ్రేటర్ 27వ వార్డు దొండపర్తిలోని కార్యాలయంలో మన్ కీ బాత్ కార్యక్రమం ఆదివారం జరిగింది. ముఖ్యఅతిథిగా మాజీ కార్పొరేటర్ బులుసు జగదీష్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ మన్ కీ బాత్ కార్యక్రమాన్ని టీవీలో వీక్షించారు. మండల అధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శి బీవీవీ సత్యనారాయణ, బూత్ ప్రెసిడెంట్ పండు, ఈశ్వరరావు, రాజేశ్వరరావు, రమేష్, వెంకటేశ్, చంద్రశేఖర్‌రెడ్డి, యాదగిరి రెడ్డి, సాయి తదితరులు పాల్గొన్నారు.

మావోయిస్టులతో ప్రభుత్వం శాంతి చర్చలు జరపాలి

రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తల డిమాండ్


సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ ఎంఎల్ నాయకుడు ప్రసాద్

మహారాణిపేట, మే 25 (ఆంధ్రజ్యోతి): 'ఆపరేషన్ కగారు' పేరుతో పోలీసులు సాగించిన హత్యాకాండపై సుప్రీంకోర్టు సింగిల్ జడ్జితో విచారణ జరిపించి, కేంద్ర ప్రభుత్వం మావోయిస్ట్ పార్టీతో శాంతిచర్చలు జరపాలని వామపక్షాలు, వివిధ ప్రజా సంఘాలు డిమాండ్ చేశాయి. జగదాంబ కూడలి వద్ద సీఐటీయూ కార్యాలయంలో ఆదివారం సాయంత్రం నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో పలువురు మాట్లాడుతూ తక్షణమే కాల్పులు నిలిపివేసి మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ కార్యదర్శి నంబాళ్ల కేశవరావు మృతదేహాన్ని బంధువులకు అప్పగించాలని విజ్ఞప్తి చేశారు. ఏకపక్ష ఎన్‌కౌంటర్లు సరికాదని, ఆదివాసీలకు రక్షణ కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. పర్యావరణానికి హాని కలిగిస్తూ, దేశ ప్రజల ఆస్తులను కార్పొరేట్లకు అప్పగించాలని కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఇదంతా చేస్తోందని ఆరోపించారు. పహల్గాంలో దాడి జరిపిన ఉగ్రవాదులను ఇప్పటివరకు పట్టుకోలేకపోయిందని ఎద్దేవా చేశారు. ఆపరేషన్ కగారు పేరుతో మావోయిస్టు నేతలను, ఆదివాసీలను చంపడం దుర్మార్గమని, వారిపై హత్య కేసు నమోదుకు సుప్రీంకోర్టు ఆదేశించాలని కోరారు. మృతదేహాలకు అంతిమ సంస్కారం చేసుకొనే హక్కు మానవ సమాజానికి ఉందని, దేశంలోని రాజకీయ, ప్రజా, మానవ, దళిత విద్యార్థి సంఘాలు ఈ దమనకాండను ఆపాలని కోరుతున్నాయని తెలిపారు. సీపీఐ ఎంఎల్ నాయకుడు పి.ప్రసాద్, పీడబ్ల్యూవో రాష్ట్ర అధ్యక్షురాలు ఎం.లక్ష్మి, మణి, టీ.శ్రీరామ్మూర్తి, వీఎస్ కృష్ణ, డి.లలిత, చంద్రశేఖర్, చలం, అన్నపూర్ణ, రామచంద్రరావు, ఎం.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఇళ్లు సరే.. వసతులేవీ?

(5వ పేజీ తరువాయి)

వసతుల కల్పనకు సంబంధించి ప్రతి ఇంటికి రూ.80 వేల వరకు ఖర్చు చేయాలి. ఈ లెక్కన సుమారు రూ.1,200 కోట్ల నిధులు అవసరమని అధికారులు అంచనా వేస్తున్నారు. అంత సొమ్ము ప్రస్తుతం వీఎంఆర్డీఏ వద్ద లేదనేది స్పష్టం. దీంతో టెండర్లు పిలిచేందుకు వెనుకంజ వేస్తున్నారు. ప్రతి కాలనీలో రోడ్లు, డ్రెయిన్లు, తాగునీరు, యూజీడీ, పాఠశాల, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, అంగన్‌వాడీ కేంద్రం వంటి వాటిని ఏర్పాటు చేయాలి. ఇళ్ల నిర్మాణాలు ప్రారంభమైన వెంటనే తొలుత తాగునీటికి ఓవర్ హెడ్ ట్యాంకు, పాఠశాల, ఆరోగ్య కేంద్రం, అంగన్‌వాడీ భవన నిర్మాణాలు చేపట్టాలి. ఉదాహరణకు 11 వేల ఇళ్లు నిర్మిస్తున్న పైడివాడ అగ్రహారంలో సుమారు పాతిక నుంచి 30 వేల మంది నివసిస్తారు. వారందరికి తాగునీరు కావాలి, ఆయా కాలనీల్లో బోర్లు వేస్తే అంత నీటి లభ్యత ఉండదు. కొన్నిచోట్ల స్థానికంగా భూగర్భ జలాల ద్వారా నీటి సరఫరా చేసినా వేల ఇళ్ల నిర్మాణాలు చేపట్టే కాలనీల్లో సాధ్యం కాదని ఇంజనీర్లు చెబుతున్నారు. దీంతో సమీపంలోని నదులు, వాగులు, పెద్ద చెరువుల నుంచి నీటిని మళ్లించడానికి పైపు లైన్లు, ఫిల్టర్ పాయింట్లు నిర్మించాలి. ప్రస్తుతం 62 లేఅవుట్లలో పద్మనాభం మండలంలోని నర్సాపురం తదితర లేఅవుట్లు మాత్రమే గోస్తనీ నదికి దగ్గరలో ఉన్నాయి. మిగిలిన లేఅవుట్లలో ప్రజలకు తాగునీరు ఇవ్వాలంటే ఏలేరు, రైవాడ, మేహాద్రిగెడ్డ, తాటిపూడిపై ఆధారపడాలి. అయితే ఇంతవరకు ఇందుకు సంబంధించి ఎటువంటి ప్రతిపాదనలు లేవనే వాదన ఉంది. రోడ్లు, విద్యుత్, డ్రెయిన్లు వంటి వసతుల కల్పన చేయాలంటే కనీసం రెండు నుంచి మూడేళ్ల సమయం పడుతుందంటున్నారు. అంతవరకు పూర్తయిన ఇళ్లల్లో లబ్ధిదారులు ఎలా నివాసం ఉంటారు? ఒకవేళ వసతుల కోసం ఎదురుచూస్తే అప్పటి వరకు ఇళ్లను కాపాడేది ఎవరనేది అధికారులే చెప్పాలి. కాలనీల్లో వసతుల కల్పన గురించి హౌసింగ్ పీడీ సత్తిబాబు వద్ద ప్రస్తావించగా.. ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేసే పనులను వేగవంతం చేశామన్నారు. అయితే వసతుల కల్పన బాధ్యత వీఎంఆర్డీఏదేనని, దీనిపై సంబంధిత అధికారులను కలిసి కోరామన్నారు.

సర్వర్‌తో సమస్యలు

(5వ పేజీ తరువాయి)

అప్‌లోడ్ చేయాలి. అయితే ఆఫ్‌లైన్, ఆన్‌లైన్ దరఖాస్తుల మధ్య కొన్ని పాయింట్లు తేడా వస్తోందని, దీనిపై సంబంధిత టీచర్‌ను పిలిచి మళ్లీ సవరిస్తున్నారు. స్పౌజ్ పాయింట్లు కొందరికి ఆన్‌లైన్‌లో కనిపించడం లేదంటున్నారు.

ఎస్ఎఫ్ఎస్ స్కూల్‌లో హెల్ప్ డెస్క్

బదిలీల దరఖాస్తుల స్వీకరణ నేపథ్యంలో నగరంలోని సీతమ్మధార ఎస్ఎఫ్ఎస్ స్కూల్‌లో హెల్ప్ డెస్క్‌ను ఏర్పాటు చేశారు. ఉమ్మడి జిల్లాలో పలు మండలాల విద్యాశాఖాధికారులు, ఇతర సిబ్బంది ఇక్కడ సేవలందిస్తున్నారు. టీచర్లు పెట్టుకునే ఆన్‌లైన్ దరఖాస్తులతో ఎంఈవోల ద్వారా తెచ్చుకున్న ఆఫ్‌లైన్ దరఖాస్తులను పరిశీలిస్తున్నారు. డీఈవో ఎన్.ప్రేమ్‌కుమార్ నేతృత్వంలో దరఖాస్తుల పరిశీలన కొనసాగింది. దరఖాస్తు చేసేటప్పుడు తలెత్తే ఇబ్బందులను ఉపాధ్యాయులు ఇక్కడకు వచ్చి డీఈవోకు వివరించారు.

ప్రభుత్వ టీచర్లకు గడ్డు పరిస్థితి

(5వ పేజీ తరువాయి)

చేపట్టిన బదిలీల్లో భాగంగా వీరు తప్పనిసరిగా బదిలీ కోసం దరఖాస్తు చేయాలి. తమకు అనుకూలమైన ప్రాంతాల్లోని పాఠశాలలను ఆప్షన్స్‌గా ఇవ్వొచ్చు. కానీ విద్యాశాఖ అధికారులు కొత్త నిబంధనను అమల్లోకి తెచ్చారు. ప్రభుత్వ పాఠశాలలకు నియమితులై, అనంతరం కాలంలో జడ్పీ, మునిసిపల్ పాఠశాలలకు బదిలీ అయి, ఒకేచోట ఎనిమిదేళ్ల సర్వీసు పూర్తయిన ఉపాధ్యాయులంతా తమ సొంత యాజమాన్యమైన ప్రభుత్వ పాఠశాలలకు బదిలీ కావాల్సిందేనని ఉత్తర్వులు జారీ చేశారు. గతంలో ఏజెన్సీలోని ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తూ మైదాన ప్రాంతంలోని జడ్పీ, మునిసిపల్ పాఠశాలలకు బదిలీ అయిన వారు దిక్కుతోచని స్థితిలో పడ్డారు. అనకాపల్లి, విశాఖ జిల్లాల్లో ప్రభుత్వ యాజమాన్య ప్రాథమిక పాఠశాలలు చాలా తక్కువ వున్నాయి. దీంతో ఈ రెండు జిల్లాల్లో పనిచేస్తున్న పలువురు ప్రభుత్వ ఉపాధ్యాయులు అల్లూరి సీతారామరాజు జిల్లాకు తప్పనిసరిగా బదిలీ కావాల్సిన పరిస్థితి నెలకొంది. దీనిపై ఆయా ఉపాధ్యాయులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో ఏజెన్సీ ప్రాంతంలో సంవత్సరాల తరబడి పనిచేసి, మైదాన ప్రాంతానికి వచ్చిన ఉపాధ్యాయులు మళ్లీ ఏజెన్సీకే వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడిందని, దీనిపై ప్రభుత్వం పునరాలోచన చేయాలని, ఉపాధ్యాయ సంఘాలు కూడా స్పందించాలని కోరుతున్నారు.

గందరగోళంగా టీచర్ల బదిలీల ప్రక్రియ

- ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులనాయుడు

నర్సీపట్నం: ఉపాధ్యాయ బదీలల ప్రక్రియ గందరగోళంగా తయారైందని ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులనాయుడు విమర్శించారు. ఆదివారం ఆయన ఇక్కడ మీడియాతో మాట్లాడుతూ, రేషనలైజేషన్‌తో ముడి పెట్టడం వల్ల టీచర్ల బదిలీల ప్రక్రియ సక్రమంగా జరగడం లేదని అన్నారు. ఒకసారి రేషనలైజేషన్ అయిన తర్వాత కనీసం ఐదు సంవత్సరాల వరకు ఉపాధ్యాయులను కదపకూడదని అన్నారు. ఇలా అయితేనే విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు ఉపాధ్యాయులకు అవకాశం ఉంటుందని అన్నారు. మైదాన ప్రాంతం నుంచి ఏజెన్సీకి బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులకు రెండేళ్లకు రెండు పాయింట్లు అదనంగా ఇవ్వాలని డిమాండ్ చేశారు. 2021లో బదిలీపై వచ్చి 2025లో రేషనలైజేషన్ అయిన ఉపాధ్యాయులకు పాత స్టేషన్ పాయింట్లు ఇవ్వాలన్నారు. బదిలీల ప్రక్రియ ఆన్‌లైన్‌లో తలెత్తిన సమస్యలన తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు డీజీనాథ్, నేతలు కురచా వెంకటరమణ, జీపీఎస్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ 73వ వార్డు క్లస్టర్ ఇన్‌చార్జిగా బాలునాయుడు



గాజువాక, మే 25 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ 73వ వార్డు క్లస్టర్ ఇన్‌ఛార్జీగా బలగ బాలునాయుడు నియమితులయ్యారు. పార్టీ కార్యాలయంలో ఆదివారం జరిగిన సమావేశంలో బాలునాయుడును ఎన్నుకున్నారు. తనపై నమ్మకం ఉంచి క్లస్టర్ ఇన్‌చార్జిగా నియమించటం ఆనందంగా ఉందని, పార్టీ పటిష్టతకు తన వంతు కృషి చేస్తానని బాలునాయుడు పేర్కొన్నారు.

ఉక్కు శివాలయంలో ఘనంగా మాసశివరాత్రి పూజలు

ఉక్కుటౌన్‌షిప్, మే 25 (ఆంధ్రజ్యోతి): స్టీల్‌ప్లాంట్ లోపల గల అతి పురాతన పర్వత సమేత లింగేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం మాస శివరాత్రి పూజలు ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి మధ్యాహ్నం అన్నసమారాధన చేపట్టారు. అలాగే ఆలయ ప్రాంగణంలో కొలువై యున్న శ్రీదేవి, భూదేవి సమేత వెంకటేశ్వర స్వామికి, శ్రీవల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్య స్వామికి విశేష పూజలు చేశా రు. పూజల్లో ఉక్కు ఉద్యోగులు యేల్లేటి శ్రీనివాసరావు, పి.రామచంద్రరరావు, గోపీనాయుడు, మహాదేవ్, అప్పలరెడ్డి పాల్గొన్నారు.

వైభవంగా బంగారమ్మ తల్లి ఉత్సవాలు



పూజలందుకుంటున్న బంగారమ్మ తల్లి

అక్కిరెడ్డిపాలెం, మే 25 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 69 వార్డు నాతయ్యపాలెం, షీలానగర్ పరిసర కాలనీల ఆరాధ్యదేవత బంగారమ్మతల్లి పండుగ మహోత్సవాలు వైభవంగానిర్వహిస్తున్నారు. తొమ్మిది రోజులపాటు జరిగే ఈ ఉత్సవాల్లో భాగంగా ఆదివారం వివిధ పుష్పాలు, నగలతో అలంకరించిన అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని కాలనీ ప్రజలు మేళతాలాలతో కాలనీలో పెద్ద ఎత్తున ఊరేగింపు నిర్వహించారు. ఈ ఊరేగింపులో ఆలయ ధర్మకర్తలతో పాటు భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈనెల 29న అమ్మవారి పండుగ అనుపు మహోత్సవం నిర్వహించనున్నట్టు ఆలయ ధర్మకర్తలు తెలిపారు.

విద్యార్థులకు చేతి రాతలో శిక్షణ

గాజువాక, మే 25 (ఆంధ్రజ్యోతి): గాజువాక శాఖ గ్రంథాలయంలో నిర్వహించిన వేసవి శిక్షణ శిబిరంలో ఆదివారం విద్యార్థులకు చేతి రాత శిక్షణ ఇచ్చారు. చక్కగా చేతి రాత రాయడంపై మెలకువలు నేర్పించారు. అలాగే వార్త పత్రికలు చదవడం, కథలు రాయడం, చదవడం నేర్పించారు. రోజుకు ఒక్క అంశంపై శిక్షణ ఇసున్నట్టు గ్రంథాలయాధికారిబి.చంద్రకళ తెలిపారు.

సినిమా గైడ్

- **ఏస్** : లీలామహల్, శ్రీరామా, ఊర్వశి (కంచరపాలెం), సుకన్య (గోపాలపట్నం), నటరాజ్-1 (పెందుర్తి), మోహిని (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), లిఖిత (శ్రీహరిపురం)
- **మిషన్ ఇంపాజిబుల్** : జగదాంబ
- **ఫైనల్ డెస్టినేషన్** : శారద
- **నిశ్శబ్దప్రేమ** : రమాదేవి, నరసింహ (గోపాలపట్నం),
- **సింగిల్** : మెలోడి, శరత్, కామేశ్వరి, గోకుల్, లక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), మోహిని (గాజువాక), సప్తగిరి (తగరపువలస)
- **శుభం**: శ్రీకన్య, కిన్నెర, లక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), గణేష్ (తగరపువలస)
- **హిట్3**: రమాదేవి, సంగం, శ్రీరామ, గోకుల్, మౌర్య (గోపాలపట్నం), సీతారామయ్య (పరవాడ), తాతా (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 18, టమాటా 16, వంకాయలు (తెలుపు) 20, వంకాయలు (నలుపు) 20, బెండ 18, పచ్చిమిర్చి 28, కాకర 32, బీర 36, ఆనపకాయ 14, కాలీఫ్లవర్ 30, క్యాబేజి 16, క్యారెట్ 40 దొండ 18, బంగాళ దుంపలు 18, అరటికాయ(పె)9, మునక్కాడలు (కిలో) 54,అల్లం (పాతది)54, బరబాటి 24, ముల్లంగి 30, నిమ్మకాయలు (కిలో) 80, బద్దచిక్కుడు 40, దోస 16, వెల్లుల్లి (పెద్దవి) 100, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 98, కీరదోస 28, కాప్సికమ్ 54, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 36 చిలగడదుంపలు 38, కంద 64, దేముడు చిక్కుడు 64, గోరుచిక్కుడు 32, కూర పెండలం 26, బ్రకోలి 45, నూల్‌కోల్ 34, పనసపొట్టు 160, కొండఉసిరి 100, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 3, చుక్కకూర 3, పాలకూర 3, తోటకూర 3,మామిడికాయలు 20, బూడిద గుమ్మడికాయ 20, క్రపెండలం 18, బొప్పాయి 28, జామకాయలు (కిలో) 80.

కోడిగుడ్లు (నెక్) (వంద - రూ.లలో)	
విశాఖపట్నం	525
విజయనగరం	529
శ్రీకాకుళం	529

చికెన్ ధరలు	
బ్యాగ్	
రైతు ధర	105
లైవ్ ధర	125
విత్ స్కిన్	220
స్కిన్‌లెస్	230

ఇస్లాంపేట బీసీ వెల్ఫేర్ హాస్టల్ నూతన భవనం ప్రారంభం



హాస్టల్ ప్రాంగణంలో మొక్కలు నాటుతున్న జిల్లా కలెక్టర్ హరింధర ప్రసాద్

ఉక్కుటౌన్‌షిప్, మే 25 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 77వ వార్డు ఇస్లాంపేట బీసీ వెల్ఫేర్ హాస్టల్ నూతన భవనాన్ని జిల్లా కలెక్టర్ హరింధిరప్రసాద్ ఆదివారం ప్రారంభించారు. ఆర్ఎస్ఎల్ఆర్ నిప్పన్ స్టీల్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ సీఎస్ఆర్ ద్వారా రూ.97 లక్షలతో నిర్మించిన భవనాన్ని ప్రారంభించిన అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులు చక్కగా చదువుకునేందుకు ప్రభుత్వం అన్ని సౌకర్యాలు, వసతులు కల్పిస్తోందన్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకొని ఉన్నత లక్ష్యాలను నిర్ధేశించుకొని భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు.

అనంతరం హాస్టల్ ప్రాంగణంలో కలెక్టర్ మొక్కలు నాటారు. కార్యక్రమంలో సంస్థ ఈడీ డీఎస్ వర్మ, బీసీ వేల్ఫేర్ అధికారి శ్రీదేవి పాల్గొన్నారు.

మహానాడుకు భారీ సంఖ్యలో తరలివెళ్లాలి

టీడీపీ 75వ వార్డు అధ్యక్షుడు నమ్మి అప్పారావు



సమావేశంలో మాట్లాడుతున్న అప్పారావు

పెదగంట్యాడ, మే 25 (ఆంధ్రజ్యోతి) : కడపలో మంగళవారం నుంచి మూడు రోజుల పాటు నిర్వహించనున్న మహానాడును విజయవంతం చేయాలని టీడీపీ 75వ వార్డు అధ్యక్షుడు నమ్మి అప్పారావు పార్టీ నాయకులు, కార్యకర్తలను కోరారు. సీతానగరం కమ్యూనిటీ హాలు ఆవరణలో ఆదివారం నిర్వహించిన మహానాడు సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడుతూ వార్డు నుంచి ఎక్కువ మంది నాయకులు మహానాడుకు బయల్దేరాలని కోరారు. టీడీపీ వార్డు ప్రధాన కార్యదర్శి ములకలపల్లి పెంటయ్య మాట్లాడుతూ ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న మహానాడు విజయవంతం చేయడం ద్వారా తెలుగుదేశం పార్టీకి ఉన్న ప్రజాదరణను బహిర్గతం చేయాలని కోరారు. టీడీపీ జిల్లా కార్యదర్శి గోక్యాడ ముత్యాలు, స్టీల్‌ప్లాంట్ బీసీ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యదర్శి శ్రీమునిరి శ్రీనివాసరావు, టీడీపీ నాయకులు నంబారు పైడియ్య, ఎస్ ఈశ్వరరావు, మొల్లి పెంటిరాజు, కె సన్యాసమ్మ, ఉరుకూటి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

డిప్యూటీ మేయర్‌ను కలిసిన గీత సహ కులాల సంఘం సభ్యులు



జీవీఎంసీ డిప్యూటీ మేయర్‌ను కలిసిన గీత సహకులాల సంక్షేమ సంఘం ప్రతినిధులు

పెదగంట్యాడ, మే 25 (ఆంధ్రజ్యోతి) : పారిశ్రామిక ప్రాంత గీత సహకులాల సంక్షేమ సంఘం సభ్యులు ఆదివారం జీవీఎంసీ డిప్యూటీ మేయర్ దల్లి గోవిందరెడ్డిని పెదగంట్యాడలోని ఆయన కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాన్ని అందజేశారు. జీవీఎంసీ పరంగా గీత సహకులాలకు తగిన సహకారం అందించాలని కోరారు. డిప్యూటీ మేయర్‌ను కలిసిన వారిలో సంఘం గౌరవాధ్యక్షుడు నెల్లి సాధూరావు, వైస్ ఛైర్మన్ అండిబోయిన అప్పారావు, ప్రధాన కార్యదర్శి ఒనిమి నాగేశ్వరరావు, ఉపాధ్యక్షుడు అండిబోయిన పెదనూకరాజు తదితరులు ఉన్నారు.

కొనసాగుతున్న స్టీల్‌ప్లాంట్ కాంట్రాక్టు కార్మికుల నిరవధిక సమ్మె

ఉక్కుటౌన్‌షిప్, మే 25 (ఆంధ్రజ్యోతి) : స్టీల్‌ప్లాంట్ కాంట్రాక్టు కార్మికులు చేపడుతున్న నిరవధిక కార్మిక సమ్మె కొనసాగుతోంది. ఆదివారం కార్మికులు విధులకు హాజరుకాకుండా తమ నిరసన తెలిపారు. సమ్మె చేపట్టి ఆరు రోజులు కావస్తున్నా యాజమాన్యం చర్చలకు పిలవలేదని కార్మిక నాయకులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సమ్మె చేస్తే, యాజమాన్యం మాత్రం కార్మిక వర్గాన్ని నిర్లక్ష్యం చేస్తూ బయట నుంచి కొంత మంది వ్యక్తులను తీసుకొచ్చి పనులు చేయిస్తోందని, ఇది ప్లాంట్ భద్రతకు చాలా ప్రమాదమని కార్మిక నాయకులు అంటున్నారు. ఇదిలావుండగా సోమవారం ఆర్ఎల్‌సీ ఆధ్వర్యంలో ఉక్కు యాజమాన్యం, కార్మిక సంఘాల మధ్య జరగనున్న చర్చలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. చర్చల విషయమై కార్మికులు ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. కార్మికుల అనుకూల నిర్ణయాన్ని యాజమాన్యం వెలువరించాలని కార్మికులు కోరుతున్నారు.

దువ్వాడ రైల్వే స్టేషన్లో స్వచ్ఛభారత్ అవగాహన ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న రైల్వే యూజర్స్, వివిధ అసోసియేషన్ల సభ్యులు

కూర్మన్నపాలెం, మే 25 (ఆంధ్రజ్యోతి) : జూన్ 5న ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని జడ్ఆర్‌సీసీ సభ్యుడు కంచుమూర్తి ఈశ్వర్ నేతృత్వంలో ఆదివారం దువ్వాడ రైల్వేస్టేషన్ నాలులో ప్లాట్‌ఫారమ్‌లో స్వచ్ఛ భారత్, పరిశుభ్రత అవగాహన ర్యాలీ నిర్వహించారు. జీవీఎంసీ 88 వవార్డు కార్పొరేటర్ ముత్యాలు నాయుడు ముఖ్య అతిథిగా పాల్గొని జెండా ఊపి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ప్రశాంతి ఎక్స్‌ప్రెస్, తిరుమల ఎక్స్‌ప్రెస్ రైళ్ల వచ్చే సమయాల్లో ప్రయాణికులకు అవగాహన కలిగేలా ర్యాలీ నిర్వహించారు.ఈ సందర్భంగా కార్పొరేటర్ ముత్యాలు, కంచుమూర్తి ఈశ్వర్, మాట్లాడుతూ దువ్వాడ రైల్వే స్టేషన్ పరిసరాలు పరిశుభ్రంగా ఉండాలన్న లక్ష్యంతో ఈ స్వచ్ఛ భారత్, అవగాహనా ర్యాలీని రైల్వే ఉన్నతాధికారుల అనుమతితో నిర్వహించామన్నారు. ఈ సందర్భంగా ప్రశాంతి ఎక్స్‌ప్రెస్‌లోని సాధారణ భోగీల ప్రయాణికులకు 250 మినరల్ వాటర్ బాటిల్స్‌ను పంపిణీ చేశారు. కార్యక్రమంలో కూర్మన్నపాలెం లయన్స్ క్లబ్ అధ్యక్షుడు అమిరెడ్డి మురళీధర రెడ్డి, కెవి సుబ్బరాజు, కెవి ప్రసాద్, దువ్వాడ రైల్వే యూజర్సు అసోసియేషన్ అధ్యక్షులు వి.జాషువాకామేశ్వరరావు,రవి, పీకెఎం లక్ష్మీ, మానవ వనరుల సంఘం సభ్యులు డి.విజయ, దువ్వాడ రైల్వే సిబ్బంది ఎంఎస్‌రావు, పల్లవి, రవి, సుజాత, ఆర్పీఎఫ్ సిబ్బంది, విజ్ఞాన్ ఇంజనీరింగ్ కళాశాల ఎన్ఎస్ఎస్ వలంటీర్లు, ఉపాధ్యాయులు, స్పందన చేయూత ఫౌండేషన్, మానవ వికాస వేదిక, మానవత, సత్య సాయి సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.

3 నుంచి బాలాజీ దివ్యక్షేత్ర ద్వితీయ వార్షిక బ్రహ్మోత్సవాలు



అన్నదాన నిధికి 25 వేల రూపాయలు విరాళం అందజేస్తున్న అశ్వినీకుమర్, శోభారాణి దంపతులు

అక్కిరెడ్డిపాలెం, మే 25 (ఆంధ్రజ్యోతి) : షీలానగర్ ఎస్టీబీఎల్ ప్రాంగణంలోని తిరుమల బాలాజీ దివ్యక్షేత్ర ద్వితీయ వార్షిక బ్రహ్మోత్సవాల గోడపత్రికను పాలకమండలి సభ్యులు ఆదివారం ఆవిష్కరించారు. జూన్ 3 నుంచి 7వ తేదీ వరకు ఈ బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నట్టు సభ్యులు తెలిపారు. జూన్ 3న సాయంత్రం అంకురార్పణంతో ప్రారంభమయ్యే ఈ బ్రహోత్సవాల్లో జూన్ 4న ఉదయం గరుడ ప్రతిష్ఠ, ధ్వజారోహణం, జూన్ 5న ఉదయం శ్రీవారి పెద్ద శేషవాహన సేవ, సాయంత్రం శ్రీవారి గరుడ వాహన సేవ, జూన్ 6 ఉదయం సూర్య ప్రభవాహన సేవ, సాయంత్రం శ్రీవారి కల్యాణం అనంతరం అన్నప్రసాద వితరణ, జూన్ 7న ఉదయం వసంతోత్సవం, శ్రీవారి చక్రస్నానంతో బ్రహ్మోత్సవాలు ముగియనున్నాయని తెలిపారు.. ఈ సందర్భంగా శ్రీవారి అన్న ప్రసాద మూలనిధికి షీలానగర్‌కు చెందిన అశ్వినీకుమర్, శోభారాణి దంపతులు రూ.25 వేలు విరాళాన్ని పాలకమండలి సభ్యులకు అందజేశారు.

వామపక్ష పార్టీల కబంధహస్తాల నుంచి బయటపడండి

ఉక్కు కార్మికులకు కూటమి నేతల వినతి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కూటమి నేతలు

గాజువాక, మే 25 (ఆంధ్రజ్యోతి) : స్టీల్‌ప్లాంట్‌లో జరుగుతున్న ఉద్యమాన్ని అడ్డం పెట్టుకొని వైసీపీ నాయకులు ఇస్తున్న ప్యాకేజీకి ఆశపడి కూటమి ప్రభుత్వం, ప్రజా ప్రతినిధులపై విషం చిమ్ముతున్న వామపక్ష సంఘాలు, వామపక్ష నాయకుల కబంధహస్తాల నుంచి కాంట్రాక్టు కార్మిక వర్గం బయటపడాలని కూటమి నాయకులు అన్నారు. గాజువాక టీడీపీ కార్యాలయంలో ఆదివారం జరిగిన విలేకరుల సమావేశంలో పలువురు నాయకులు మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వ హయాంలో అదానీకి పోర్టును అమ్మి స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరించి భూములను కొట్టేయాలని ప్రయత్నించిన పార్టీకి వత్తాసు పలికిన వాపపక్ష నాయకులకు స్టీల్‌ప్లాంట్ అంశంపై మాట్లాడే అర్హత లేదన్నారు. ప్లాంట్‌కు స్థానిక ఎంపీ, ఎమ్మెల్యేలు మంచి ప్యాకేజీ తీసుకొచ్చారని, సంస్థకు, కార్మిక వర్గానికి మంచి చేయాలని నిత్యం ప్రయత్నిస్తున్నారన్నారు. కానీ కార్మిక వర్గాన్ని వామపక్షాలు తప్పుత్రోవ పట్టిస్తున్నారన్నారు. వామపక్ష కార్మిక సంఘాలు కార్మికుల విశ్వాసాన్ని కోల్పోయారన్నారు. ప్లాంట్ ఉత్పత్తిలో కార్మిక వర్గం భాగస్వామ్యులు కావాలన్నారు. కార్యక్రమంలో నాయకులు ప్రసాదుల శ్రీనివాస్, కరణంరెడ్డి నరసింగరావు, గంధం వెంకటరావు, కోగంటి లెనిన్‌బాబు, నమ్మి సింహాద్రి, విళ్లా రామ్మోహన్‌కుమార్, కొల్లి శివనాగేశ్వరరావు, శ్రీనివాస నాయుడు, బాలకృష్ణ, రమణ పాల్గొన్నారు.

వైద్య శిబిరంలో 300 మందికి పరీక్షలు



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

అగనంపూడి, మే 25 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 85వ వార్డు పరిధి దానబోయినపాలెం గ్రామ కమిటీ ఆధ్వర్యంలో స్థానిక సీతారామాలయం ప్రాంగణంలో ఆదివారం ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరంలో సుమారు 300 మందికి వైద్య పరీక్షలు నిర్వహంచి మందులను అందజేశారు. ఈ శిబిరాన్ని టీడీపీ వార్డు నేత ఇల్లపు ప్రసాద్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. కార్యక్రమంలో గ్రామ కమిటీ నాయకులు అమర పిన్ని అప్పారావు, ఎల్‌వీ.రమణ, బండారు చందూరమేశ్, బి.సత్యనారాయణ, హనుమంతురావు, వంకర రాము, దుల్ల ఈశ్వరరావు, త్రినాథ్, అచ్యుత్, విందుల నారాయణరావు, ఈగల నరసింగరావు పాల్గొన్నారు.

పోపూరి శ్రీరామ్మూర్తి మృతి టీడీపీకి తీరని లోటు



శ్రీరామ్మూర్తికి నివాళులు అర్పిస్తున్న నల్లూరు సూర్యనారాయణ తదితరులు

కూర్మన్నపాలెం, మే 25 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 86వ వార్డు భరత్‌నగర్‌కు చెందిన టీడీపీ సీనియర్ నాయకులు, వీరాభిమాని, ఉక్కు ఉద్యోగి పోపూరి శ్రీరామ్మూర్తి (57) మృతి టీడీపీకి తీరని లోటు అని ఆ పార్టీ వార్డు అధ్యక్షుడు నల్లూరి సూర్యనారాయణ అన్నారు. ఆదివారం శ్రీరామ్మూర్తి సంస్మరణ సభలో పాల్గొని ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా సూర్యనారాయణ మాట్లాడుతూ వార్డులో అందరితో కలసిమెలసి ఉంటూ, సేవా కార్యక్రమాలో పాల్గొనడం, కూర్మన్నపాలెం కాకతీయ సంఘంలో ప్రతినిధిగా అన్నింటా చురుగ్గా పాల్గొనేవారన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ లేళ్ల కోటేశ్వరరావు, దామా సుబ్బారావు, వేగుంట శ్రీనివాస్, అన్నే ప్రసాద్, చిరట్ల సాయిరామ్, బెల్లం వాసుబాబు, ప్రసాద్, కర్రి ఈశ్వరరావు, కాట్రగడ్డ దుర్గా ప్రసాద్, బొడ్డ రమణ, మురళీ, శ్రీను, పరదేశి తదితరులు పాల్గొన్నారు.

టీఎస్సార్ టీబీకేలో జాబ్ మేళా.. 33 మందికి ఉద్యోగావకాశాలు

ఆటోనగర్, మే 25 (ఆంధ్రజ్యోతి): శ్రీనగర్ టీఎస్సార్ టీబీకే కళాశాలలో లీఫార్మా ఆధ్వర్యంలో నిర్వహించిన జాబ్‌మేళాలో 70 మంది విద్యార్థులు పాల్గొనగా, 33 మంది విద్యార్థులు ఎంపికయ్యారు. ఎంపికైన విద్యార్థులను ఆదివారం కళాశాలలో అధ్యాపక బృందం అభినందించారు. ఈ సందర్భంగా కళాశాల ఛైర్మన్ తలశిల బలరామకృష్ణ మాట్లాడుతూ కృషి, సాధించాలన్న తపన, పట్టుదల ఉన్న విద్యార్థులు ఏ రంగాల్లోనైనా రాణిస్తారన్నారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ తలశిల ఉమా మహేశ్వరరావు, ప్రిన్సిపాల్ ఎస్.విష్ణువర్ధన్, వైస్ ప్రిన్సిపాల్ సుభాషిణి, ప్లేస్‌మెంట్ అధికారి కె.కుసుమ తదితరులు పాల్గొన్నారు.

‘సక్రమంగా లేకుంటే సహించేది లేదు’

మల్కాపురం, మే 25 (ఆంధ్రజ్యోతి): మల్కాపురం పోలీసు స్టేషన్ పరిధిలో ఉన్న రౌడీ షీటర్లు సక్రమంగా లేకపోతే సహించేది లేదని, దాడులకు దిగినా, దౌర్జన్యాలు చేసినా, దాడులకు మద్దతు తెలిపినా కఠిన చర్యలు తప్పవని మల్కాపురం సీఐ గొలగాని అప్పారావు యాదవ్ హెచ్చరించారు. పోలీసుస్టేషన్‌లో రౌడీషీటర్లకు ఆదివారం కౌన్సెలింగ్ నిర్వహించారు. రౌడీషీటర్లు సత్ప్రవర్తనతో ఉంటే వారికి మంచి జరుగుతుందని, లేకుంటే చట్టపరమైన ఇబ్బందులు తప్పవని సీఐ స్పష్టంచేశారు. ప్రతి రౌడీషీటర్‌పై నిఘా ఉంటుందని తెలిపారు. గొడవలకు దూరంగా, మంచిగా ఉండేవారి రౌడీషీట్‌ను ఎత్తివేసేందుకు ప్రయత్నిస్తామని అన్నారు.

చేపల చెరువులకు కోళ్ల వ్యర్థాలు

విశాఖపట్నం, మే 25 (ఆంధ్రజ్యోతి) : అనకాపల్లి జిల్లాలోని చేపల చెరువులకు కోళ్ల వ్యర్థాలను తరలిస్తున్న మూడు వాహనాలను జీవీఎంసీ ప్రజారోగ్య విభాగం సిబ్బంది నరవ వద్ద ఆదివారం పట్టుకున్నారు. నగరంలోని చికెన్ దుకాణాల నుంచి కోళ్ల వ్యర్థాలను వాహనాల ద్వారా సేకరించి, వాటిని కాపులుప్పాడలోని డంపింగ్ యార్డుకు తరలించేందుకు జీవీఎంసీ టెండర్లు పిలిచింది. జోన్ల వారీగా కాంట్రాక్టర్లను ఎంపిక చేసి వారికి ఆ పనులు అప్పగించింది. కాంట్రాక్టర్లు ఏ వాహనం ద్వారా కోళ్ల వ్యర్థాలను డంపింగ్ యార్డుకు తరలిస్తామన్న వివరాలను ప్రజారోగ్య విభాగం అధికారులకు ముందుగానే అందజేశారు. ఆయా వాహనాల ద్వారా మాత్రమే డంపింగ్ యార్డుకు వ్యర్థాలను తరలించాలి. కానీ కొంతమంది కాసులకు కక్కుర్తిపడి అనధికారికంగా చికెన్ దుకాణాల నుంచి కోళ్ల వ్యర్థాలను సేకరించి అనకాపల్లి జిల్లాలోని చేపల చెరువులకు విక్రయించి భారీగా సొమ్ము చేసుకుంటున్నారు. కోళ్ల వ్యర్థాలకు నగరంలో భారీ డిమాండ్ ఉండడంతో కొంతమంది రాజకీయ నాయకుల అండతో అధికారులను ఎదిరించి మరీ దుకాణాల నుంచి యథేచ్ఛగా వ్యర్థాలను చేపల చెరువులకు తరలిస్తున్నారు. అధికారులు వారిని పట్టుకుంటే ప్రజాప్రతినిధుల ద్వారా ఒత్తిడి చేసి వాహనాలను విడిపించుకుని వెళ్లిపోతున్నారు. కోళ్ల వ్యర్థాలను తిన్న చేపలు తినడం వల్ల కేన్సర్ వంటి వ్యాధులు వస్తాయని వైద్యులు చెబుతున్నారు. నరవ వద్ద కోళ్ల వ్యర్థాలను తరలిస్తున్న మూడు వాహనాలను అధికారులు ఆదివారం పట్టుకున్నారు. వాటిని పోలీస్ స్టేషన్‌కు అప్పగించి కేసులు నమోదు చేసేందుకు సిద్ధమవగా, కొంతమంది ప్రజాప్రతినిధులు నుంచి ఫోన్లు రావడంతో వాటిని విడిచిపెట్టేశారు. కొందరు సిబ్బంది వ్యాపారుల నుంచి డబ్బులు తీసుకోవడం వల్లే పట్టుబడిన వాహనాలపై ఎలాంటి చర్యలు తీసుకోలేదన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

ఆర్‌ఓ ప్లాంట్ ప్రారంభం



ఆర్‌ఓ ప్లాంట్ ప్రారంభ కార్యక్రమంలో కార్పొరేటర్ బొమ్మిడి రమణ తదితరులు

ఎన్.ఎ.డి.జంక్షన్, మే 25 (ఆంధ్రజ్యోతి): అల్లూరి సీతారామరాజునగర్ పార్కులో కాల నీవాసులు, గజపతిరాజు సహకారంతో ఏర్పాటు చేసిన ఆర్‌ఓ ప్లాంట్‌ను కార్పొరేటర్ బొమ్మిడి రమణ ఆదివారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ వేసవిలో పార్కుకు వచ్చే పాదచారులందరికీ ఉపయోగకరంగా ఉంటుందని, ఈ ప్లాంట్ ఏర్పాటుకు సహకరించిన దాతలను ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో కాలనీ అసోసియేషన్ సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

భావాలను వ్యక్తీకరించే సాధనమే చిత్రకళ

మల్కాపురం, మే 25 (ఆంధ్రజ్యోతి): భాషా భేదాలతో పని లేకుండా మనసులోని భావాలను స్పష్టంగా వ్యక్తీకరించే సాధనమే చిత్రకళ అని ప్రముఖ చిత్రకారుడు ద్వారాపూడి శ్రీనివాసమనోహర్ అన్నారు. మల్కాపురం శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న బాలల వేసవి శిక్షణ శిబిరంలో ఆదివారం చిత్రకళపై ఆయన శిక్షణ ఇస్తూ మన చరిత్ర, సంస్కృతిలో చిత్రకళకు ఎంతో ప్రాధాన్యం ఉందన్నారు. రంగుల ఎంపిక, ప్రకృతి దృశ్యాల చిత్రీకరణలో చిత్రకారుడి ప్రతిభ దాగి ఉంటుందన్నారు. అనంతరం వివిధ రకాల చిత్రాలను తేలికైన పద్ధతిలో ఎలా చిత్రీకరించాలో బాలలకు తెలియజేశారు. ఈ సందర్భంగా ప్రకృతి దృశ్యాలపై బాలలు వేసిన చిత్రాలను ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయాధికారి అజేయ్‌కుమార్, జాతీయ సేవా పథకం వాలంటీర్లు సునీత, జ్యోతిర్మయి, పాఠకులు, చిన్నారులు పాల్గొన్నారు.

స్కూటరుపై మహానాడుకు దివ్యాంగుడు



స్కూటర్ యాత్రను ప్రారంభిస్తున్న ఎంపీ శ్రీభరత్

విశాఖపట్నం, మే 25 (ఆంధ్రజ్యోతి) : కడపలో జరగనున్న టీడీపీ మహానాడుకు విశాఖ పార్లమెంట్ విభిన్న ప్రతిభావంతులు సెల్ అధ్యక్షుడు ఇసరపు వాసు స్కూటరుపై బయలుదేరారు. ఈమేరకు ఎయిర్‌పోర్టు వద్ద స్కూటరు యాత్రను ఎంపీ ఎం. శ్రీభరత్ ఆదివారం జెండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ విశాఖ పార్లమెంట్ అధ్యక్షుడు గండి బాబ్జి, ఉత్తర నియోజకవర్గ నాయకుడు వెల్లంకి భరత్, విజయనగరం డీసీఎంఎస్ ఛైర్మన్ గొంప కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా సివిల్స్ ప్రిలిమినరీ పరీక్షలు



ఆళ్వార్స్ కళాశాల ప్రవేశ మార్గం వద్ద అభ్యర్థులు

వేపగుంట మే 25 (ఆంధ్రజ్యోతి): గోపాలపట్నం పెట్రోల్ బంకు దరి ఆర్.ఆర్.వి. పురంలో ఉన్న ఆళ్వార్స్ క్యాంపస్‌లో సివిల్స్ ప్రిలిమినరీ పరీక్షలు ఆదివారం ప్రశాంతంగా జరిగాయి. కళాశాలలో యూపీఎస్సీ అధికారులు, జిల్లా యంత్రాంగం పటిష్ట ఏర్పాట్లు చేశారు. అరగంట ముందు అభ్యర్థులను పరీక్షా కేంద్రంలోనికి అనుమతించారు. ప్రతీ ఒక్కరినీ క్షుణ్ణంగా పరిశీలించాక పోలీసులు లోనికి పంపారు. పరీక్షా కేంద్రం ఆవరణలో ఎవరూ సెల్ ఫోన్‌లు వినియోగించకుండా జామర్స్ ఏర్పాటు చేశారు. ఇక్కడి కేంద్రంలో 480 మంది అభ్యర్థులు హాజరు కావాల్సి ఉండగా 85 శాతం పరీక్ష రాశారని అధికారులు తెలియజేశారు.

ముగిసిన చిన్నారుల వేసవి శిక్షణ తరగతులు



శిక్షణ అనంతరం అందుకున్న ధ్రువీకరణ పత్రాలతో విద్యార్థులు, నిర్వాహకులు

ఎన్.ఎ.డి.జంక్షన్, మే 25 (ఆంధ్రజ్యోతి): మర్రిపాలెం ఉడాకాలనీ దరి రామచంద్ర మిషన్, హార్ట్‌ఫుల్‌నెస్ సంస్థ ఆధ్వర్యంలో 4 నుంచి 15 సంవత్సరాలలోపు చిన్నారులకు ధైర్యం పెంపొందించుకోవటం, జ్ఞాపకశక్తి పెంపునకు వీలుగా నిర్వహించిన మూడు రోజుల వేసవి శిక్షణ తరగతులు ఆదివారం ముగిశాయి. ముఖ్యఅతిథిగా పాల్గొన్న రామచంద్ర మిషన్ విశాఖపట్నం జోనల్ కో-ఆర్డినేటర్ నాగశర్మ మాట్లాడుతూ విద్యార్థి దశలో చదువుతో పాటు ఇలాంటి కోర్సులు నేర్పించటం వారి పురోభివృద్ధికి దోహదపడుతుందన్నారు. జ్ఞాపకశక్తి పెంపునకు ఉపాధ్యాయులు చెప్పిన మెదడు వ్యాయామాలు కొనసాగించాలన్నారు. మండల ఆర్టు, గింజల పెయింటింగ్, ఫ్యాబ్రిక్ ఆర్ట్, తోలుబొమ్మల కథలు ఆసక్తిని కలిగిస్తాయన్నారు. విద్యార్థులు కళ్లకు గంతలు కట్టుకొని బొమ్మలు, రంగులు గుర్తించటం, పుస్తకాలు చదవటం అందరినీ విశేషంగా ఆకట్టుకుంది. ఈ ఉచిత శిక్షణ శిబిరంలో పాల్గొన్న 70మంది విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో పద్మలీల, రమా విద్యాసాగర్, పద్మిని, గాయత్రి, శిరిష, సరోజ తదితరులు పాల్గొన్నారు.